తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-2-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 07 పేజీలు: 10+4 వెల: 6.50



పాఠశాల గత వారంలోని పై విశేషాలు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


కీలక వడ్డీరేట్లు యధాతథం: ఆర్బీఐ గవర్నర్ 5లో

మరో మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీ: కవిత 7లో


GOVERNMENT OF INDIA

పటిష్టమైన మౌలిక సదుపాయాలు, సమర్థవంతమైన విద్య: సమర్థవంతమైన విద్య, దృఢమైన భారతదేశ నిర్మాణం

వంటశాల షెడ్‌లు అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, ప్రహరీగోడ మరియు విద్యాలయాలలో క్రీడా మైదానాలు నిర్మింపబడుతున్నాయి



వికసిత భారత్ - రోజ్‌గార్ మరియు ఆజీవిక మిషన్ కొరకు గ్యారంటీ (గ్రామీణ) : విబి-జీరామ్ జీ

(వికసిత భారత్ - జీ రామ్ జీ) చట్టం, 2025

125 రోజులు

వేతన ఉపాధి హామీ



CBC 35101/13/0109/2526




శుక్రవారం అండర్-19 వన్డేలో ఇంగ్లండ్‌పై గెలిచిన భారత్ జట్టు విజయోత్సవ హేల

# అండర్-19 వన్డే వరల్డ్ కప్ భారత్‌దే

### ఆరోసారి గెలిచిన ఇండియా


### 80 బంతుల్లోనే 175 పరుగులు తీసిన వైభవ్ సూర్యవంశీ

### 2022లోనూ ఇంగ్లండ్ జట్టును ఓడించి టైటిల్‌ను సాధించిన భారత్



**న్యూఢిల్లీ:** అండర్ 19 ప్రపంచకప్ 2026లో టీమిండియా విజేతగా నిలిచింది. అద్వితీయమైన ప్రదర్శనతో ఆరో టైటిల్‌ను ముద్దాడింది. ఇంగ్లండ్‌తో గురువారం జరిగిన ఫైనల్లో సమష్టిగా రాణించిన భారత్ 100 పరుగుల తేడాతో గెలుపొం దింది. బ్యాటింగ్‌లో వైభవ్ సూర్యవంశీ, బౌలింగ్‌లో >>2

## 3 వారాల్లోగా నిర్ణయం తీసుకోండి



### ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు సుప్రీం తుది గడువు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి6:** ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు చివరి అవకాశం ఇచ్చింది. ఈ అంశంపై మూడు వారాల్లోగా నిర్ణ యం తీసుకోవాలని స్పష్టమైన గడువు విధిం చింది. నిర్ణీత గడువులోగా నిర్ణయం ప్రకటిం చకపోతే కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి ఉం టుందని తీవ్రంగా హెచ్చరించింది. పార్టీ ఫిరా యించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో ఇప్పటికే స్పీకర్‌కు చాలా సమయం ఇచ్చామని గత విచారణలో వ్యాఖ్యానించిన కోర్టు, ఈసారి మరింత కఠినంగా వ్యవహరించింది. విచారణ సం దర్భంగా ప్రభుత్వం తరఫున న్యాయవాది అభి షేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇప్పటికే విచారణ జరుపుతున్నారని కోర్టుకు తెలిపారు. ఒక ఎమ్మెల్యే పిటిషన్‌పై విచారణ పూర్తయిందని, మరో ఇద్దరిపై ప్రక్రియ కొనసాగుతోందని వివ రించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిర్ణ యం తీసుకోవడానికి మరింత సమయం కావాలని ఆయన కోరారు. అసెంబ్లీ >>2

# నిధులిచ్చేవారినే ఎన్నుకోండి

### కెసిఆర్, హరీష్‌ను కాపాడుతున్న కిషన్‌రెడ్డి

### వారి అరెస్టు మాట బిజెపియే తేల్చాలి

### బిఆర్ఎస్, బిజెపిది ఫెవికాల్ బంధం

### నిజామాబాద్ రైతులు దేశానికే ఆదర్శం

### బహిరంగసభలో సిఎం రేవంత్



శుక్రవారం నిజామాబాద్ జిల్లా బర్దిపూర్ బహిరంగసభలో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్, తుమ్మల తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి6:** నిజామాబాద్ రైతులు ఆత్మగౌరవంతో పంటలు పండించుకుంటున్నారంటే కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల వల్లనే, నిజామాబాద్‌లోని వ్యవసాయం తెలంగాణకే కాదు, దేశానికే ఆదర్శమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ వ్యవసాయానికి మారు పేరు, క్వింటాల్ పసుపు అమ్మితే తులం బంగారం వస్తుందన్న నానుడి ఉండేది, రైతు సమస్యల పైన నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికి ఆదర్శం అని పేర్కొన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా బర్ది పూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిఎం మాట్లాడారు. 'నిధులు కావాలంటే స్థానిక ఎమ్మెల్యే లేదా మున్సిపల్ శాఖ మంత్రినైనా నా దగ్గరకు రావాలి..నిధులు ఇచ్చే బాధ్యత నాది.. జిల్లా ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత నాది. గాడిదకు గడ్డి వేసి ఆవుకు పాలు పిండటం సాధ్యం కాదు..కార్పొరేటర్లు, కౌన్సిలర్లు మనోళ్లు గెలవాలి.. అప్పుడే పనులు జరుగుతాయి.. బంగారం లాంటి అవకాశాన్ని నిజామాబాద్ ప్రజలు వదులుకోవద్దు.. నిజామాబాద్‌లో కాంగ్రెస జెండా ఎగరాలి' అని పేర్కొన్నారు. 'కార్పొరేషన్‌లో బీజేపీ ఓట్లు అడగాలంటే నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీ గా ప్రక టించాలి..ఓటు అడిగే హక్కు బీజేపీ కి లేదు..బీజేపీని బొంద పెట్టాలి..బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే.. ఇద్దరి వీణావాణి బంధం.. పెవికాల్ బంధం బీజేపీకి ఓటు వేసినా, బీఆర్ఎస్‌కు ఓటు వేసినా ఒక్కటే,ఓటు మూసీలో వేసినట్లే' అని పేర్కొన్నారు. 'బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు నన్ను రేవంతుద్దీన్ ముస్లిం పేరుతో పిలిచాడు..బ్రిటిష్ వాళ్ల తర్వాత 100 ఏళ్ల వరకు బీసీ కులగణన జరగలేదు..కులగణన చేసినందుకు రేవంత్‌గౌడ్ అని గతంలో మహేష్‌గౌడ్ నన్ను వ్యాఖ్యానించారు..నేను సంతోషంగా స్వీకరించాను. ఎస్సీ వర్గీకరణ కు శాశ్వత పరిష్కారం చూపించాం. అందుకు మంత్రి దామోదర రాజనర్సింహా రేవంత్ మాదిగ అని నన్ను వ్యాఖ్యానించారు..నాకు సంతోషం అయింది. వాకిటి శ్రీహరి 30 ఏళ్ల కాంగ్రెస్ కార్యకర్త గా పనిచేశారు..ఆయనను మంత్రి ని చేస్తే ముదిరాజ్ వర్గం నన్ను రేవంత్ ముదిరాజ్ అని వ్యాఖ్యా నించింది.. అనిల్ కుమార్ యాదవ్ ను రాజ్యసభ కు పంపిస్తే నన్ను రేవంత్ యాదవ్ అని పిలిస్తే సంతోషపడ్డాను స్వర్ణ దేవాల యాన్ని నిర్మిస్తాన్నందుకు సర్దార్ రేవంత్ సింగ్ అని నన్ను సిక్కు సోదరులు పిలిచారు' అని పేర్కొన్నారు. 'ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది.. ముస్లిం వర్గానికి కాంగ్రెస్ >>2

### 7 హైస్పీడ్ కారిడార్లలో

## 3 హైదరాబాద్‌కే

### కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** కేంద్రం లోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల అభ్యున్నతికి దోహదపడుతుందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ 2047వరకు వికసిత్ భారత్ నిర్మాణ లక్ష్యంగా ఉందని స్పష్టం చేశారు. ఈ బడ్జెట్ దేశ ఆర్థిక శక్తిని మరింత బలోపేతం చేస్తుందని వివరిం చారు. ఈ మేరకు శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడి యాతో మాట్లాడారు. దేశాన్ని ప్రపంచం లోనే అత్యంత శక్తివంతమైన దేశంగా బలోపేతం చేసేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ జనరేషన్ నడుస్తున్న పరిస్థి తుల్లో కొత్త సంస్కరణలు తీసుకువ స్తున్నామని ఆయన స్పష్టం చేశారు. స్వాతంత్రం వచ్చాక కాంగ్రెస్ సుదీర్ఘ కాలం దేశాన్ని పరిపాలించినా ఇన్ని సంస్కరణలు చేయలేదన్నారు. ఇది భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకుని రూపొందించిన బడ్జెట్ అని.. ఇందులో మౌళిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేశామన్నారు. కొంత మంది మాత్రం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను విమర్శిస్తున్నారని తెలంగాణకు ఏమీ ఇచ్చారంటూ ప్రశ్నిస్తున్నారని >>2



శుక్రవారం మునిసిపల్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తదితరులు

### 'హేట్ స్పీచ్' చట్టం వస్తే

# మొదటి కేసు సిఎం రేవంత్ పైనే

### పక్క రాష్ట్రం ఆలోచనలు ఇక్కడ చేయొద్దు

### మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** సీఎం రేవంత్ సొంత బుర్రతో ఆలోచించకుండా పక్క రాష్ట్రం ఆలోచనలను ఇక్కడ అమలు చేయాలని చూస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ హేట్ స్పీచ్ బిల్లు తేవాలని చూడడం హాస్యస్పదంగా ఉందన్నారు. హేట్ స్పీచ్ చట్టం అమలైతే మొదటి కేసు రేవంత్‌పైనే పెట్టాలన్నారు. గతంలో రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడదలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ బలం పెరుగు >>2

# గద్దర్ అవార్డులు అసాధారణం

### నభూతో నభవిష్యతి అన్నట్లుగా వేడుక నిర్వహిస్తాం: డిసిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి6:** వచ్చే ఉగాది రోజున గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్ కార్యక్రమాన్ని నభూతో న భవిష్యత్తు అన్న విధంగా ఫిలిం డెవల ప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించాలని ప్రపంచ ఫిలిం ఇండస్ట్రీ మొత్తం హైదరాబాద్ వైపు తిరిగి చూసేలా ఆ కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రసాద్ లాబ్స్ లో గద్దర్ ఫిలిం అవార్డుల సందర్భంగా సినిమాల స్క్రీనింగ్ ప్రక్రియ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మార్పు కోసం కలలను ఉపయోగించి, ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు గద్దర్ అని ఆయన సేవలను డిప్యూటీ సీఎం కొనియాడారు. అందుకే ప్రజా ప్రభుత్వం ఆయన పేరిట సినిమా అవార్డులను ప్రారంభించింది ఇది రెండవ సంవత్సరం అని వివరించారు. వచ్చే ఉగాది పర్వదినం రోజు ఘనంగా గద్దర్ ఫిలిం అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. గద్దర్ చివరి రోజుల్లో వారితో తాను ఎక్కువ కాలం గడిపానని, వారి స్టూడియోలో అనేక ప్రయోగాత్మక పాటలు పాడారని, చివరి రోజుల్లో గద్దర్ రికార్డింగ్ స్టూడియోలో ఎక్కువ >>2



శుక్రవారం డి.సిఎం భట్టిని సత్కరిస్తున్న ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజు



## ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు 5లో

### 31మందిపైగా దుర్మరణం

### 160మందికిపైగా గాయాలు



శుక్రవారం చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని తాండూర్, వికారాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

# మొదటి కేసు సిఎం రేవంత్ పైనే

>> తున్నందునే కాంగ్రెస్ భయపడి అడ్డుకోవాలని హేట్ స్పీచ్ తేవాలని చూస్తోందని దుయ్యబట్టారు. తెలంగాణలో దొంగలు పోయి దోపిడీ దొంగలు అధికారంలోకి వచ్చారని, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్‌తో దోస్తీ లేకుంటే కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై ఎందుకు విచారణకు ఆదేశించలేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఓటుకు నోటు కేసులో బీఆర్ఎస్ కాపాడినట్టే కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్‌ను రేవంత్ కాపాడుతున్నాడని దుయ్యబట్టారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎన్నికల సహఇన్‌చార్జిలతో కలిసి విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలను మోడ్రన్ మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దుతామని, కబ్జాలపై ఉక్కుపాదం మోపుతామని, అవినీతిరహిత పాలన అందిస్తామని తదితర హామీలు ఇచ్చారు. మున్సిపల్ పోరులో బీజేపీకి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. వికసిత్ మున్సిపాలిటీ, వికసిత తెలంగాణ, వికసిత భారత్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదని, ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారని, బడ్జెట్‌లో తెలంగాణకు ఏమీ ఇవ్వలేదని అసత్యాలు చెబుతున్నారని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో ఏ జిల్లాకు ఏ మిచ్చామో తాము చెబుతామని, మరి రాష్ట్ర ప్రభుత్వం ఏమిచ్చిందో చెప్పగలరా? అని కాంగ్రెస్‌కు సవాల్ విసిరారు. రెండు రోజులుగా పోలీస్ వ్యవస్థ మొత్తం బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తోందని, కొట్టి, బెదిరించి నామినేషన్లను విత్‌డ్రా చేయించారని రాంచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను కాంగ్రెస్ ప్రభుత్వం కార్యకర్తల్లా వినియోగించుకుంటోందని దుయ్యబట్టారు. బీజేపీ కార్యకర్తలపై పోలీసులు దౌర్జన్యం చేస్తే ఊరుకోబోమని, కేంద్రంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వమేనన్న విషయం మరిచిపోవద్దని హెచ్చరించారు. పోలీసులు ఇప్పటికైనా స్మార్ట్ యాక్టింగ్ ఆపేయాలని హితవు పలికారు.

**మేనిఫెస్టోలో పలు కీలక హామీలు...**

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు కీలక హామీలను మేనిఫెస్టోలో పొందుపరిచారు. ప్రధాన హామీల్లో పన్నుల పెంపు లేదని, వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, బస్తీ దవాఖానలు, స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి, క్లీన్ సిటీ, గ్రీన్‌టౌన్, 100 శాతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, దేవాలయాల రక్షణ, మహిళల రక్షణ అంశాలను చేర్చారు. మున్సిపాలిటీల్లో దోమలు, పందులు, కుక్కలు, కోతుల బెడద నివారణ హామీలను సైతం చేర్చారు. సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి కోసం బీజేపీ మేనిఫెస్టో అన్న నినాదంతో కమలదళం ముందుకు వెళుతోంది.

**5 కార్పొరేషన్లు, 60శాతం మున్సిపాలిటీలే లక్ష్యంగా...**

తొలిసారి తెలంగాణలో అన్ని మున్సిపల్ వార్డుల్లో పోటీ చేస్తున్న బీజేపీ మెజారిటీ స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేయాలని పట్టుదలతో ఉంది. 60 శాతానికి పైగా మున్సిపాలిటీలు, కనీసం 5 కార్పొరేషన్లను దక్కించుకోవాలని టార్గెట్‌గా పెట్టుకుంది. ఇందుకోసం స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు క్షేత్రస్థాయిలో మొహరించారు. బీజేపీ యువ మోర్చాకు ఈ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక టాస్క్ ఇచ్చింది. జెన్‌జీ టార్గెట్‌గా ప్రచారంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశం చేసింది. ఢిల్లీ నేతలను మోహరించి గల్లీల్లో జెండా పాతేందుకు వ్యూహాన్ని సిద్ధం చేసింది. ఆ దిశగా మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను బీజేపీ విడుదల చేసింది.

# నిధులిచ్చేవారినే ఎన్నుకోండి

>> అనేక పదవులు ఇచ్చింది. షబ్బీర్‌అలీ నిజామాబాద్‌లో గెలవకపోయినా పదవి ఇచ్చాం..ఎమ్మెల్యేగా ఓడిపోయినా అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీ చేసి మంత్రి వర్గంలోకి తీసుకున్నాం.8 మంది మైనార్టీ నాయకులకు కార్పొరేషన్ పదవులు ఇచ్చాం. రేవంతుద్దీన్ అని పిలిచినా పర్వాలేదు.నాకు ఎలాంటి సమస్య లేదు.. నాకు ఎలాంటి అభ్యంతరం లేదు..అన్నికులాలు,మంతాలను సమన్వయం చేసుకుని అభివృద్ధి పథం వైపు తీసుకువెళ్తా..తెలంగాణను నెంబర్ 1 రాష్ట్రంగా తయారు చేస్తా అని చెప్పారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి, డీ.శ్రీనివాస్ సారథ్యంలో 2004,2009 లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది..2023 ఎన్నికల్లో నేను పీసీసీ అధ్యక్షుడుగా, మహేష్ గౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చాం..2029లో సీఎం గా నేను, పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకువస్తాం అని స్పష్టం చేశారు.'రాష్ట్రంలో ఇంకా 8 ఏళ్ల కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది.. నిజామాబాద్ కు ఎయిర్ పోర్టు తీసుకువచ్చే బాధ్యత మాదే.. వరంగల్, ఆదిలాబాద్‌కు ఎయిర్ పోర్టు తెచ్చాం.10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. మేం లక్షలాది రేషన్ కార్డులు ఇచ్చాం.3.10 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం.పేదలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ 50 లక్షల కుటుంబాలకు ఇస్తున్నాం..500 రూపాయలకే 50 లక్షల కుటుంబాలకు సిలిండర్‌కు ఇస్తున్నాం..ఆర్టీసీలో ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం.. ఇప్పటి వరకు 9 వేల కోట్ల రూపాయలు చెల్లించాం.. శిల్పారామం పక్కనే మహిళా సంఘాలకు స్థలం ఇచ్చాం..వరి పండిస్తే 500 రూపాయల బోనస్ ఇస్తామని చెప్పి అమలు చేస్తున్నాం..70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. చెంప చెల్లుమనిపించేలా తీర్పు ఇచ్చింది గ్రూప్ వన్ పైన హైకోర్టు తీర్పు ఇచ్చింది' అని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా నిజామాబాద్ లో రైతు సమస్యలపైన పోరాటం చేశాను.. నా మనసులో నిజామాబాద్ కు ప్రత్యేక స్థానం ఉంటుంది.. జిల్లాకు అవసరమైన నిధులు మంజూరు చేయడానికి శాయశక్తులా ప్రయత్నం చేస్తా అని స్పష్టం చేశారు. జిల్లాలో వివిధ విద్యాసంస్థల కోసం రూ.600 కోట్లు మంజూరు చేశాం. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో రూ.1045 కోట్లు ఖర్చు చేస్తున్నాం అని చెప్పారు..గతంలో 90 శాతం బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులే ఉన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిని అడ్డుకున్నారు అని చెప్పారు.. నిజామాబాద్ లో రెండు సార్లు ఎంపిగా బీజేపీ కిచెందిన ధర్మపురి అర్వింద్‌కు అవకాశం ఇచ్చారు..ఆయన మోదీ జపం చేస్తున్నారు. నిజామాబాద్ గల్లీలో మోరీలు తీయాలంటే మోదీ అవసరమా..? నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీ పథకంలోకి ఎందుకు ధర్మపురి అర్వింద్ తీసుకురాలేదు' అని ప్రశ్నించారు..ఎందుకు ప్రధాని మోదీ దగ్గర స్మార్ట్ సిటీని సాధించలేకపోయారు..నిజామాబాద్‌కు ఎయిర్ పోర్టు ఎందుకు తీసుకురావడం లేదు అని ప్రశ్నించారు. నిజామాబాద్ అవుటర్ రింగ్ రోడ్డుకు నిధులు ఇస్తే మేం వద్దని అన్నామా? ఏం నిధులు తెచ్చారని ఓట్లు అడుగుతున్నారు? మూడు సార్లు మోదీ ప్రధాని అయినా నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీ చేయలేకపోయారు అని పేర్కొన్నారు. కేసీఆర్, హరీష్ రావును జైలులో పెట్టి చిప్ప కూడు తినిపించాలని ధర్మపురి అర్వింద్ అంటుంటాడు. శాసనసభ సభలో చర్చ పెట్టి కాళేశ్వరాన్ని సీబీఐకి ఇచ్చాం...ఇప్పటి వరకు సీబీఐ పట్టించుకోలేదు. కిషన్ రెడ్డి ఏ బొక్కలో దాక్కున్నాడు? కేసీఆర్, హరీష్ రావును చర్లపల్లి జైలులో పెట్టకుండా ఎవరు అడ్డుకుంటున్నారు.. ఎందుకు ధర్మపురి అర్వింద్ మాట్లాడలేదు. కిషన్‌రెడ్డి కేసీఆర్‌ను ఏ రకంగా కాపాడుతున్నాడో తెలియడం లేదా? కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల గోదావరి పాలు అయ్యాయి..కాళేశ్వరం కూలేశ్వరం అయింది. కేసీఆర్, హరీస్ రావును ఎప్పుడు అరెస్ట్ చేస్తారో బీజేపీ నాయకులు చెప్పాలి. రామచంద్రరావు ..నీ పక్కన కూర్చున్న కిషన్‌రెడ్డి ఎందుకు కేసీఆర్ ను కాపాడుతున్నాడు. కల్వకుంట్ల కిషన్ రావు గా కిషన్ రెడ్డి మారాడు.. కేసీఆర్‌కు మరో దత్తత పుత్రుడు కిషన్‌రావు.. రామచంద్రరావు...మీ కిషన్ రెడ్డిని జనజీవనణ స్రవంతిలోకి తీసుకురా అని వ్యాఖ్యానించారు.నిజామాబాద్ కార్పొరేషన్ తో పాటు 7 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురబోతుందని మరోసారి స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉంది.. మండవ వెంకటేశ్వర రావు, సుదర్శన్ రెడ్డి లాంటి వాళ్లు మంత్రులుగా పని చేసినా చిన్న మచ్చ లేదన్నారు. 12 ఏళ్లు ప్రధానిగా మోదీ , 10 ఏళ్లు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉండి నిజామాబాద్ లో సమస్యలు పరిష్కారం కాలేదు.. బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ చెత్తకుప్ప గా మారింది.. సమస్యలు మరింత జఠిలం అయ్యాయని పేర్కొన్నారు.



శుక్రవారం సిఎం రేవంత్ సభకు హాజరైన అశేష జనసందోహం

# 3 వారాల్లోగా నిర్ణయం తీసుకోండి

>> స్పీకర్‌కు ఇప్పటికే తగినంత సమయం ఇచ్చామని గతంలోనే గుర్తు చేసిన ధర్మాసనం, ఈసారి స్పీకర్ నిర్ణయం పాజిటివ్‌గా (సానుకూలంగా) ఉండాలని స్పష్టం చేసింది. సింఘ్వీ విన్నపాన్ని మన్నిస్తూ, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఆ సమయానికి స్పీకర్ తీసుకున్న నిర్ణయాల పూర్తి సమాచారాన్ని సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువు తర్వాత తదుపరి విచారణ జరుపుతామని పేర్కొంది. కాగా తెలంగాణ బీజేఎల్పీ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా ఈ వ్యవహారంలో స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ అమలు చేయలేదని మహేశ్వర్ రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన దాఖలు చేసిన ఈ ధిక్కరణ పిటిషన్‌ను కూడా ప్రధాన పిటిషన్‌తో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మూడు వారాల గడువులోగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. కోర్టు పర్యవేక్షణలో ఉన్న ఈ కేసు తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# అండర్-19 వన్డే వరల్డ్ కప్ భారత్‌దే

>> అంబ్రిష్ సత్తా చాటి భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. 2022 ఎడిషన్ తర్వాత టీమిండియా విజేతగా నిలిచింది. అప్పుడు కూడా ఇంగ్లండ్‌పైనే భారత్ విజయం సాధించడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత అండర్ 19 టీమ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 411 పరుగుల భారీ స్కోర్ చేసింది. వైభవ్ సూర్యవంశీ(80 బంతుల్లో 15 ఫోర్లు, 15 సిక్స్‌లతో 175) విధ్వంసకర శతకంతో చెలరేగగా, కెప్టెన్ ఆయుష్ మాత్రే(51 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53) హాఫ్ సెంచరీ సాధించాడు. అభిజ్ఞాన్ కుండు(40), విహాన్ మల్హోత్రా(30), వేదాంత్ త్రివేది(32), కాన్షిక్(37 నాటౌట్) దూకుడుగా ఆడారు. ఇంగ్లండ్ బౌలర్లలో సెబాస్టియన్ మోర్గాన్, అలెక్స్ గ్రీన్ రెండేసి వికెట్లు తీయగా, జేమ్స్ మింటో(3/63) మూడు వికెట్లు పడగొట్టాడు. మన్నీ లమ్స్‌డెన్ ఒక వికెట్ తీసాడు. అనంతరం ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ బ్యాటర్లలో కాలెబ్ ఫాల్కోనర్(67 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్స్‌లతో 115) సెంచరీతో రాణించినా.. బెన్ డాకిన్స్(56 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీతో సత్తా చాటినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లలో అంబ్రిష్(3/56) మూడు వికెట్లు తీయగా, దీపేష్ దేవంద్రన్(2/64), కాన్షిక్ చౌహాన్(2/63) రెండేసి వికెట్లు తీయగా, ఖిలాన్ పటేల్, ఆయుష్ మాత్రే తలో వికెట్ తీసారు. ఇప్పటి వరకు ఈ టోర్నీలో 10 ఫైనల్స్ ఆడిన టీమిండియా 6 సార్లు విజేతగా నిలిచింది. 2000, 2008, 2012, 2018, 2022, 2026లో భారత్ విజేతగా నిలిచింది. విధ్వంసకర శతకంతో చెలరేగిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీతో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కింది.

## గుడికొచ్చే ప్రతి మహిళకు పసుపు కుంకుమ, జాకెట్

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** రాబోవు రోజుల్లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ఆలయానికి వచ్చే ప్రతి మహిళకు నిత్యం జాకెట్, పసుపు, కుంకుమ ప్రసాదంగా అంది స్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇక్కడి ఆలయ ఆవరణలోని బ్రహ్మగుడి వద్ద జరిపిన సమీక్ష తరువాత మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఈ కార్యక్రమాలను శ్రీకాళ హస్తి నుంచి శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. ఏ కార్యక్రమం అయినా శ్రీకాళ హస్తి నుంచి ప్రారంభిస్తారని అలాగే శ్రీకాళహస్తి నుంచి ప్రారంభించనున్నట్లు వివరించారు. ఇందుకు తాను, తన కుమార్తె, కోడలు చెరి రూ.1.8లక్షలు విరాళం అందించినట్లు మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలోని 495 ఆలయాల జీర్ణోద్ధారణకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 605 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి ప్రకటిం చారు. ఐదేళ్ళ వైకాపా ఒక్క ఆలయానికి సంబంధించి నిధులు కేటాయించారా? ఈ ఆల యాలు 18 నెలల్లో పూర్తి చేయుటకు ఆదేశించి నట్లు మంత్రి నారాయణరెడ్డి వివరించారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో 13రోజుల పాటు నిర్వహించే శివరాత్రి బ్రహ్మోత్సవాలను రూ.6కోట్ల బడ్జెట్‌లో నిర్వహిస్తున్నట్లు మంత్రి ఆనం నారాయణరెడ్డి వివరించారు. శివరాత్రి పర్వదినాన నాయకులు, అధికారులు, ఇతరులు ఆలయం బయటే పర్యవేక్షించాలి. ఆలయం లోపల ఆగమశాస్త్రానికి, హిందూ ధర్మ, సనాతన ధర్మాలకే ప్రాధాన్యత అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

# ప్రగతి మాది గెలుపు కూడా మాదే

**- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ దే విజయం - వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ - పాలమూరులో ఉమా కేర్ సెంటర్ - 80 డయాలసిస్ సెంటర్లు - హైవే శివార్లల్లో 200 పడకలతో ఆసుపత్రులు - ఉస్మానియా, గాంధీ తరహాలో 32 డిపార్ట్‌మెంట్‌లు - 90 రకాల చికిత్సలకు ఏర్పాట్లు**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులను చేశాం. అదే మున్సిపాలిటీ విజయం అందిస్తుందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం షాద్ నగర్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.. మున్సిపాలిటీ ఎన్నికలపై ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 75 నుంచి 80 సీట్లు కాంగ్రెస్ అందుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మహిళా సాధికారికత పేరిట రుణాలు, విద్యా, వైద్య రంగాల్లో పెను మార్పులు, ఉచిత బస్సు, గృహలక్ష్మి పథకాలు. పాలమూరు లాంటి వెనుకబడిన జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలలు, ట్రిపుల్ ఐటీ కళాశాలలు, ఏకీకృత పాఠశాలల నిర్మాణాలు, రేషన్ కార్డులు, ఉద్యోగాల నియామకాలు ఇలా అన్ని రంగాలలోనూ తమ ప్రభుత్వం సత్తా చాటిందన్నారు. అందుకే ఎక్కడ చూసినా కాంగ్రెస్ కు అనుకూల వాతావరణం కనిపిస్తుందని, అదే కాంగ్రెస్ కు విజయాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. మున్సిపాలిటీలలో ఏ వార్డుకు వెళ్లిన ప్రజల నుంచి మంచి స్పందన ఉందని, వారి సమస్యలు, కష్టాలు విని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారి సంక్షేమం కోసం ప్రణాళికలు చేపట్టడం జరుగుతుందని మంత్రి వివరించారు. వైద్య రంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నాం..విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాం.. భవిష్యత్తులో అందరికీ అందుబాటులో వైద్యం ఉండేలా వైద్య రంగాన్ని తీర్చిదిద్దుతున్నాం.. భవిష్యత్తులో ఏ బాధితుడు కూడా వైద్యం అందుబాటులో లేక మరణించడం జరగదు.. అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. షాద్ నగర్ పట్టణంలో 14 వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి అందెమోహన్ కు మద్దతుగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఆయన అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి లతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లా లక్ష్యంగా వైద్య రంగాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామని వెల్లడించారు. బాధితులు వైద్యం కోసం వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు రాకుండా జిల్లా కేంద్రాల్లోనే వైద్యం అందుబాటులో ఉండేలా ఆస్పత్రులను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వైద్యానికి సంబంధించి సౌత్ సెంట్రల్ గా పాలమూరు జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎవరికి వైద్యం అవసరమైన మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేలా వైద్యాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. అదేవిధంగా క్యాన్సర్ పరీక్షలకు సంబంధించి ప్రత్యేక కేంద్రం, 80 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉమా కేర్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా మండలాల వారిగా ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఎనిమిది నిమిషంలో అంబులెన్సులు అందుబాటులోకి వచ్చేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జాతీయ రహదారులపై ప్రమాద బాధితులకు అత్యవసర చికిత్సలు ఏర్పాటు చేసేలా శివారు ప్రాంతాలలో 200 పడకలతో ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు ఉస్మానియా, గాంధీ హాస్పిటల్ తరహాలోనే 32 డిపార్ట్మెంట్ లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 90 చికిత్సలు ఈ ఆసుపత్రులలో జరుగుతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా గ్రామీణ వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి దయాబెటిక్ సెంటర్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

# గద్దర్ అవార్డులు అసాధారణం

>> రోజులు గడిపారని డిప్యూటీ సీఎం గుర్తు చేసుకున్నారు.తెలుగు సినీ పరిశ్రమలోని అన్ని విభాగాలకు అవార్డులను ఇవ్వబోతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ కేవలం తెలుగు ఇండస్ట్రీకే కాదు భారతదేశంలోని వివిధ భాషలకు హైదరాబాద్ కేంద్రంగా మారాలని ప్రజా ప్రభుత్వం గొప్ప సంకల్పంతో పనిచేస్తుందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఉండే వాతావరణ పరిస్థితులు, నిపుణులు, శాంతి భద్రతలు దేశంలోని మరే ఇతర నగరాల్లో లేవని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఉన్న సానుకూల వాతావరణాన్ని ఉపయోగించుకొని హైదరాబాదును ప్రపంచ సినీ కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బ్లూ ప్రింట్ తయారు చేసుకుని ముందుకు పోతుందని తెలిపారు. సినిమాల ద్వారా సామాజిక సందేశం ఇవ్వడంతో పాటు ఆర్థిక వనరులు సమకూరే అవకాశం ఉంటుందని తెలిపారు. తెలుగు సినిమా ఇండస్ట్రీ ఆస్కార్ వంటి ప్రపంచ స్థాయి అవార్డులను సాధించడం గర్వించదగిన అంశం అటువంటి అంశాలను పునాదిగా చేసుకుని హైదరాబాదును ప్రపంచ సినీ కేంద్రంగా మార్చాలని ఆలోచనల తో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు. సినిమా పరిశ్రమకు అవసరమైన ఆర్థిక, సామాజిక, శాంతిభద్రతలపరంగా ఇంకా ఎటువంటి అవసరం అయినా అర్ధరాత్రి తమ ప్రజా ప్రభుత్వం తలుపు తట్టవచ్చని మీకోసం సీఎం రేవంత్ రెడ్డి సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తోపాటు తాను అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు, శాఖ మంత్రి వెంకట్ రెడ్డి గారు అందుబాటులో లేరు మీ అందరిని ప్రోత్సహించాలనేది మా అందరి ఏకైక లక్ష్యం అనే సందేశాన్ని మీ అందరికీ తెలియజేయవలసిందిగా తనకు తెలిపారని డిప్యూటీ సీఎం వివరించారు. గద్దర్ ఫిలిం అవార్డుల కార్యక్రమాన్ని ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు మనస్ఫూర్తిగా తీసుకొని బాధ్యతాయుతంగా ముందుకు వెళ్తున్నారని డిప్యూటీ సీఎం అభినందించారు. సినీ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం, సినీ కార్మికుల కోసం, సినీ రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేయాలని ఆలోచనలను సైతం దిల్ రాజు తమతో పంచుకుంటున్నారని డిప్యూటీ సీఎం వివరించారు. జూరీ చైర్మన్ మణిశర్మ తెలియని వారు సినీ రంగంలో లేరని, తరతమ బేధాలు లేకుండా, పారదర్శకంగా సినిమాలు చూడడమే కాదు నిష్పక్షపాతంగా అవార్డుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టాలనీ చైర్మన్ తో పాటు జూరీ సభ్యులను కోరుతున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్డిసి చైర్మన్ దిల్ రాజు, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మణిశర్మ, ఎఫ్డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## 3 హైదరాబాద్‌కే

>> ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తెలంగాణకు చాలా చేసిందని, 5 వేల కిలో మీటర్ల జాతీయ రహదారులు ఇచ్చామని వివరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు నిధులతోపాటు గ్రాంట్లు ఇచ్చామని ప్రహ్లాద్ జోషి చెప్పారు. మోదీ పాలనలో తెలంగాణకు రూ. 12 లక్షల కోట్లు ఇచ్చామన్నారు. తెలంగాణలోని 42 రైల్వేస్టేషన్లు ఆధునీకరించామని, ఏడు హై స్పీడ్ రైల్ కారిడార్లలో మూడు హైదరాబాద్ కే కేంద్రం ఇచ్చిందని గుర్తు చేశారు. కొన్ని పార్టీల నాయకులు తెలంగాణకు ఏమీ ఇవ్వలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల పట్ల మోదీకి ప్రేమ ఉందని, తెలంగాణ ప్రజలకు కూడా మోదీపైన ప్రేమ ఉందని వ్యాఖ్యానించారు. వీబీ జీ రామ్ జీ పథకంతో ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేశారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వీబీ జీ రామ్ జీకి బడ్జెట్‌లో గతం కంటే ఎక్కువ నిధులు కేటాయించామని స్పష్టం చేశారు.

## మున్సిపల్ వ్యూహంపై సిఎం రేవంత్‌తో డిప్యూటీ సిఎం భట్టి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి6:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికలు, ఇతర అంశాలపై వారిద్దరూ చర్చించారు. త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, నేతల మధ్య సమన్వయం తదితర విషయాలపై రేవంత్, భట్టి చర్చలు జరిపినట్లు సమాచారం. ఇటీవల మంత్రులతో సిఎం నిర్వహించిన భేటీకి డిప్యూటీ సిఎం భట్టి హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో సిఎంతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

### వారం - వర్జ్యం

07-02-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
షష్ఠి రా.2.56
చిత్త రా.2.30
వర్జ్యం : ఉ.8.41-10.28
దు.ఉ.6.30-8.06
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం :** విన్నూత్నరీతిలో రాజీయత్నాలు చేసికొన్ని అంశాలను అనుకూలంగా మార్చు కుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

**వృషభం :** మీకు నచ్చిన ఒక వ్యక్తిని ఆదర్శంగా తీసుకుని అదే బాటలో పయనించాలని నిశ్చయించుకుంటారు.

**మిథునం:** తనఖాలను విడిపిస్తారు. ప్రయత్నాలను ప్రారంభిస్తారు. ఆరోగ్య విషయంలో మెలుకువ అవసరం.

**కర్కాటకం:** కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. మిత్రుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు.

**సింహం:** అంతంత మాత్రంగా ఉన్న సంబంధాలను నిలుపుకోవడానికి గాను చేసే యత్నాలు ఫలిస్తాయి.వాహనసౌఖ్యం.

**కన్య :** నిష్కారణమైన నిరాశ, నిస్పృహల మధ్య కాలం వెళ్ళదీస్తారు. దైవబలాన్ని ఎక్కువగా నమ్ముతారు. వస్త్రలాభం.

**తుల :** జీవిత భాగస్వామి సలహాతో కొత్త కార్య క్రమాలకు శ్రీకారం చుడతారు. వాహనసౌఖ్యం. కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**వృశ్చికం:** సన్నిహితులతో స్వల్ప అభిప్రాయభేదాలు ఏర్పడే సవకాశాలు ఉన్నాయి. జాగ్రత్త వహించండి.

**ధనుస్సు:** తియ్యని మాటలతో మోసగించే వ్యక్తులు తారసపడతారు. అప్రమత్తంగా ఉండండి.విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మకరం:** ప్రజాకర్షణతో ముడిపడిన వ్యవహారాలు సానుకూల పడతాయి. విహారయాత్రలు చేస్తారు.విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**కుంభం:** పట్టుదలను అధికంగా కలిగివుంటారు. అవగాహన లోపం వలన ఓ సందర్భంలో ఇబ్బంది పడతారు.

**మీనం :** వ్యాపారస్థులు జాగరూకతతో మెలగవలసి ఉంటుంది. గృహావసరాల ఖర్చులు అధికంగా ఉంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాష్ట్రంలో మళ్లీ వచ్చేది కెసిఆర్ సర్కారే: హరీష్ రావు

## మంచిర్యాల జిల్లా నస్పూర్ కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగిన బీఆర్ఎస్ నేత



కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న బిఆర్ఎస్ నాయకుడు తన్నీరు హరీష్ రావు

**నస్పూర్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** రాష్ట్రంలో మళ్ళీ రాబోయేది కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నేత తన్నీరు హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణి కార్మికులు చేసిన సమ్మెతో ఢిల్లీ దద్దరిల్లిందని గుర్తు చేశారు. ఎంతో మంది అమరవీరుల బలిదానాలు, త్యాగాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ గా నిలిపిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని వివరించారు. 200 రూపాయల పెన్షన్ ను 2000 రూపాయలకు పెంచి ఆసరాగా నిలిచామని చెప్పారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలిచాయని హరీష్ రావు కొనియాడారు. 30 ఏళ్ల మంచిర్యాల జిల్లా ఆకాంక్షను కేసీఆర్ సాకారం చేశారని గుర్తు చేశారు. జిల్లాకు మెడికల్ కాలేజీతో పాటు అద్భుతమైన కలెక్టరేట్ భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. సింగరేణిని అద్భుతంగా తీర్చిదిద్దడమే కాకుండా, కారుణ్య నియామకాలు అమలు చేసి కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపినట్లు తెలిపారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న 3200 మందికి పట్టాలు పంపిణీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో 1,67,000 ఉద్యోగాలు కల్పించడంతో పాటు 1000 గురుకుల పాఠ శాలలను ప్రారంభించినట్లు వెల్లడించారు. రెండున్నరేళ్ల పాలనలో రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని హరీష్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలైన మహిళలకు నెలకు 2500 రూపాయలు, వృద్ధులకు 4 వేల పెన్షన్, యువతులకు స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, నిరుద్యోగ భృతి ఊసే లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో భూముల ధరలు పెరిగితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాతాళానికి పడిపోయాయని విమర్శించారు. బీఆర్ఎస్ కు అధికారం ముఖ్యం కాదని, ప్రజల క్షేమమే ముఖ్యమని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమతో వచ్చిన లాభాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ మ్యాచ్ పేరుతో దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పాల్గొన్నారు. వారితో పాటు నాయకులు విజిత్ రావు, అక్కూరి సుబ్బయ్య, వంగ తిరుపతి, టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, సురేందర్ రెడ్డి, కార్పొరేటర్ అభ్యర్థులు, కార్యకర్తలు హాజరయ్యారు.



విధినిర్వహణలో మరణించిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు శుక్రవారం చెక్కులను అందజేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి తదితరులు

# కానిస్టేబుల్ సౌమ్య, ప్రమోద్ కుటుంబాలకు ప్రభుత్వ సాయం

### రూ. కోటి చొప్పన చెక్కులను అందించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 6:** ఇటీవల విధి నిర్వ హణలో మరణించిన తెలంగాణ ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య కుటుం బానికి తెలంగాణ ప్రభుత్వం రూ.కోటి సాయం అందజేసింది. దీంతోపాటు, గత సంవత్సరం అక్టోబరులో డ్యూటీ చేస్తుండగా దుండగుల చేతిలో కత్తి పోటుకి గురై మృత్యువాత పడిన పోలీస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇచ్చారు. ఈ సహాయానికి సంబంధించిన చెక్కులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్వయంగా నిజామాబాద్‌లో ఆ కుటుంబాలకు స్వయంగా అందజేశారు. నిజామాబాద్‌లో జనవరి 23న అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకునేందుకు ప్రాణాల్ని సైతం లెక్కచేయకుండా సౌమ్య ప్రయత్నించారు. ఈ క్రమంలో అక్రమ రవాణాదారులు ఆమెను వాహనంతో ఢీకొట్టారు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్ నిమ్స్‌లో సౌమ్యకు చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం విదితమే.

# మహారాష్ట్ర గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

### ఏడుగురు నక్సలైట్ల హతం, పోలీసు అధికారి మృతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** మహారాష్ట్రలోని గడ్చిరోలిలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు కొనసాగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు నక్సలైట్లు హతమయ్యారు. ఇదే ఎన్‌కౌంటర్‌లో ఒక పోలీసు అధికారి మరణించారు. ఛత్తీస్‌గఢ్‌కు సరిహద్దులో గల గడ్చిరోలిలో గల పొదేవా అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. నక్సలైట్లు పెద్ద సంఖ్యలో సమావేశమయ్యారనే సమాచారంతో కేంద్ర బలగాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బలగాలు సంయుక్తంగా కూంబింగ్‌లో పాల్గొన్నాయి. ఘటనా స్థలంలో ఒక ఎకె 47, మరో ఎస్‌ఎల్‌ఆర్ తుపాకి లభ్యమయ్యింది. మరణించిన పోలీసు అధికారిని కమాండో దీపక్‌గా గుర్తించారు. నక్సలైట్ల వివరాలు తెలియరాలేదు. వారి మృతదేహాలను స్థానిక ఆసుపత్రిలో భద్రపరిచారు. ఇదే ఘటనలో మరో పోలీసు అధికారి గాయపడగా ఆయనను ఆసుపత్రికి తరలించారు. నక్సలైట్ల కోసం ఇంకా గాలింపు జరుగుతోంది.

# నేడు ఓలా, ఉబెర్, ర్యాపిడో డ్రైవర్ల దేశవ్యాప్త సమ్మె

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** కనీస ఛార్జీలు, డ్రైవర్ల పని పరిస్థితుల మెరుగుదల వంటి డిమాండ్లతో ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్లు ఫిబ్రవరి 7న దేశవ్యాప్తంగా సమ్మెకు దిగనున్నారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల యూనియన్‌తో పాటు పలు కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈ సమ్మె నిర్వహించనున్నారు. కనీసం ఆరు గంటల పాటు డ్రైవర్లు సేవలను నిలిపివేసి నిరసన వ్యక్తం చేస్తారని సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఈ సమ్మె ప్రభావంతో దేశవ్యాప్తంగా క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీ సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశముంది.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayIndia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

**టెండర్ నం. SCR-BZA-SNT-E22-OT-2025-26 తేది : 05.02.2026**

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి ఆదేశానుసారం, దిగువ సంతకం చేసిన వారు ఈ క్రింది పని కోసం తేదీ: 04.03.2026న 15.30 గంటల వరకు ఈ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 01 టెండర్ నెం.: SCR-BZA-SNT-E22-OT-2025-26 తేది.05.02.2026 పని పేరు: విజయవాడ డివిజన్: MBL, SDM, CLX, NZD, BVRM, MTM, REG, AKP, KVR, NDM, RVD & RJY స్టేషన్లలోని గూడ్స్ షెడ్ల వద్ద సిసి కెమెరాల ఏర్పాటుకు సంబంధించిన సిగ్నల్ & టెలికాం ఏర్పాట్లు. టెండర్ విలువ (రూ): 8,95,85,301.60, బయానా (రూ): 5,97,900 పూర్తి చేయు కాలం: 12 నెలలు

టెండర్ ముగింపు తేదీ మరియు సమయం: సమయం: 15.30 గంటలు. తేదీ: 04.03.2026

1. టెండర్ షరతులు/పని పేరు యొక్క పూర్తి వివరాలు, పైన పేర్కొన్న పనుల యొక్క సారూప్య స్వభావం, అర్హత ప్రమాణాలు మొదలైన ఇతర వివరాలు "www.ireps.gov.in" వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2. టెండర్ ముగింపు తేదీకి ముందు ఏవైనా మార్పులు / సవరణలను గమనించడానికి కాబోయే టెండర్దారులు "www.ireps.gov.in" వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించడమైనది.
3. ఈ టెండర్ నోటీసు డివిజనల్ రైల్వే మేనేజర్ (సిగ్నల్ & టెలికాం), దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారి కార్యాలయంలోని నోటీసు బోర్డులో కూడా ప్రదర్శించబడింది.
4. ఎటువంటి కారణం చెప్పకుండా టెండర్‌ను రద్దు చేసే హక్కు రైల్వేకు రిజర్వ్ చేయబడింది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (S&T), విజయవాడ

**టెండర్ నం. BZA-GSU-Elec-28-2025-26 తేది : 04.02.2026**

చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, గతి శక్తి, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ భారత రాష్ట్రపతి తరపున ఈ క్రింది పనుల కోసం ఓపెన్ టెండర్/సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు:

క్ర.సం.: 01 టెండర్ నెం.: BZA-GSU-Elec-28-2025-26 తేది: 04.02.2026 పని వివరణ: విజయవాడ డివిజన్ - గూడూరులో కొత్త స్టేషన్ భవనం, COP, FOB లకు విద్యుత్ ఏర్పాట్ల కల్పన. టెండర్ విలువ (రూ): 18783385.38 బయానా (రూ): 243900.00 పని పూర్తి చేయు కాలం: 12 నెలలు టెండర్ ఫారం ధర (రూ): ఏమీ లేదు టెండర్ ముగింపు తేదీ & సమయం: 02.03.2026 15.00 గంటలకు

1. బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కోసం, దయచేసి https://ireps.gov.in వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వండి.
2. ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ చెల్లింపును IREPSలో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న నెట్ బ్యాంకింగ్ / పేమెంట్ గేట్‌వే సౌకర్యాల ద్వారా మాత్రమే చెల్లించాలి (లేదా) బిడ్ సెక్యూరిటీకి సంబంధించిన బ్యాంక్ గ్యారంటీని PFA/Con/SC అనుకూలంగా సమర్పించవచ్చు.
3. టెండరర్లు తమ ఆఫర్లను టెండర్ సమర్పణ / బిడ్డింగ్ కాలంలో ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. ఈ కాలం టెండర్ ముగియడానికి పదిహేను రోజుల ముందు ఉంటుంది.
4. టెండరర్లు టెండర్ సమర్పణ / బిడ్డింగ్ కాలం ప్రారంభమయ్యే తేదీ వరకు ఏవైనా సవరణల కోసం (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి) గమనిస్తూ ఉండాలి.

చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, గతి శక్తి, విజయవాడ

**టెండర్ నం. Y/SG/36/2025-26/35 తేది : 05.02.2026**

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, హైదరాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా క్రింది పనుల కోసం తేదీ 09.03.2026న ఉదయం 11.30 గంటల వరకు తెరిచిన టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 01 టెండర్ నెం.: Y/SG/36/2025-26/35 పని పేరు: IRISET: ఇ-గాట్ పోర్టల్ కోసం ఇ-లెర్నింగ్ కంటెంట్ అభివృద్ధి. సుమారు విలువ (రూ): 2981649 బయానా (రూ): 59600.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికం ఇంజనీర్, హైదరాబాద్

**టెండర్ ప్రకటన నం. 21-CWMLGDS-ET-2025-26 తేది : 04.02.2026**

భారత రాష్ట్రపతి తరపున మరియు ఆయన ఆదేశాల మేరకు CWM/LGDS, టెండర్ నెం. 21-CWMLGDS-ET-2025-26 కోసం ఈ-టెండర్లను ఆహ్వానిస్తోంది. ఈ టెండర్ ముగింపు తేదీ 26.02.20265, సమయం ఉదయం 11:00 గంటలు. బిడ్డర్లు తమ అసలు/సవరించిన బిడ్లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు, మరియు అటువంటి ఏ మాన్యువల్ ఆఫర్ స్వీకరించబడినా అది పరిగణించబడదు.

కాంట్రాక్టర్లు ఈ టెండర్‌కు సంబంధించిన టెండర్ పత్రం ఖర్చు మరియు ముందస్తు ధరావత్తు చెల్లింపులను IREPS పోర్టల్‌లో అందుబాటులో ఉన్న నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ మొదలైన ఆన్‌లైన్ చెల్లింపు పద్ధతుల ద్వారా మాత్రమే చేయాలి. డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్స్ చెక్, డిపాజిట్లు, FDR మొదలైన వాటి ద్వారా మాన్యువల్ చెల్లింపులు అనుమతించబడవు.

క్ర.సం.: 01 టెండర్ నెం.: 21-CWMLGDS-ET-2025-26 తేదీ 04.02.2026 పని వివరణ: కోచ్‌లలో FRP త్రూ స్థానంలో RMPU కింద SS మెటల్ త్రూ ఏర్పాటు చేయడం. సుమారు వ్యయం (రూ): 4,45,62,157.20 పైసలు. (నాలుగు కోట్ల నలభై ఐదు లక్షల అరవై రెండు వేల నూట యాభై ఏడు రూపాయల ఇరవై పైసలు మాత్రమే) బయానా (రూ): 3,72,800/- (మూడు లక్షల డెబ్బై రెండు వేల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే) పనులు పూర్తి చేయు కాలపరిమితి: 12 నెలలు ముగింపు తేదీ: 26.02.2026 11.00 గంటలు

వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in

టెండర్ యొక్క పూర్తి వివరాలను చూడగల నోటీసు బోర్డు స్థానం: చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజ్ వర్క్‌షాప్, లాలాగూడ, సికింద్రాబాద్ - 500017 మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం (టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి) మరియు టెండర్ పత్రాలు, సవరణ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి మా వెబ్‌సైట్ http://www.ireps.gov.in/ ని సందర్శించండి.

చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, CWS, లాలాగూడ, సికింద్రాబాద్

A2396

తదుపరి టెండరు నిబంధనలు/వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.


# చెప్పేది వినండి.. సరైనది ఎంచుకోండి

### ఇంటర్నెట్‌కు దూరంగా ఉండండి..
### ఆటల్లోనూ నైపుణ్యం సాధించాలి
### విద్యార్థులతో 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** 'సలహాలు అన్నీ తీసుకోవాలి కానీ మనకు సరిపోయే సలహానే ఎంచుకోవాలి' అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విద్యార్థులకు సూచించారు. చదువు, విశ్రాంతి, అలవాట్లు, నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడంలో ఒక బ్యాలెన్స్ ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఆటలను సరదాగా తీసుకోవద్దని, అదొక నైపుణ్యమని హితవు పలికారు. శుక్రవారం తన అధికారిక నివాసంలో నిర్వహించిన "పరీక్షా పే చర్చ" కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోడీ విద్యార్థులతో ముచ్చటించారు. తమకు అనువుగా అనిపించే పరీక్షల ప్రిపరేషన్ పద్ధతిపై నమ్మకం ఉంచాలని విద్యార్థులకు ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. బలమైన ఆత్మవిశ్వాసం ఉంటేనే విజయం సాకారం అవుతుం దని ఆయన తెలిపారు. పరీక్షల ప్రిపరే షన్ పద్ధతిపై ఎవరైనా సలహాలను ఇచ్చినా స్వీకరించి, వాటిలో నుంచి తమకు వ్యక్తిగతంగా పనికొచ్చే అత్యు త్తమ పద్ధతిని ఎంపిక చేసుకోవాలని స్టూడెంట్స్‌కు సూచించారు. అనువైన పద్ధతిలో ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయితేనే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని ప్రధాని మోడీ అన్నారు. వివిధ రకాల ప్రిపరేషన్ పద్ధతుల గురించి అతిగా ఆలోచించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విద్యార్థులకు ఆయన చెప్పారు.

దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి అధికారులు ఎంపిక చేసిన పలువురు ఎగ్జామ్ వారియర్స్ (విద్యార్థులు) ప్రధానితో ఈ చర్చలో పాల్గొన్నారు.

**ఇంటర్నెట్‌లో టైం వేస్ట్ చేసుకోకండి**

'డేటా చౌకగా వస్తోంది కదా అని ఇంటర్నెట్‌లో టైం వేస్ట్ చేసుకోకండి. సరదాగా గేమ్స్ ఆడుతూ కాలాన్ని గడిపేయకండి. డబ్బుపై ఆశతో గేమ్స్ ఆడితే జీవితాలు నాశనం అవుతాయి. అందుకే మా ప్రభుత్వం జూదం లాంటి ఆటలను ప్రోత్సహించడం లేదు. ఆన్‌లైన్ జూదానికి వ్యతిరేకంగా మేం ఒక చట్టాన్ని కూడా చేశాం. అయితే గేమ్స్ ఆడటంలోనూ ఒక నైపుణ్యం దాగి ఉంటుంది. గేమ్స్ ఆడేవారు స్పీడ్‌గా స్పందించాల్సి ఉంటుం ది. ఈ అంశాన్ని అప్రమత్తతను అలవర్చుకోవడానికి, స్వీయ వికాసానికి వాడు కోవచ్చు' అని విద్యార్థులకు ప్రధాని మోడీ సూచించారు.

పనితీరుకు సంబంధించి ప్రజలు తనకు ఎన్నో విషయాలు చెబుతుంటారని, వారు ఇచ్చే సలహాలు అన్నీ దేశ ప్రధానిగా తాను స్వీకరిస్తానని మోడీ చెప్పారు. ఇలా స్వీకరించిన సలహాలు సూచనలతోనే తన పనివేళల్లో మార్పులు చేసుకున్నట్లు విద్యార్థులకు వివరించారు. అయితే, తాను విలువలను మాత్రం వదులుకోలేదని వివరించారు. ఈ సందర్భంగా జూదం జోలికి వెళ్లవద్దని వారిని హెచ్చరించారు. ఇంటర్నెట్ తక్కువ ధరకే లభిస్తుందని సమయం వృథా చేసుకోవద్దని హితవు పలికారు. పరీక్షలను పండుగలా చేసుకోవాలని, మీతో మీరే పోటీపడాలని మోడీ వారికి సూచనలు చేశారు. 'నా వయసు 75 యేళ్లకు చేరిందని, ఇంకా 25 యేళ్లు మిగిలి ఉన్నాయని ఒక నాయకుడు ఒసారి నాతో అన్నారు. కానీ నేను గతాన్ని లెక్క పెట్టను. మిగిలి ఉన్న దాన్ని మాత్రమే నేను లెక్కి స్తాను. నేను మీకు చెప్పేది ఏమిటంటే, గతం గురించి ఆలోచిస్తూ టైం వేస్ట్ చేసుకోకండి. మీ ప్రస్తుత స్థితిలోనే జీవించే ప్రయత్నం చేయండి. మనం కేవలం మార్కులపైనే ఫోకస్ పెట్టకూడదు. జీవన వికాసంపైనా శ్రద్ధ పెట్టాలి. అది క్లాస్‌రూంలు, ఎగ్జామ్‌ల పరిధిలోలేని విలువైన అంశం. ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథంతో పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యా ర్థులతో కలిసి 'పరీక్షా పే చర్చ' చేసినందుకు నాకు సంతోషంగా ఉంది' అని ప్రధాని మోడీ తెలిపారు.



# సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణం 28 నాటికి పూర్తి



శుక్రవారం ఆస్పత్రిని పనులను పరిశీలిస్తున్న వికాస్‌రాజ్

### పనులను పరిశీలించిన ప్రత్యేక ప్రధానకార్యదర్శి వికాస్‌రాజ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 6:** సనత్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిఐఎంఎస్)ను మార్చి నెలలో ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తుదిసన్నాహాలు వేగవంతం చేసింది. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను ఫిబ్రవరి చివరి నాటికి పూర్తిచేయాలని గడువు విధించింది. రవాణా, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ శుక్రవారం ఆసుపత్రిని సమగ్రంగా పరిశీలించారు. నిర్మాణ, మౌలిక సదుపాయాలు, ఆపరేషనల్ పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా ఫిబ్రవరి 28 నాటికి అన్నింటినీ పూర్తి చేయాలని సంబంధిత అమలు సంస్థ లకు ఆదేశించారు. ఈ పరిశీలనలో వైద్య విద్యా డైరెక్టర్, టిజిఎం ఎస్ఐడిసి అధికారులు, ఆర్‌అండ్ బీ ఇంజినీర్లు, ఈపీసీ కాంట్రాక్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు. అత్యవసర విభాగాలు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు, సెంట్రల్ స్టెరైల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ సహా ఆసుపత్రి అన్ని అంతస్తులను పరిశీలించారు. చివరి దశలో 200 ఆక్సిజన్ లైన్లు, 65 నర్సింగ్ స్టేషన్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, అత్యవసర విభాగానికి ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఇవన్నీ ప్రాధాన్యతతో పూర్తి చేసి నెలాఖరుకు ముందు ట్రయల్ రన్స్ నిర్వహించాలని ఆదేశించారు. ఐసీయూ, ఎమర్జెన్సీ పడకలకు కర్టెన్లు, రైలింగులు, లాండ్రీ సేవలు, సైన్‌బోర్డులు కూడా గడువులోగా ఏర్పాటు చేయాలని ఎంహెచ్ఐడిసికు సూచించారు. ఈపీసీ కాంట్రాక్టర్ పరిధిలోని వైద్య పరికరాలన్నీ ఇప్పటికే అమర్చామని అధికారులు తెలిపారు. మరోవైపు ఎంహెచ్ఐడిసి ద్వారా 540 అదనపు వైద్య, అనుబంధ పరికరాల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని, గదులు హ్యాండ్ఓవర్ అయిన వెంటనే వాటిని సమీకరిస్తామని చెప్పారు. ఆసుపత్రి మొదటి రోజే సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలనే లక్ష్యంతో పరికరాల ఇన్‌స్టాలేషన్, ట్రయల్ రన్స్ పర్యవేక్షణకు వైద్య, సాంకేతిక సిబ్బందిని తక్షణమే నియమించాలని వైద్య విద్యా డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరి 12 నుంచి 28 మధ్య తొలి విడతగా 100 మంది వైద్య, పారా మెడికల్, హౌస్‌కీపింగ్ సిబ్బందిని నియమించనున్నట్లు వెల్లడించారు. నెలాఖరుకు పూర్తి స్థాయి సిబ్బంది నియామకం పూర్తి కానుంది. తుది సేవా ఒప్పందాలు పూర్తయ్యే వరకు ద్రవ ఆక్సిజన్ సరఫరా, శానిటేషన్, హౌస్‌కీపింగ్ వంటి కీలక సేవలను ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్టర్ల ద్వారా కొనసాగించనున్నారు.

హెల్త్, మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖకు ఆసుపత్రి హ్యాండ్ఓవర్ ప్రక్రియను వేగవంతం చేశారు. ఆర్‌అండ్‌బీ, హెచ్‌ఎంఅండ్ ఎఫ్ డబ్ల్యూ సంయుక్త బృందాలు మొత్తం 1,059 గదుల్లో ఇప్పటివరకు 225 గదులను పరిశీలించాయి. ఫిబ్రవరి 9 నాటికి మరో 500కు పైగా సిద్ధంగా ఉన్న గదుల తనిఖీ, హ్యాండ్ఓవర్ పూర్తిచేయనున్నారు. ఫిబ్రవరి 12 నుంచి క్లియర్ అయిన గదుల్లో పడకలు, అందుబాటులో ఉన్న పరికరాలను ఏర్పాటు చేసి ఇన్‌సిటూ చెక్స్, ట్రయల్ రన్స్ నిర్వహించనున్నారు. మిగిలిన అన్ని గదులను ఫిబ్రవరి చివరి నాటికి టిజిఎంఎస్ఐడిసి నియమించిన నోడల్ అధికారికి అప్పగించాలని ఆయన ఆదేశించారు.

# యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే పంచాయతీలకు దశలవారీగా రూ.2,500 కోట్లు

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
### నిధుల విడుదలపై ప్రధాని మోడీకి కృతజ్ఞతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో పంచాయితీ ఎన్నికలు ముగిసిన వెంటనే నిధులు విడుదల చేయాలని ఆయన కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రితో మాటాడారు. ఆ మేరకు నిధులు విడుదల చేయించారు. దశాబ్ద కాలంగా.. తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలకు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రూ.11వేల కోట్లకు పైగా నిధులను విడుదల చేసిందని కిషన్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు శుక్రవారం తన అధికారిక ట్విట్టర్ ఎక్స్ ఖాతాలో ఆయన పోస్టు పెట్టారు. 2015-16 నుంచి 2019-20 మధ్యలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో గ్రామ పంచాయతీలకు రూ.5,060 కోట్లు విడుదల చేసిందని, 2020-21 నుంచి 2025-26 మధ్యలో ఈ కేటాయింపులు 80 (రూ.9,050 కోట్లు) పెరిగాయన్నారు. ఇందులో రూ.6,051 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని వివరించారు. ఇటీవల తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మిగిలిన నిధులను కూడా విడుదల చేసిందని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల ఖర్చుపై యుటిలైజేషన్ సర్టిఫికెట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే సబ్‌మిట్ చేసిన నేపథ్యంలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడతగా రూ.260 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు.

మిగితా నిధులకు సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇవ్వగానే దశల వారిగా మిగిలిన రూ.2,500 కోట్ల నిధులు కూడా విడుదల కానున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీలో ఈ నిధుల వినియోగం కోసం తప్పనిసరిగా ప్రత్యేక బ్యాంకు అకౌంట్ తెరవాలని, (పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని యూనిక్ ఏజెన్సీ కోడ్‌ను పొందాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామపంచాయతీల అకౌంట్లను జప్తుచేసుకుని, ఆ నిధులను ఇతర అవసరాల కోసం దారి మళ్లించిందని దుయ్యబట్టారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 336 వార్డుల్లో జనసేన పోటీ

### గాజు గ్లాసు గుర్తుతోనే బరిలోకి
### పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** ఈ నెల 11న జరగనున్న తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో 336 వార్డుల్లో జనసేన పార్టీ పోటీ చేయనున్నట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 336 వార్డుల్లో జనసేన పార్టీ పోటీ చేయనుందని, ఇందుకు సంబంధించి పార్టీ అభ్యర్థుల బి-ఫారమ్‌లు దాఖలు చేయగా, స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను ఆమోదించారని శుక్రవారం ఒక ప్రకటగనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులు గాజు గ్లాస్ గుర్తుపై పోటీ చేయనున్నారని ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ రాష్ట్రంలోని జనసైనికులు, వీరమహిళలు ఉత్సాహంగా పాల్గొని, పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు.

**జిల్లాల వారీగా జనసేన పార్టీ పోటీ చేస్తున్న వార్డుల సంఖ్య**

నిజామాబాద్ -48, కొత్తగూడెం -22, రంగారెడ్డి -21, ఖమ్మం -17, వరంగల్ -20, నల్గొండ -46, మహబూబ్‌నగర్ -44, మహబూబాబాద్ -5, మెదక్ -18, కరీంనగర్ -56, ఆదిలాబాద్-39 వార్డుల్లో పోటీ చేయనున్నట్టు రామ్ తెలిపారు.

# ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్‌ను సందర్శించిన హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆనంద్

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్‌ను హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి ఆనంద్ శుక్రవారం సందర్శించారు. డిజిపి కార్యాలయంలో గల ఈ విభాగాన్ని సందర్శించిన సందర్భంగా ఆనంద్‌కు ప్రాసిక్యూషన్ డైరెక్టర్ ఎన్.సాంబశివ రెడ్డి సహా ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఈ ఆఫీస్ అప్లికేషన్‌ను ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా రాష్ట్రంలో కాగిత రహిత పాలనను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి వుందని అన్నారు. ఈ ఆఫీస్ విధానం ద్వారా ఫైళ్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని. పరిపాలనలో జవాబుదారితనం పెరుగుతుందని ఆయన తెలిపారు. ప్రాసిక్యూషన్ విభాగంలో ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేసిన సిబ్బందిని ఆనంద్ అభినందించారు. అనంతరం ప్రాసిక్యూషన్ విభాగం కోసం రూపొందించిన ముఖ గుర్తింపు ఆధారిత హాజరు నిర్వహణ వ్యవస్థను ఆనంద్ ప్రారంభించారు. ఈ డిజిటల్ విధానం వల్ల సిబ్బంది హాజరులో క్రమశిక్షణ, పారదర్శకత పెరుగుతుందని ఆయన వెల్లడించారు. దీంతో పాటు ప్రాసిక్యూషన్ విభాగం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆనంద్ కీలక సూచనలు చేశారు. దేశంలో కొత్తగా అమల్లో వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాల గురించి ఆయన వివరించారు. ఈ చట్టాల అమలుకు సంబంధించిన సర్క్యులర్లు, స్టాండర్ట్ ఆపరేటింగన ప్రొసీజర్స్, ప్రభుత్వ ఉత్వర్వుల రూపకల్పనలో ప్రాసిక్యూటర్ల బృందం చేసిన కృషిని ఆనంద్ ఈ సందర్బంగా కొనియాడారు. కొత్త చట్టాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆనంద్ ప్రాసిక్యూషన్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో ప్రాసిక్యూషన్ డైరెక్టర్ సాంబ శివరెడ్డి తమ విభాగం సాధించిన విజయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శాఖా పరంగా పెండింగ్‌లో వున్న కొన్ని అంశాలను ఆయన ఆనంద్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆనంద్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రాసిక్యూషన్ విభాగం అధికారులు పలువురు పాల్గొన్నారు.



డిజిపి కార్యాలయంలోని ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్‌ను సందర్శించిన హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆనంద్‌కు తమ విభాగం పనితీరును వివరిస్తున్న అక్కడి అధికారులు.

# ఐ సెట్-2026 నోటిఫికేషన్ జారీ

### 12 నుంచి దరఖాస్తుల స్వీకరణ
### మే 13, 14న పరీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబిఏ, ఎంసిఏ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఐ సెట్-2026కి సంబంధించిన నోటిఫికేషన్ శుక్రవారం విడుదల చేశారు. దరఖాస్తులను ఈ నెల 12 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఐ సెట్-2026 పరీక్షను మహాత్మాగాంధీ యూని వర్సిటీ నిర్వహించనుంది. మొదటి కమిటీ సమావేశం జనవరి 28న జరగగా అదే ఐ సెట్-2026 షెడ్యూల్‌ను విడుదల చేశారు. శుక్రవారం నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ నెల 12 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. మార్చి 16 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, పిహెచ్ అభ్యర్థులకు రూ. 550 ఫీజు కాగా ఇతరులకు రూ. 750గా నిర్ణయించారు. మే 13న ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు ఉదయం సెషన్‌ను, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధ్యాహ్నం సెషన్‌లో పరీక్షలను నిర్వహించనున్నారు. మే 14న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు.

# ఐ బొమ్మ రవి బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అనేక భాషల సినిమాలను, ఓటిటి కంటెంట్లను అధు నాతన టెక్నాలజితో పైరసీ చేసి, వా టిని బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లకు అమ్ముకుని కోట్లాది రూపాయలు సంపాదించిన ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి బెయిల్ పిటిషన్ పై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. రెండు నెలల క్రితం ఐ బొమ్మ రవిని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. ప్రస్తుతం అతను చంచల్‌గూడ జైల్లో రిమాండులో వున్నాడు.

రవి బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి కోర్టు తిర స్కరించడంతో అతను హైకోర్టును ఆశ్రయి ంచాడు. దీనిపై శుక్రవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. రవి తరపున వాదించిన న్యాయవాది తన క్లయింట్‌ను ఇంతకాలం నిర్బంధించడం అ న్యాయమని, వెంటనే బెయిల్ ఇవ్వాలని కోరారు. దీనికి పోలీసు తరపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. రవికి బెయిల్ ఇస్తే అతను వెంటనే వి దేశాలకు పారిపోతాడని, అప్పుడు పట్టుకోవడం కష్టసాధ్యమని ఆయన తెలిపారు. తన క్లయింట్ పాస్‌పోర్టును ఇప్పటికే పోలీసులు జప్తు చేసినందు న, అతను పారిపోయే సమస్య వుండదని రవి తరపు న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు రవికి సంబంధించిన పాస్‌పో ర్టు సహా ఇతర వివరాలు వెంటనే తమకు సమర్పించాలని కోరింది. దీనిపై తదుపరి విచారణ సోమవారానికి వాయిదా పడింది.

# ఢిల్లీలో 800 మందికిపైగా మిస్సింగ్ అవడం అంతా ఫేక్

### కొట్టివేసిన పోలీసులు.. ఇదంతా పెయిడ్ ప్రమోషన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** ఢిల్లీలో 15 రోజుల వ్యవధిలో 800 మందికి పైగా కనిపించకుండా పోయారని ఆంగ్ల మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవాలని ఢిల్లీ పోలీసులు ఖండించారు. దీనకి కొందరు చేస్తున్న పెయిడ్ ప్రమోషన్ కారణమని పోలీసులు శుక్రవారం నాడు మీడియాకు తెలిపారు. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు ఇలాంటి తప్పుడు వార్తలను ప్రమోషన్ చేస్తున్నారని, దీనిని సహించేదే లేదని, దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఎక్స్ వేదికగా స్పందించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మిస్సింగ్ కేసుల సంఖ్య తగ్గిందని ఆ పోస్టులో పోలీసులు వివరించారు. ఇలాంటి తప్పుడు వార్తల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని పోలీసులు కోరారు. తాము వెల్లడించినట్లు ప్రసారమైన గణాంకాలు నిజం కావని ఆ పోస్టులో ఉంది.

ఆపదలు రెండు రకాలు. ఒక రకం మనకు దురదృష్టాన్ని తెచ్చిపెడితే, ఇంకోరకం ఇతరులకు అదృష్టాన్ని ఆర్జించిపెడుతుంది.

-ఆంబ్రోస్ బియర్స్

# కాలుష్యం కట్టడికి దారేది?


పంచభూతాలు కాలుష్యమౌతున్న ఈ రోజుల్లో ఊరేమిటి? పేరేమిటి ఎక్కడైనా కాలుష్యమయమే. ఇటీవలి కాలం వరకు దేశ రాజధాని న్యూఢిల్లీ కాలుష్యం గురించి బాగాచెప్పుకునేవారం. అంతకుమించి కాలుష్యం హైదరాబాద్‌లో ఉందంటే నమ్మాల్సిందే. ఢిల్లీ కాలుష్య లెక్కలు ఢిల్లీవి. హైదరాబాద్‌లో లెక్కలు హైదరాబాద్‌వి. జల, వాయు, నీటి కాలుష్యాలతో పోటీ పడిన చాలా విషయాలు ఆశ్చర్యం గొల్పుతాయి. దక్షిణ భారతదేశంలో హైదరాబాద్ ఇప్పుడు కాలుష్య రాజధానిగా నిర్ధారితమైంది. ముంబయి నగరంతో పోల్చిచూసుకున్నా తెలంగాణలో పారిశ్రామికకాలుష్యం గురించిన హెచ్చరికలు బాగా వెలుగు చూస్తున్నాయి. గత రెండు మూడేళ్లుగా జంట నగరాల్లో కాలుష్యం ఈప్రాంత ప్రజల ఆరోగ్యాలను కబళిస్తోంది. ఆరోగ్యపరమైన వాతావరణం కోసం ప్రభుత్వాలు పరిశ్రమల తరలింపు ప్రయత్నాలు చేస్తున్నాయన్న వార్తలు వినిపిస్తున్నా వాటికి నిర్దిష్టమైన రూపం వెలుగు చూడలేదు. హైదరాబాద్ నగరంలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు బాగా పడిపోవడంతో తీవ్ర వాయు కాలుష్య సంక్షోభంలో అల్లాడుతోంది. గత యేడాది ఈ రోజుల్లోనే అనేక ప్రాంతాలలో గాలి నాణ్యతా సూచి (ఏక్యూ) 150కి దాటింది. పిఎం 2.5, పిఎం 10, నైట్రోజన్ ఆక్సైడ్‌ల హానికర కాలుష్య కారకాల సాంద్రతలు బాగా పెరిగాయి. కొన్ని ప్రాంతాలలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన పరిమితుల కన్నా100రెట్లు అధికంగా హానికర కాలుష్యంనగరమంతా వ్యాపించి ఉంది. క్షీణిస్తున్న గాలి నాణ్యత కారణంగా శ్వాసకోస వ్యాధుల తీవ్రత పెరిగింది. నగరమంతటా ఆస్మా రోగగ్రస్తుల సంఖ్య తక్కువేమీ కాదు. పైగా వారికి దీర్ఘకాలిక దగ్గు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కేసులు విపరీతంగా పెరిగాయి. యేడాది పొడవునా కాలుష్యస్థాయి పెరిగితే అందులో శీతాకాలంలో అనారోగ్య ప్రభావాన్ని తీవ్రతరమౌతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల కంటే రెట్టింపు స్థాయిలో సూక్ష్మ ధూళికణాలు వ్యాప్తి చెందినందున ప్రధాన ట్రాఫిక్ కారిడార్లన్నీకాలుష్య కేంద్రాలుగా మారిపోయాయి. ఢిల్లీ, ముంబయి వంటి నగరాలతో పోల్చి చూసినా గాలి నాణ్యతను బట్టి కాస్త మెరుగ్గా ఉందనిపించిన ఎప్పుడు ప్రమాదకర పరిస్థితిని సమీపిస్తుందోనని కాలుష్య నియంత్రణ మండలిఆందోళన పడ్తోంది. ఈ మధ్య కాలంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్' సదస్సులో విడుదల చేసిన నాణ్యతా గణాంకాలు నగర వాసులనుఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల మేరకు 40మైక్రోగ్రాములు ఉండాల్సి ఉంది. కానీ హైదరాబాద్‌లో 82 నుంచి 88 ఎంజీల వరకు ఉంటోంది. రెట్టింపు కాలుష్యాన్ని పీలుస్తున్నామన్న మాట. కేంద్ర కాలుష్య మండలి పరిమితి60ఎంజీతో పోల్చిచూస్తే హైదరాబాద్‌లో 35 శాతం అధిక కాలుష్యం ఉంది. గతంలో ఒక్కరోజు కూడా గాలినాణ్యతా సూచీలు(ఏక్యూఐ)సంతృప్తి స్థాయిలో ఉన్న దాఖలాలు లేవు.స్వచ్ఛమైన గాలి పీలుస్తా మనుకున్న సందర్భాలు లేవు. ఈ యేడాది జనవరిలో పిఎం-10 స్థాయి గరిష్టంగా 105ఎ.జి వరకు చేరుకుంది. అంటే గాలిలో విషతుల్యత పెరుగుతోందన్న విషయం స్పష్టమౌతోంది. వీటికి కారణమేంటని పరిశీలిస్తే పారిశ్రామిక కాలుష్యానికి తోడుగా వాహన కాలుష్యం స్థాయి కూడా పెరిగింది. ఢిల్లీలో మాదిరిగానే హైదరాబాద్‌లోనూ కాలుష్య సమస్య పరిష్కారానికి ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టడమొక్కటేనన్న సూచనలు అందుతున్నాయి. జంటనగరాల మొత్తం కాలుష్యంలో సగం కన్నా ఎక్కువ వాహన కాలుష్యానిదేనన్న దృఢమైన నిర్ధారణతో ఎలక్ట్రిక్ వాహనాలకి రాజమార్గాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. కాగా హైదరాబాద్ నగరంలో ఇటీవల 20వేల సిఎన్‌జి, ఎల్‌పిసి ఆటోలకు అనుమతి దొరికింది.సిఎన్‌జి వాహనాలతో కార్బన్ డైఆక్సైడ్ విడుదలవుతుంది.2008-2020ల మధ్య హైదరాబాద్ ఏటా5552 మంది వాయు కాలుష్యానికి బలికాగా,2023లో మాత్రం 1597 మరణాలను నమోదుచేసింది. ఆ లెఖ్ఖన ఇండియాలోనే హైదరాబాద్ ప్రమాదకర చావుల్ని కలుగ చేసే ఆరో నగరంగా నమోదైంది.నగరంలో పాశమైలారం,బొల్లారం పారిశ్రామిక ప్రాంతం,సనత్‌నగర్‌లు కాలుష్యస్థాయిలు అధికంగా ఉండే ప్రాంతాలుగా అందరికీ తెలిసిందే. కొంపల్లి, కుకట్‌పల్లి, ఖైరతాబాద్, కోటి, మెహదీపట్నం, హైటెక్‌సిటీల్లో ట్రాఫిక్ రద్దీ ఉండే ప్రాంతాలు. ఈ ప్రాంతాల్లో పిఎం 25, పిఎం 10లు గుర్తించారు. అంటే కాలుష్య వ్యర్థాలు వెలువడే ప్రాంతాలుగా ఉన్నాయి. ఈ యేడాది తొలినాడే సగటున 339పాయింట్లు కాలుష్య ఇండెక్స్‌లో నమోదైంది. కోవిడ్ సమయంలో ట్రాఫిక్ లేనేలేదు. జనం రద్దీలేదు అలాంటప్పుడు కాలుష్యం అప్పట్లో ఎక్యూఐ స్థాయి 98 నుంచి 100వరకు తగ్గింది. ఒకపక్క విద్యుత్ వాహనాల అవసరాన్ని నిపుణులు నొక్కిచెబుతున్న పరిస్థితుల్లో మరో పక్క కాలుష్యకారక వాహనాలకు అనుమతినీయడం ఎవరూ జీర్ణించుకులేకపోతున్నారు. 30నుంచి 40 శాతంగా ఉన్న వాహన కాలుష్యాన్ని కట్టడిచేయడానికి విద్యుత్ వాహనాలను ప్రోత్సహించే పూర్తిబాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. మరో విషయమేమిటంటే హైదరాబాద్ వంటి నగరాల్లో రానున్నా వేసవిలో జలకాలుష్యం కూడా ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.ఇటీవలే మధ్యప్రదేశ్‌లో ఇండోర్‌లో కొన్నిమరణాలు నమోదయ్యాయి. నగరంలో వాయుకాలుష్యం పెరగడానికి నగర శివారు ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణ పనులు, పారిశ్రామిక ఉద్గారాలు కూడా ప్రధాన కారణమే. వీటి వలన గాలి నాణ్యత పడిపోకుండా చూడాలి. జల, వాయు కాలుష్యాలు పోటీ పడి ప్రభావం చూపుతున్నప్పుడే అప్రమత్తత అవసరం.

జీవితంలో తృప్తి పడటం నేర్చుకున్న వ్యక్తి ఎన్నడూ విచారానికి గురికాడు. అది చేతకాని వ్యక్తి ఎప్పుడూ దు:ఖానికి గురౌతూనే ఉంటాడు.



జార్జి ఇలియెట్

మనం ఇష్టపడినది దక్కనప్పుడు, మనకు దక్కిన దానినే ఇష్టపడాలి.



రామకృష్ణ పరమహంస

# ప్రజావాక్కు



## సెల్‌ఫోన్లకు బానిసలవుతున్న యువత

సెల్‌ఫోన్లకు విపరీతంగా బానిసలై పోతున్నారు ఈనాటి యువత. ఈఊబిలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నవారి సంఖ్య రానురాను పెరుగుతోంది. దీనికి విరుగుడు కనుచూపుమేరలో కనిపించడంలేదు. అందరూ సాంకేతికత పెరుగుదలను పొగుడుతున్నారేకాని ఆప్రక్కనే ఉన్న అపాయాలను ఊహించలేదు. ముఖ్యంగా విద్యార్థుల చేతులలో పుస్తకం బదులు సెల్‌ఫోన్లే కనిపిస్తున్నాయి. మొన్నీమధ్య ఘజియాబాద్‌లో ముగ్గురు బాలికలు కొరియన్ గేములకు బానిసలై బడికి వెళ్ళకపోతే తల్లిదండ్రులు మందలించగా ఈపిల్లలు తొమ్మిదోఅంతస్తు నుండి దూకి ప్రాణాలు తీసుకున్నారు. ఎంతసేపు లేకఎంతకాలంపిల్లలనుకాపు కాయాలి? ఆత్మహత్యలు బహుతేలికైపోయాయి. కొన్ని దేశాలలో మైనారిటి దాటని పిల్లలను ఫోన్లువాడడం నిషేధించింది. వీటిలో అర్థం పర్థం లేని సమాచారాన్ని వీడియోలను చట్టపరంగా నిషేధించాలి.

- ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

## దేవుడు లేనిదెక్కడ?

మన్నులో,రాయిలో,కొమ్మలో,రెమ్మలో, ఆకులో, పూవ్వులో ప్రతిమనిషిలోసర్వజీవుల్లో అణువణువుల్లో భగవత్ స్వరూపం నిండి ఉంది. ఆ స్వరూపాన్ని దర్శించుకోవాలి. అయితే ఇలాంటివి తెలియక దేవుడు గుడిలో, చెర్చిలో, మసీదులో ఉంటాడనుకుని అమాయకంగా భక్తజనవ్యయ ప్రయాసల కోర్చి దేవుడి కోసం ఎక్కడికక్కడ వెళుతుంటారు. మరికొంత మంది రాజకీయవేత్తలు రాముడే దేవుడంటారు. ఆయన భజన చేస్తున్నారు. ఓట్లకోసం రాముడి పేరును ఉపయోగిస్తున్నారు. పథకాలకు కూడా ఆరాముడి పేరే పెడుతున్నారు. రామభక్తులు ఎప్పుడూ ఇలా చేయరు.

- మిథునం, హైదరాబాద్

## భూమి అభివృద్ధి లోనే..అసలు ఉపాధి

భూమి అభివృద్ధి చేసిన తరవాత వాటిని వినియోగంలోకి తెమ్మని ఆ దిశగాఅడుగులు వేయమని చెప్పాల్సిన బాధ్యత పంచాయితీ కార్యదర్శుల మీద ఉంటుంది. ఇక్కడ రెండు అంశాలను పరిశీలిస్తే ఎక్కువ మంది కూలీలకు ఒకేదగ్గర పనిచేసే అవకాశం దొరుకుతుంది. సగటు వేతన రేట్ కూడా ఎక్కువ. ప్రభుత్వం నుండి రావాల్సిన రైతు భరోసా నిధులు సమాకూరుతాయి. అంతమాత్రమే కాదు పీయం కిసాన్ యోజన కూడా అదనం.

-భారత అవినాష్, జనగాం

## అవుట్ సోర్సింగ్ కీలకపాత్ర

నేటి ఉపాధి రంగంలో అవుట్‌సోర్సింగ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, కొన్నిఏజెన్సీల అక్రమధోరణులు కార్మికులకు శాపంగా మారుతున్నాయి. నిరుద్యోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని సంస్థలు భారీ మోసాలకు పాల్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం లేదా ప్రైవేట్ సంస్థల నుండి వచ్చే నిధులను కార్మికులకు పూర్తిస్థాయిలో అందించకుండా మధ్యలోనే దారి మళ్లిస్తున్నాయి. సరైన వేతనాలుచెల్లించకపోవడంతో పాటు చట్టబద్ధంగాఅందాల్సిన ప్రయోజనాలను కాలరాయడం ఆందోళన కలిగించే అంశం. నిబంధనల ప్రకారం ప్రతి ఉద్యోగికి ప్రావిడెంట్ ఫండ్, ఉద్యోగుల రాష్ట్ర బీమా, గ్రాట్యుటీ, వైద్య సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. కానీఅనేక ఏజెన్సీలు కార్మికుల వేతనాల నుండి పీఎఫ్ వాటాను కోత విధిస్తున్నప్పటికీ, ఆ సొమ్మును వారి ఖాతాల్లో జమ చేయడం లేదు. అలాగే వైద్య అత్యవసర సమయాల్లో ఆదుకోవాల్సిన ఈఎస్ఐ సౌకర్యాన్ని కూడా గాలికి వదిలేస్తున్నాయి. దీనివల్ల ప్రమాదాలు జరిగినప్పుడు లేదా అనారోగ్యం బారిన పడినప్పుడు కార్మికులు ఆర్థికంగా చితికిపోతున్నారు.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## గంజాయి సరఫరా

దేశంలో చట్టాలు కఠినమవుతున్నాయన్న భావన ఉన్నప్పటికీ, గంజాయి సరఫరామాత్రం అడ్డుకట్టలేకుండా విస్తరిస్తోంది. పట్టణాల నుండి పల్లెలవరకు ఈనిషేధిత మత్తుబారిన పడుతున్నది ముఖ్యంగా యువత. ఇది చట్టసంబంధ సమస్యమాత్రమే కాదు సమాజంపై పాకుతున్న మహమ్మారి. సరిహద్దు రాష్ట్రాల నుండి భారీగా రహస్య రవాణా, పట్టణాల్లో చిన్న నెట్‌వర్క్‌ల ద్వారా విక్రయంఇవన్నీ సంఘటిత నేరవ్యవస్థగా మారాయి. అరె స్టులు జరిగినప్పటికీ, డిమాండ్ పెరగడంవల్ల ఈ వ్యాపారం ఆగట్లేదు.

-కె.రామారావు, నల్గొండ

## ప్రతిభను ప్రోత్సహించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివిపైకి రావాలని ఆశించడం సహజమైనప్పటికీ వారికి ఏ రంగంలో ఆసక్తిగలదో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకు ఉపాధ్యాయులు విలువగల విద్యను అందించి విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి. చిన్నచిన్న తప్పులను క్షమించి మరో సారిపునరావృతం కాకూడదని గట్టిగాహెచ్చరించాలి. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ విద్యార్థుల భవిష్యత్‌కు కీలకం కావాలి.

-ఆర్.వెంకటేష్, బెంగళూరు

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇంకెన్నాళ్లీ కంచి గరుడ సేవ?

**పార్టీనే నమ్ముకుని కార్యకర్తలుగా ఏళ్లతరబడి జెండాలు మోస్తూ పార్టీకి, ప్రజలకు సేవ చేస్తున్న కార్యకర్తలను విస్మరించకూడదు. ఏ కోణంలో చూసినా ధర్మం కాదు. కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నామినేటెడ్ పదవులకు కూడా కప్పదాట్లకు పాల్పడినవారినో, వారసులనో అందలంఎక్కిస్తే నిజమైన కార్యకర్తల పరిస్థితిఎలా ఉంటుందో ఆలోచించాలి. కార్యకర్తల్లో నిరాశానిస్పృహలు పెరిగి దూరమైతే పార్టీ పరి స్థితి ఏమవుతుందో పెద్దలకు తెలియందికాదు. క్రమేణ క్షేత్రస్థాయిలో పార్టీకి అంకితభావంతో పనిచేసే కార్యకర్తలు దూరమైపోతున్నారు. కూలీకి తీసుకువచ్చి డబ్బులతోపాటు, బిర్యాని ప్యాకెట్, మద్యం సీసా ఇచ్చి కార్యకర్తలుగా చూపించుకోవాల్సిన దౌర్భాగ్యపరిస్థితులు దాపురించాయి. ఒక్కటిమాత్రం వాస్తవం కార్యకర్తలు లేని పార్టీ, పునాదులు లేని భవనాల్లాగా కూలిపోయి కనుమరుగుకాక తప్పదు.**

దామెర్ల సాయిబాబ

'కూడు గుడ్డ అడక్కపోతే బిడ్డను సాకినట్లు సాకుతాం' అన్నట్టుగా ఉంది కార్యకర్తల పట్ల రాజకీయ పార్టీల వైఖరి. ధర్నాలంటారు, రాస్తారోకోలంటారు, పార్టీ సమావేశాలంటారు, కార్యకర్తల మీటింగ్‌లంటారు, శిక్షణాతరగతులంటారు, పార్టీ విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలంటారు, బహిరంగ సభలకు జనాన్ని తరలించుకు రావాలంటారు. ఇలా ఒక్కటేమిటి యేడాది పొడుగునా ఏదో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తూనే ఉంటారు. పైకి ఏమనలేక పోయినా జీతభత్యం లేని ఈ కంచిగరుడ సేవ ఇంకెన్నాళ్లనుకునేవారి సంఖ్య ఎక్కువైపోతున్నది. ముఖ్యంగా దిగువ శ్రేణి నాయకులకు ఆర్థికభారం ఎలా భరించాలన్నదే సమస్యగా పరిణమిస్తున్నది. కొందరు కార్యకర్తలు ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. ఏనాటికైనా తమ సేవలను గుర్తించకపోతారా? ఏదో పదవి రాకుండాపోతుందా? అనే ఆశతో కొందరు ఈ రాజకీయ యజ్ఞంలో పోరాటం చేస్తూనే ఉన్నారు. గతంలో ఇలా రాజకీయ కార్యకర్తలుగా జీవనం ప్రారంభించిన వారెందరో సర్పంచులుగా, సమితి అధ్యక్షులుగా, ఎమ్మెల్యేలుగా, పార్లమెంటు సభ్యులుగా, కేంద్ర మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ విడిపోయి ఇందిరా కాంగ్రెస్ ఏర్పడినప్పుడు కార్యకర్తలే నాయకత్వం వహించి పెద్దపెద్ద పదవులను అధిష్టించారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో నూతన నాయకులు పుట్టుకొచ్చారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ ఆనాడు వెనుకబడిన తరగతుల వర్గాల నుంచి ఎందరినో నాయకులుగా తీర్చిదిద్దింది. అలా నాయకులుగా ఎదిగిన వారెందరో అటు పాలనలోనూ, ఇటు ప్రజాభిమానం పొందడంలోనూ గుర్తింపు కలిగిన స్థానం సంపాదించుకోగలిగారు. మొన్నటి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఎందరో కార్యకర్తలు మంత్రులుగా, పార్లమెంటు సభ్యులుగా ఎదగడమేకాదు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు. ఇలాంటివారిని ఆదర్శంగా తీసుకొని కొంద రు కార్యకర్తలు ఏళ్లతరబడి జెండాలుమోస్తూ నాయకత్వం ఇచ్చినఆదేశాలను తు.చ తప్పకుండా పాటిస్తూ అవిరామంగా కృషిచేస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడుతమ సేవను గుర్తించకపోతారా? అవకాశం ఉన్నప్పుడు నామి నేటెడ్ పదవుల్లో తమతమ స్థాయిని బట్టి నియమించక పోతారా? అనేదే వారి ఆశ, తపన, ఆరాటం. కానీ పరిస్థితులు మారిపోయాయి. దాదాపు అన్నిపార్టీల్లోనూ క్షేత్రస్థాయి లో అహర్నిశలు పనిచేస్తున్న కార్యకర్తలను విస్మరిస్తున్నారే మోననిపిస్తున్నది. పార్టీలపరంగా సిద్ధాంతాలు ఏర్పరుస్తున్నా అందులో తమకు ఎలా లాభం, అవకాశాలు దక్కించుకోవాలనే ఆరాటం అధిక శాతం నేతల్లో కన్పిస్తున్నది. అందుకే యువతకు ప్రాధాన్యత అంటే కుమారులనో, అల్లుళ్లనో కొందరు నేతలు ముందు పెడుతున్నారు. మహిళలు అంటే కుమార్తెలనో, భార్యల పేర్లనో చెబుతున్నారు. రానురాను రాజకీయ వారసులు ఎక్కువైపోతున్నారు. చివరకు సర్పంచ్ పదవులను కూడా వదిలిపెట్టడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య కార్యకర్తలకు భవిష్యత్‌లో కూడా కనుచూపు మేరలో అవకాశాలు కన్పించడం లేదు. పెద్దపెద్ద పదవుల సంగతి దేవుడెరుగు. వార్డుమెంబర్ల లాంటి చిన్న పదవులకు కూడా ఈ సంప్రదాయం విస్తరిస్తున్నది. అందరికి పదవులుఇవ్వడం అనేది సాధ్యమయ్యేపనికాదనేది వాస్తవం కావొచ్చు. అసలు ప్రజాసేవ, ప్రజాభిమానం వంటి కొలమానంతో పదవులు ఎంపిక చేసే రోజులకు కాలం చెల్లిపోయింది. దాదాపు ప్రతి పార్టీ కూడా గెలుపు గుర్రాలకోసమే అన్వేషణ. ఆర్థిక స్తోమత

## ఒక్క మాట

ఉందా? ఖర్చు పెట్టగలిగే శక్తిఉందా? కుల బలం ఏమిటి? ఏ నాయకుడికి తోకగా, భాకాగా వ్యవహరిస్తున్నారని చూస్తున్నారే తప్పప్రజలకు, పార్టీకి అంకితభావంతో పనిచేసే వారిని పట్టించుకునే రోజులు పోయాయి. రాజకీయమే ఒక ఖరీదైన వ్యాపారంగా రూపుదాల్చింది. పెట్టుబడులుపెట్టడం, ఎన్నికల్లో గెలవడం, తిరిగి రాబట్టుకోవడం, మళ్లీ పెట్టుబడి ఇలా ఒక విషవలయంగా మారి ఆర్థిక, అంగబలం ఉన్నవారే ఈ విష వలయంలోకి రాగలుగుతున్నారు. సామాన్యులెవరూ ఆవైపు కన్నెత్తిచూసే ధైర్యం చేయలేకపోతున్నారు. ప్రజలతో సంబంధం లేనివారు నేరుగా మంత్రులైపోతున్నారు. ఇక్కడా, అక్కడా అనికాదు. దేశవ్యాప్తంగా ఇవేపరిస్థితులు నెలకొన్నాయి. సర్పంచ్ పదవికూడా లక్షలాది రూపాయల డబ్బు, మద్యం వెచ్చించాల్సిన దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. ఇదేదో కొత్తవిషయం కాదు. అందరికి తెలిసిందే. కానీ ఈ సంప్రదాయం రానురాను శృతిమించిపోతున్నది. 2004లో లోక్‌సభకు ఎన్నికైన వారిలో కోటీశ్వర్లు ముప్పైశాతంఉంటే, 2024 నాటికి తొంభైమూడు శాతా నికి పెరిగింది. ఇక దేశవ్యాప్తంగా 492 మంది ఎమ్మెల్యేల ప్రమాణపత్రాలను ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఎడిఆర్)గత యేడాది పరిశీలిస్తే మూడువేల మూడువందల ఎనభైఎనిమిది మంది శాసనసభ్యులు కోటీశ్వరులు కాగా, మరో ఆరువందల తొంభైనాలుగు మంది లక్షాధికారులని ఎన్నికల సమయంలో వారు ఇచ్చిన అఫిడెవిట్‌లోనే వెల్లడించారు. ఇక రాత్రికిరాత్రి పార్టీలు మార్చే దుస్సంప్రదాయం కూడా విస్తరిస్తున్నది. ప్రత్యర్థిపార్టీలో ఉండి విమ ర్శలు కురిపించి తెల్లవారేసరికి పార్టీ మార్చి అధికారం వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రజాసేవ కోసమే తాము అధికార పార్టీలోకి మారుతున్నట్లు చెప్పుకుంటున్నారు. ఈ శిక్షణలు, సిద్ధాంతాలు, మానిఫెస్టోలు ఎందుకు అనే అనుమానాలు రాకతప్పదు. ఒకవేళ పార్టీ సిద్ధాంతాలను, క్రమశిక్షణ, ప్రజా సేవల గురించి శిక్షణ ఇవ్వాల్సి వస్తే ముందుగా పదవులు వెలగబెడుతూ పార్టీపరువు, ప్రతిష్టను బజారున పెడుతున్న పెద్దలకు ఇవ్వాలి. పార్టీలోనే ఉంటూ గోతులుతవ్వే నాయకులకు ఇవ్వాలి. కేవలం అధికారంకోసం కప్పదాట్లకు సిద్ధపడే నేతలకు ఇవ్వాలి. ఎన్నిశిక్షణలు ఇచ్చినా, ఎన్ని నిబంధ నలు పెట్టుకున్నా పాటించేవారే లేకుండా పోతున్నారు. దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఉండి ప్రజాభిమానం చూరగొని పార్టీ ద్వారా పదవులు, సకలసౌకర్యాలు అనుభవించి తరతరాలకు సరిపోయే సంపద కూడపెట్టుకొన్నవారు కూడా కప్పదాట్లకు పాల్పడుతుండడం అత్యంత దురదృష్టకరం. కొందరునేతలు తమవ్యాపారాల రక్షణ, విస్తరణ కోసం, మరికొందరు వారసులపై వాత్సల్యంతో వారిని ఎన్నికల్లో దింపేందుకు ఒక వ్యూహం ప్రకారం అడుగులు వేస్తున్నారు. ఇలా రకరకాల కారణాలతో పార్టీల మార్పిడికి తెగబడుతున్నారు. ఈపార్టీ, ఆపార్టీ అనికాదు అన్ని పార్టీలోనూ దాదాపు ఇదేపరిస్థితి నెలకొన్నది. ఇక క్రమశిక్షణ అన్నది చాలా పార్టీలు ఏనాడో మరచిపోయాయి. పార్టీకి నష్టం తెచ్చే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా మనవాడేకదా అని సర్దుకుపోతే మళ్లీమళ్లీ ఇలాగే జరుగుతుంటుంటాయి. ప్రజల దృష్టిలో పార్టీచులకన అవుతుంది. ఇంటి దీపమే కదా అని ముద్దు పెట్టుకుంటే మూతికాలక తప్పదనే విషయాన్ని విస్మరించకూడదు. క్రమశిక్షణలో విఫలమై, ప్రజలకు దూరమైన పార్టీలు, నేతలు ఎందరో ఉన్నారు. ప్రజల్లో ఎంతోచైతన్యం వచ్చింది. ప్రతినాయకుడి కదలికల ను, ప్రవర్తనా శైలిని ప్రజలు వెయ్యి కళ్లతో గమనిస్తున్నారు. ముఖ్యంగా కష్టం కలిగినప్పుడు పార్టీని వదిలివెళ్లి, ఇష్టం వచ్చినప్పుడు తిరిగి రావొచ్చనే దుస్సంప్రదాయానికిఅడ్డుకట్ట వేయాలి. అధికారంలో ఉన్నప్పుడు సకలసౌకర్యాలు అనుభ వించి ఆర్థికంగా స్థిరపడి, అధికారం కోల్పోగానే అంతవరకు తాముపిమర్శించిన, వ్యతిరేకించిన పార్టీలోకి దూకేది కార్యకర్తలుకాదు. కొందరు నేతలే. పేర్లురాసి వారిని ఇబ్బందిపెట్టడం ఎందుకు కానీ, వారెవరో? వారి చరిత్ర ఏమిటో? ప్రజలకు తెలియందికాదు. ఇప్పటికైనా రాజకీయ పార్టీల నేతలు మనసుపెట్టి ఆలోచించాలి. పార్టీనే నమ్ముకుని కార్యకర్తలుగా ఏళ్లతరబడి జెండాలుమోస్తూ పార్టీకి, ప్రజలకు సేవచేస్తున్నకార్యకర్తలను విస్మ రించకూడదు. ఏ కోణంలో చూసినా ధర్మం కాదు. కార్యకర్త లకు ప్రాధాన్యత ఇవ్వాలి. నామినేటెడ్ పదవులకు కూడా కప్పదాట్లకు పాల్పడినవారినో, వారసులనో అందలం ఎక్కిస్తే నిజమైన కార్యకర్తల పరిస్థితిఎలా ఉంటుందో ఆలోచించాలి. కార్యకర్తల్లో నిరాశానిస్పృహలు పెరిగి దూరమైతే పార్టీపరిస్థితి ఏమవుతుందో పెద్దలకు తెలియందికాదు. క్రమేణా క్షేత్రస్థాయిలోపార్టీకి అంకితభావంతో పనిచేసే కార్యకర్తలు దూరమైపోతున్నారు. కూలీకి తీసుకువచ్చి డబ్బులతో పాటు, బిర్యాని ప్యాకెట్, మద్యంసీసా ఇచ్చి కార్యకర్తలుగా చూపించుకోవాల్సిన దౌర్భాగ్యపరిస్థితులు దాపురించాయి. ఒక్కటిమాత్రం వాస్తవం కార్యకర్తలు లేని పార్టీ, పునాదులు లేని భవనాల్లాగా కూలిపోయి కనుమరుగుకాక తప్పదు. ●

# ధరల భారంతో కుంగుతున్న సామాన్యుడు..

లాడెల చిన్న ఈరన్న

ఆం సామాన్యుడి జీవితంలో 'నెల ఎలా గడిచింది?'అనే ప్రశ్న ఇప్పుడు 'నెల ఎలా గడపాలి?'అనే ఆందోళనగా మారింది. ఆదాయం స్థిరంగా ఉన్నా, ఖర్చులు మాత్రం ఆకాశాన్ని తాకుతున్నాయి. కూరగాయలు, బియ్యం, పప్పులు, పాలు, వంట నూనె వంటి నిత్యావసరాల ధరలు ప్రతి వారం కొత్త రికార్డు సృష్టిస్తున్నాయి. దీనికితోడు సామాన్యులు తమ పుత్ర,రత్నాలకు తమకు తోచిన విధంగా పెండ్లిల్లు చేయాలంటే బంగారం, వెండి వస్తువుల వైపు చూడాల్సి వస్తుంది. అవి కూడా ఆకాశాన్ని తాకుతూ వస్తున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందో నిపుణులకే అర్థం కావడం లేదు. సరే ఇదే రేట్లు రైతులు పండించిన పంటల్లో ఉన్నాయా అంటే అలా లేదు. వారి దగ్గర ఏమో తక్కువ రేటు ఇక్కడేమో ఎక్కువ రేటు కొనబోతే కొరివి అమ్మ బోతిఅడివి అన్నచందంగా తయారైంది ప్రస్తుత సామాన్యుల పరిస్థితి. ఒకప్పుడు మార్కెట్కు వెళ్లిన కుటుంబాలు, ఇప్పుడు జాబితా చేతిలో పెట్టుకుని ఒక్కో వస్తువు తీసుకునే ముందు రెండు సార్లు ఆలోచించే పరిస్థితికి చేరుకున్నాయి. ధరల పెరుగుదల సామాన్యుడి జీవనశైలినే మార్చేస్తోంది. అవసరాలు తగ్గించుకోవడం, కోరికలను వాయిదా వేయడం, కొన్నిసార్లు అవసరాలకే తాళం వేయడం నేటి వాస్తవంగా మారింది. ధరల భారంతో కుటుంబ బడ్జెట్ పూర్తిగా కుదేలైంది. జీతం వచ్చిన రోజే అద్దె, విద్యుత్ బిల్లు, గ్యాస్ ఖర్చులు పోయి చేతిలో మిగిలేది చాలా తక్కువగా ఉంటోంది. పిల్లల చదువు ఖర్చులు, వైద్యఅవసరాలు, అదనపు భారం అవుతున్నాయి. మధ్యతరగతి కుటుంబాల్లో పొదుపు అనేమాట దాదాపు కనుమరుగవుతోంది. పేద కుటుంబాల పరిస్థితి మరింత కఠినంగా మారింది. రోజు కూలీపై ఆధారపడే కుటుంబాలు పనిదొరికినా, వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని నడపలేనిస్థితికి చేరుతున్నాయి. ఈ పరిస్థితి కేవలం ఆర్థిక సమస్యగానే కాదు, మానసిక ఒత్తిడిగా కూడా మారుతోంది. ధరల పెరుగుదల వెనుక కారణాలు ఎన్నోఉన్నా, వాటిని నియంత్రించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. సరఫరా వ్యవస్థలో లోపాలు, దళారుల ఆధిపత్యం, నిల్వలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వంటి అంశాలు ధరలను పెంచుతున్నాయి. కానీ వీటిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన చోటప్రభుత్వాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ధరల నియంత్రణపై స్పష్టమైన వ్యూహం లేకపోవడం సామాన్యుడిలో అసంతృప్తిని పెంచుతోంది. ప్రజల జీవన వ్యయం పెరిగితే, పాలనపై విశ్వాసం తగ్గడం సహజమే అనే భావన బలపడుతోంది. ధరల భారం నుంచి సామాన్యుడికి ఊరట కల్పించాలంటే కఠిన నిర్ణయాలు అవసరం. నిత్యావసర వస్తువుల ధరలపై కట్టుదిట్టమైన నియంత్రణ, మార్కెట్ వ్యవస్థలో పారదర్శకత, దళారులపై కఠినచర్యలు తీసుకోవడం అత్యవసరం. అదే సమయంలో ఆదాయ వర్గాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను మరింత ప్రభావవంతంగా అమలు చేయాలి. సామాన్యుడి జీవితం సులభమైతేనే సమాజం స్థిరంగా ఉంటుంది. ధరల భారం తగ్గిన రోజే సామాన్యుడి ముఖంలో ఆశ, భవిష్యత్తుపై నమ్మకం మళ్లీ కనిపిస్తుంది. ధరల నియంత్రణ ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అయినప్పటికీ, ఆ బాధ్యత సరిగ్గా నిర్వర్తించబడుతోందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మార్కెట్లో ధరల పెరుగుదలపై పర్యవేక్షణ లేకపోవడం, దళారుల ఆధిపత్యం, సరఫరా వ్యవస్థలో లోపాలు సామాన్యుడిపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. అవసరమైతే తక్షణ చర్యలు తీసుకోవాల్సిన చోట, ప్రకటనలకే పరిమితమవుతున్న పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ధరల భారం నుంచి సామాన్యుడికి ఊరట కల్పించాలంటే మాటలు సరిపోవు, కార్యాచరణ అవసరం. మార్కెట్ నియంత్రణను బలోపేతం చేయడం, నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించే విధానాలను కఠినంగా అమలు చేయడం, ఆదాయవర్గాలకు అనుగుణంగా సంక్షేమ చర్యలు తీసుకోవడం అత్యవసరం. ●

# పెరుగుతున్న జిడిపి ఎవరి పాలు?



డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

ఇనీక్వాలిటీ రిపోర్ట్ ప్రకారం మనదేశంలో మొత్తం 100 రూపాయలు జీడీపీ ఉత్పత్తుల్లో పై వర్గానికి, 60 రూపాయలు మధ్యతరగతికి, దిగువన ఉన్నవారికి 15 రూపాయలు పొందుతున్నారు. ప్రపంచ అసమానతల నివేదిక చూస్తే పైనున్న10 శాతం మంది కుబేరుల జాతి ఆదాయంలో 58శాతం సంపాదిస్తున్నవైపరీత్యాన్ని చెబుతున్నది. ఇది 2022 లో కన్నా అధికం అయితే మరోవైపు అడ్డఅడుగున 50 శాతం మంది కేవలం 15 శాతంమాత్రమే పొందగలుగుతున్నారు. 2025 సెప్టెంబర్‌లో చూస్తే పన్ను మినహాయింపు తర్వాత పెట్టుబడి లాభాల నిష్పత్తి 1.47 శాతంగా ఉంటుందని అంతులేని దోపిడీతో పోగుబడినహద్దు మీరిన లాభాల ప్రత్యక్షదృశ్యం ఇది. గత కొన్ని సంవత్సరాలుగా దేశంలో ప్రవేట్ పెట్టుబడులో పెరగకపోగా విదేశీ పెట్టుబడులు కూడా దేశంలోకి రావడం తగ్గిపోయాయి. మన పెట్టుబడిదారులు విదేశాల్లోపెట్టుబడులు పెట్టడంఎక్కువైంది. అధిక ఆదాయం పొందుతున్న వారు అధిక పన్ను కట్టాల్సి ఉండగా ఈ వర్గాన్ని ముట్టుకునే సాహసం నేటి ప్రభుత్వాలు చేయడం లేదు. కార్పొరేట్ రంగానికి లక్షల కోట్లు రాయితీలు ఇచ్చారు. వీరు ఈ దేశంలో పెట్టుబడులు పెట్టకుండా ఇక్కడ సంపాదించుకున్న డబ్బులు పోగుచేసుకునే విదేశాల్లో పెట్టుబడులు పెట్టుటకు పరుగులెత్తుతున్నారు. 2014 నుంచి 2025 వరకు 26500మంది మన సంపన్నులు వేరే దేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకువెళ్లిపోయారు. ఫలితంగా జిడిపిలో పారిశ్రామిక ఉత్పత్తిగణనీయంగా తగ్గిపోయింది. మ్యానుఫ్యాక్చరింగ్ రంగంలో పనిచేసే కార్మికులు కూడా ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. దీనికితోడు మేక్ ఇన్ ఇండియా ఆత్మనిర్భర భారత్ ఉత్పత్తి అనుబంధ రాయితీలు మొదలైనవి ఉద్యోగ కల్పనలో విజయవంతం కాలేదు. సీఎంఒ డేటా ప్రకారం కార్పొరేటర్‌లు తాముపెట్టిన పెట్టుబడిపై పొందుతున్న లాభాలు గత 14ఏళ్లలో ఎన్నడూ లేనంత ఎక్కువగా పొందుతున్నారు. నూతన ఆర్థిక విధానాలు చేపట్టిన తరువాత ప్రపంచీకరణ పుణ్యమా అని, పేదలకూ సంపన్నులకూ మధ్యపూడ్చలేనంత వ్యత్యాసం ఏర్పడింది. ఆర్థికసంస్కరణల వల్ల సృష్టించబడే సంపద అట్టడుగున ఉన్న పేదల వరకూ చేరుతుందనీ ఆర్థికవేత్తలు, పాలకులు పేర్కొన్నారు. అయితే, సంస్కరణల పేరుతో సాగిన ప్రైవేటీకరణ కారణంగా సృష్టించబడిన సంపదలో సింహభాగం పైస్థాయి ఉన్నత ఆదాయ వర్గాల వారికి చేరింది. పెరిగిన జీడీపీలో నామ మాత్రపు భాగం మాత్రమే కింది వర్గాలకు చేరుకుంది. దేశం తలసరి ఆదాయం ప్రస్తుతం 3000 డాలర్లు ఉండగా ఉన్న





త ఆదాయ వర్గాల పైభాగంలో ఉన్న పది శాతం ధనికుల తలసరిఆదాయం 14వేల మిలియన్ డాలర్లుగా ఉంది. ఫలితంగా, ఆర్థిక అసమానతలు అంతకుముందెన్నడూలేనంతగా దేశంలో పెరిగిపోయి, నేడు దేశంలో 10శాతం ప్రజల వద్ద 77శాతం దేశ సంపద పోగుపడింది. కింది స్థాయిలో ఉన్న 50శాతం మంది ప్రజల వద్ద నామమాత్రంగా 4.1శాతం సంపద మాత్రమేఉంది. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం2022-23 ఆర్థిక సంవత్సరంలో 22.3శాతం జాతీయాదాయాన్ని 1శాతం మంది ఎగరేసుకుపోయారు. ఇది ఒకప్పటి రాచరిక వ్యవస్థలో అసమానతల కంటే ఎక్కువ. ఇంకా విపులంగా చెప్పాలంటే, ప్రముఖ అమెరికన్ పత్రిక ఫోర్బ్స్ కథనం ప్రకారం, 1991లో భారతదేశంలో ఒకే ఒక్క బిలియనీర్ ఉన్నాడు. 3దశాబ్దాల కాలంలో అమలైన సంస్కరణల ఫలితంగా, బిలియనీర్‌ల సంఖ్య నేడు దేశంలో 350కు చేరుకున్నారు. ఈ 350మంది నయాకుబేరుల సంపద జాతీయాదాయం పెరుగుదలలో 25శాతంగాఉంది! ఆర్థిక సంస్కరణల ప్రయోజనాల్ని కొందరు పారిశ్రామికవేత్తలు పొందుతున్న తీరు, అందుకు కొందరు పాలకులు సహకరిస్తున్న విధానం, వారికి లబ్ధి చేకూరేలా తీసుకుంటున్న పాలసీల కారణంగాసంపన్నులు మరింత సంపన్నులు అవుతున్నారు. ముఖ్యంగా, కార్పొరేట్లకు పన్ను విధానాలను అవలంబించడంవల్ల జాతీయాదాయానికి భారీగా నష్టమవుతున్నది ఫలితంగా ఆర్థిక అసమానతలు భారీగా పెరిగాయి. ఫలితంగా, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు చేయాల్సిన దుర్గతిపట్టింది. స్థూలజాతీయ ఉత్పత్తిలో ప్రభుత్వం అప్పుల శాతం80శాతానికి పైబడింది. సహజవనరుల్ని కొద్దిమందికి ధారాదత్తం చేయకుండాఉంటే, ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. అప్పుడు ప్రజలు ఉచితాలతో బతికే అవసరం ఉండదు. నిరుద్యోగం, పేదరికం, అప్పుల కారణంగా దేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య కూడా అంతకంతకూ పెరిగిపోతోంది. భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటున్నదని వేసుకొంటున్న లెక్కలు నిజమే కావచ్చు. ఆర్థిక వ్యవస్థలోని అసమానతల్ని తగ్గించకుండా, కేవలం జీడీపీ లెక్కలతో మురిసిపోతే ప్రయోజనం ఏమిటి? ఆకలి చావుల సూచికల్లో ప్రపంచ దేశాలలో మన దేశం 123 దేశాలలో 102వ స్థానంలోఉంది. ఆర్థికఅసమానతలు లేకుండా ప్రపంచంలోని ఏ దేశమూ ఉండదన్న మాటనిజమే. అగ్రరాజ్యాలుగా చెప్పుకుంటున్న అమెరికా, ఫ్రాన్స్, జపాన్, జర్మనీ వంటి దేశాల్లో కూడా ఆర్థిక అసమానతలు ఉన్నాయి. మన దేశ ఆర్థికవ్యవస్థలో అంతర్గతంగా ఇమిడిఉన్న పలు బలహీనతలను సవరించకుండా, పెరుగుతున్న స్థూల జాతీయాభివృద్ధి ఫలాలు అందరికీ చెందేలా చర్యలు తీసుకోకుండా, భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోందని చాటుకోవడం ఆత్మవంచనే అవుతుంది. ఇది ప్రజాశ్రేయస్సు మాత్రం కాదు. ఒకమాటలో చెప్పాలంటే మనది ఉచితాల ఆర్థిక వ్యవస్థ. అప్పుల ఊబిలోఉన్న ఆర్థికవ్యవస్థ. విపరీతమైన ఆర్థిక అసమానతలు ఉండటమే దేశంలో ప్రధానమైన సమస్య. దీనిని నివారించకుండా ప్రజా శ్రేయస్సును పెంపొందించలేం. ఇది పాలకుల వైఫల్యమే. దేశంలో పాలకులు, ప్రభుత్వాలు, కార్పొరేట్‌లు ప్రజల ఆదాయాలు పెరిగే విధానాన్ని అవలంబించితే తప్పజిడిపి పెరుగుదల సాధ్యంకాదు. ●

# ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు



## 31 మందికిపైగా దుర్మరణం, 160 మందికి పైగా గాయాలు

## క్షతగాత్రులలో పలువురి పరిస్థితి విషమం

## ఓ ప్రార్థనామందిరం వెలుపల జరిగిన ఆత్మాహుతి దాడి

## ఇస్లామాబాద్‌లో ఎమర్జెన్సీ విధింపు

**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 6:** పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది. షెహజాద్ టౌన్ ఏరియా టేర్లాయి ఇమామ్ బారగాహ్ వద్ద శుక్రవారం జరిగిన ఈ పేలుడులో సుమారు 31 మందికిపైగా మరణించగా.. 160 మందికిపైగా గాయపడినట్టు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు చెబుతున్నారు. ఇది ఆత్మాహుతి బాంబర్ దాడిగా అనుమానిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే పెద్దఎత్తున భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తరలిస్తున్నారు. గాయపడిన వారిలో చాలామంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం షియా ప్రార్థనా మందిరం ప్రధాన ద్వారం వద్ద ఆత్మాహుతి దాడి జరిగినట్టు చెబుతున్నారు. భారీ దాడిలో ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించింది. బాంబర్‌ను ముందుగా ద్వారాల వద్దే సెక్యూరిటీ అధికారులు నిలిపివేశారు. ప్రధాన మందిరంలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నారని అక్కడి అధికారులు చెబుతున్నారు. అదే సమయంలో ఆత్మాహుతి బాంబర్ తనను తాను పేల్చుకున్నాడని చెప్పారు. ఒకవేళ ప్రధా ప్రార్థనా స్థలంలో పేలు జరిగితే భారీ సంఖ్యలో భక్తులు మరణించేవారని చెబుతున్నారు. భక్తులు బయటకు వస్తున్న సమయంలో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. పేలుడు తీవ్రతతో ప్రార్థనా మందిరం ప్రవేశద్వారం పూర్తిగా ధ్వంసమవ్వగా, చుట్టుపక్కల భవనాల కిటికీలు పగిలిపోయాయి. రోడ్లపై శిథిలాలు చెల్లా చెదురుగా పడిపోయాయి.

ఇది బలోచిస్థాన్ లిబరేషనన ఆర్మీ (బిఎల్ఎ) పనిగా అనుమానిస్తున్నారు. దాడి నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో అత్యవసర పరిస్థితిని అధికారులు ప్రకటించారు.

గత మూడు నెలల్లో ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడులు జరగడం ఇది రెండోసారి. గతేడాది నవంబరులో ఇస్లామాబాద్ జిల్లా జ్యుడిషియల్ కాంప్లెక్స్ వద్ద జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించగా.. 27 మంది గాయపడ్డారు.

# కీలక వడ్డీరేట్లు యధాతథం



## - ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**ముంబయి, ఫిబ్రవరి 6:** కీలక వడ్డీరేట్లలో రిజర్వ్ బ్యాంక్ ఎలాంటి మార్పు చేయలేదు. మునుపటి వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన ద్రవ్య పరపతి విధాన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఆర్‌బిఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4 శాతం వృద్ధి నమోదవుతుందని ఆబిఐ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికంలో 6.9శాతం, రెండో త్రైమాసికంలో 7శాతం వృద్ధి నమోదవ్వొచ్చని సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉండొచ్చని తెలిపారు. అదేవిధంగా 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 4 శాతం, రెండో త్రైమాసికంలో 4.2 శాతం ద్రవ్యోల్బణం నమోదు కావచ్చని ఆర్బీఐ అంచనా వేసినట్లు వివరించారు.

**డిజిటల్ మోసాల్లో బాధితులకు రూ.25 వేల సాయం:** సైబర్ నేరాలు ఇటీవల పెరిగిపోతున్న క్రమంలో బాధితులకు అండగా నిలిచేందుకు ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం కీలక ప్రకటన చేశారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు బ్యాంకింగ్ కస్టమర్లకు పరిహారం అందేంచేలా ఆర్బీఐ కొత్త నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సైబర్ నేరాల బారిన పడ్డ బాధితులకు రూ.25 వేల వరకు పరిహారం అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. బ్యాంకింగ్ ఖాతాదారులు నష్టపోయిన సమయంలో కొంతమేర ఆర్థిక సాయం అందించేందుకు ఈ పరిహారం ఉపయోగపడుతుంది. డిజిటల్ చెల్లింపులపై వినియోగదారులకు భద్రత కల్పించడం, కస్టమర్ల ప్రయోజనాలను కాపాడటం, తక్షణ ఆర్థిక సాయం అందించే విధంగా ప్రతిపాదించినట్లు వివరించారు. త్వరలో దీనిపై మార్గదర్శకాలను రూపొందించి విడుదల చేస్తామన్నారు.

**ఖాతాదారుల భద్రతకు పెద్దపీట.. మూడు కీలక అంశాలపై కొత్త రూల్స్:** బ్యాంకు ఖాతాదారుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. చిన్న మొత్తంలో జరిగే మోసపూరిత లావాదేవీలకు పరిహారం, ఆర్థిక ఉత్పత్తుల మిస్‌సెల్లింగ్‌కు అడ్డుకట్ట, లోన్ రికవరీ ఏజెంట్లపై ఏకరీతి నిబంధనలు తీసుకు రానున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. ఈ మూడు కీలక అంశాలపై త్వరలోనే ముసాయిదా మార్గదర్శకాలను ప్రజాభిప్రాయ సేకరణ కోసం విడుదల చేయనున్నట్లు తెలిపారు. చిన్న విలువ గల మోసపూరిత లావాదేవీలు జరిగినప్పుడు వినియోగదారులకు పరిహారం అందించేందుకు కొత్త నిబంధనలను రూపొందిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ లావాదేవీలలో కస్టమర్ల బాధ్యతను పరిమితం చేస్తూ 2017లో మార్గదర్శకాలు జారీ చేశామని, అయితే అప్పటి నుంచి సాంకేతికతలో భారీ మార్పులు వచ్చిన నేపథ్యంలో వాటిని సమీక్షి స్తున్నామని వివరించారు. అలాగే బ్యాంకులు, నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బిఎఫ్‌సిలు) ఆర్థిక ఉత్పత్తులను, సేవలను తప్పుదోవ పట్టించేలా విక్రయించడాన్ని (మిస్‌సెల్లింగ్) అరికట్టేందుకు నిబంధనలను కఠినతరం చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల అవసరాలకు, వారి రిస్క్ సామర్థ్యానికి సరిపోని ఉత్పత్తులను విక్రయించడం వల్ల ఇరు వర్గాలకూ నష్టమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఉత్పత్తుల ప్రకటనలు, మార్కెటింగ్, విక్ర యాలపై సమగ్ర మార్గదర్శకాలను తీసుకు రానున్నారు. ఇక, లోన్ రికవరీకి సంబంధించి రికవరీ ఏజెంట్ల నియామకం, వారి ప్రవర్తనపై ప్రస్తుతం బ్యాంకులకు, ఎన్‌బిఎఫ్‌సిలకు వేర్వేరు నిబంధనలు అమలవుతున్నాయని గవర్నర్ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అన్ని నియంత్రిత సంస్థలకు ఒకే రకమైన, ఏకీకృత నిబంధనలను తీసుకురావాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ అంశంపైనా ముసాయిదా మార్గదర్శకాలను త్వరలో ప్రజాభిప్రాయ సేకరణకు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

**రూ.20 లక్షల వరకు పూచీకత్తు లేకుండా రుణం:** చిన్న వ్యాపారాలు చేసుకునేవారికి రిజర్వ్ బ్యాంక్ శుభవార్త అందించింది. వీరికి ఇప్పటివరకు పూచీకత్తు లేకుండా అందిస్తున్న బ్యాంకు రుణాల పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం నుంచి మొదలైన ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన సమావేశంలో ఈ ప్రకటన చేశారు. ఇప్పటివరకు మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ వ్యాపారాలకు రూ.10 లక్షల వరకు పూచీకత్తు లేని రుణం అందిస్తున్నారు. దీనిని ఇప్పుడు రూ.20 లక్షలకు పెంచుతూ ఆర్బీఐ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో చిన్న వ్యాపారులు చేసేవారికి ఎలాంటి హామీ లేకుండా రూ.20 లక్షల వరకు లోన్ పొందే అవకాశం లభించనుంది. కొత్తగా లోన్ తీసుకునేవారితో పాటు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకునేవారికి కూడా రూ.20 లక్షల వరకు పూచీకత్తు ఉండదు. 2026 ఏప్రిల్ 1 నుంచి ఈ నిర్ణయాన్ని అమలు చేయనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. చిన్న వ్యాపారాలు, స్టార్టప్స్ కంపెనీలకు ఈ నిర్ణయంతో ఎంతో ప్రయోజనం కలగనుంది.



# చర్చలు విఫలమైతే బలప్రయోగమే

## ఇరాన్‌కు అమెరికా హెచ్చరిక

**వాషింగ్టన్, ఫిబ్రవరి 6:** ఒమన్ వేదికగా ఇరాన్-అమెరికాల మధ్య అణుచర్చలు ప్రారంభం కానున్నాయి. ఈ చర్చల్లో ఇరు దేశాలు ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నాయా అని అంతా ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే బలప్రయోగానికి కూడా తమ దేశ అధ్యక్షుడు ట్రంప్ వెనుకాడబోరన్నారు. గురువారం (అమెరికా కాలమానం ప్రకారం) విలేకరులతో మాట్లాడుతూ లీవిట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒమన్ చర్చల్లో ఇరాన్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకోవడం కోసం ట్రంప్ ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. అణురహిత ఇరాన్ డిమాండ్‌కు తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఈ క్రమంలో దౌత్యం సాధ్యం కాకపోతే.. ట్రంప్‌నకు మరిన్ని ఎంపికలు ఉన్నాయని హెచ్చరించారు. చర్చల నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి ట్రంప్ గట్టి హెచ్చరికలు చేశారు 'ఖమేనీ కలత చెందక తప్పదు' అని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా.. రివల్యూషనరీ గార్డ్స్ స్థావరంలోని అండర్ గ్రౌండ్‌లో టెహ్రాన్ దీర్ఘశ్రేణి ఖోర్రామ్‌షహర్-4 క్షిపణులను మోహరించిందని స్థానిక మీడియా పేర్కొంది. అమెరికాకు చెందిన విమాన వాహక నౌకలు, యుద్ధనౌకలు, నిఘా విమానాలతోపాటు అనేకమంది అదనపు దళాలు ఈ ప్రాంతంలో ఇప్పటికే మొహరించిన సంగతి తెలిసిందే. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో వేలాది మంది ఆందోళనకారులు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనకారులకు ఏమైనా జరిగితే తాము జోక్యం చేసుకుంటామని టెహ్రాన్‌ను హెచ్చరించారు. ఈ క్రమంలో అమెరికా యుద్ధనౌకలను ఆ దేశం దిశగా పంపించడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఆ తర్వాత అణు చర్చలకు ఇరు దేశాలు అంగీకరించాయి. శుక్రవారం ఒమర్ వేదికగా ఇది జరగనున్నాయి. ఇందులో అణు చర్చలతోపాటు మరికొన్ని విషయాలపై కూడా సమాలోచనలు జరపాలని టెహ్రానన భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

### ఐటి జరిమానా రూ.1.5 కోట్లు చెల్లించాల్సిందేనంటూ తీర్పు

**చెన్నై, ఫిబ్రవరి 6:** ప్రముఖ తమిళ హీరో, టివికె అధినేత విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురైంది. ఆదాయపు పన్ను శాఖ విధించిన ట్యాక్స్ పెనాల్టీని రద్దు చేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. రూ.1.5 కోట్ల పెనాల్టీని చెల్లించాల్సిందేనని శుక్రవారం తీర్పు వెలువరించింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయ్ తన ఆదాయాన్ని ఉద్దేశపూర్వకంగా తక్కువగా చూపించారని ఆదాయపు పన్ను శాఖ ఆరోపించింది. అప్పట్లో విడుదలైన పులి సినిమాకు తీసుకున్న పారితోషికాన్ని తగ్గించి చూపారని పేర్కొంది.

ఆ సినిమాకు రూ.15 కోట్లు పారితోషికంగా విజయ్ అందుకున్నారని, అందులో రూ.5 కోట్లను నగదు రూపంలో తీసుకున్నారని అధికారులు తెలిపారు. ఈ మొత్తాన్ని లెక్కల్లో చూపకుండా ఆదాయపు పన్ను ఎగ్గొట్టారని ఆరోపించారు. శాఖాపరమైన దర్యాప్తులో ఈ విషయం తేలడంతో విజయ్‌కు ఆదాయపు పన్ను శాఖ రూ.1.5 కోట్ల పెనాల్టీ విధించింది. ఈ పెనాల్టీని రద్దు చేయాలంటూ విజయ్ మద్రాస్ హైకోర్టులో అప్పీల్ చేసుకున్నారు. దీనిపై సుదీర్ఘ విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు గత నెల 23న తీర్పు రిజర్వు చేసింది. శుక్రవారం తీర్పు వెలువరిస్తూ.. ఆదాయపు పన్ను శాఖ విధించిన రూ.1.5 కోట్ల పెనాల్టీని చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది.

## వెండికోసం వృద్ధురాలిని పడుకున్న మంచం సహా ఎత్తుకెళ్లిన దొంగలు

### రాజస్థాన్‌లో ఘటన!

**జైపూర్, ఫిబ్రవరి 6:** వెండి ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ, దొంగలు దారుణంగా ప్రవర్తిస్తున్నారు. రాజస్థాన్‌లోని భిల్వారా జిల్లాలో జరిగిన ఓ ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. సుమారు కిలోన్నర బరువున్న వెండి ఆభరణాల కోసం 90 ఏళ్ల వృద్ధురాలిని ఆమె పడుకున్న మంచంతో సహా ఎత్తుకెళ్లారు. ఈ షాకింగ్ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే భిల్వారా జిల్లా అర్వాడ్ ప్రాంతంలోని కోఠియా గ్రామంలో మాజీ సర్పంచ్ నత్తి దేవి మాలి ఇంట్లోకి రాత్రి సమయంలో దొంగలు చొరబడ్డారు. ముందుగా ఇంట్లోని వారిని గదుల్లో బంధించి బయట గడి య పెట్టారు. వరండాలో మం చంపై నిద్రిస్తున్న నత్తిదేవి అత్తగారైన 90 ఏళ్ల ఛోటీ దేవిని గమనించారు. ఆమె ఒంటిపై భారీగా వెండి ఆభరణాలు ఉండటంతో నోరు నొక్కి మంచంతో పాటు సమీపంలోని పొలంలోకి ఎత్తుకెళ్లారు.

## చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద తల్లీ బిడ్డల ఆత్మహత్యలపై వీడని మిస్టరీ

### విజయశాంతి రెడ్డి సహచర ఉద్యోగులు, కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఘట్‌కేసర్ మార్గంలో గత నెల 30వ తేదీన అర్థరాత్రి 12.40 గంటల సమయం లో బోడుప్పల్‌కు చెందిన విజయశాంతి రెడ్డి (38) ఆమె కుమార్తె చేతనా రెడ్డి (18), కుమారుడు విశాల్ రెడ్డి (16)లు గూడ్సు రైలు కిందపడి ఆత్మ హత్య చేసుకున్న ఘటనపై మిస్టరీ కొనసాగుతోంది. ఈ ఉదంతంపై అటు ఆమె భర్త సురేందర్ రెడ్డి సహా ఇతర కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి అనుమానాలు వ్యక్తం కాకపోవడం, అటు విజయశాంతి రెడ్డి పనిచేసే కార్యాలయంలోని సిబ్బంది సైతం నోరుమెదపక పోవడంతో దీనిపై ముందు కు సాగేందుకు పోలీసులకు క్లిష్టంగా మారింది. ఈ ఘటన జరిగిన రోజున దుబాయ్‌లో వున్న విజయశాంతి రెడ్డి భర్త సురేందర్ రెడ్డి మరుసటి రో జు హైదరాబాద్‌కు వచ్చి ముగ్గురి అంత్యక్రియలు నిర్వహించారు. రెండు రోజుల అనంతరం ఆయన పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. తమ కుటు ంబంలో ఎలాంటి గొడవలు లేవని, తన భార్య విజయశాంతి రెడ్డి చాలా ధైర్యవంతురాలని, ఇద్దరు పిల్లలంటే ఆమెకు ప్రాణమని, తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తనకు ఇప్పటికీ అర్థం కావడం లేదని సురేందర్ రెడ్డి చెప్పారు. మరోవైపు విజయశాంతి రెడ్డి సోద రుడు చిరంజీవి రెడ్డి కూడా ఇదే విధంగా వాంగ్మూలం ఇచ్చారు. అయితే చివరగా విజయశాంతి రెడ్డి తన సోదరుడితోనే ఫోన్‌లో మాట్లాడడంతో అ తనితో వున్న లావాదేవీల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. చిరంజీవి రెడ్డి బ్యాంకు స్టేట్ మెంట్లను, వ్యాపార లావాదేవీలను పోలీసులు పరిశీలిం చారు. ఆయన ఇంట్లో సోదాలు చేశారని తెలిసింది. ఇదే సమయంలో విజయ శాంతి రెడ్డి ఇంట్లోనూ పోలీసులు సోదాలు చేశారు. ఆమె బ్యాంకు లా వాదేవీలను పరిశ శీలించారు. పాస్ పుస్తకాన్ని, చెక్ పుస్తకాన్ని, ఇంకొన్ని వస్తువులను జప్తు చేశారు. విజయ శాంతి రెడ్డి దంపతుల మధ్య ఎలాంటి త గా దాలు లేవని స్థానికులు చెబుతున్నారు. వారుండే బోడుప్పల్‌లోని అపార్ట్‌మెంట్లో సహచరులు వారి గురించి సదాభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. వా రి సొంతవూరైన మోత్కూరులోనూ వీరికి మంచి పేరే వుందని పోలీసుల విచారణలో తేలింది. ఈ దంపతులకు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లే వని పోలీసుల విచారణలో నిర్ధారణ అయ్యింది. అటువంటి సమయంలో విజయశాంతి రెడ్డి తాను ఆత్మహత్య చేసుకోవడంతో పాటు తనతో పా టు ఇద్దరు పిల్లలను కూడా ఆత్మహత్యలకు పురిగొల్పడం పోలీసులకు అంతు చిక్కడం లేదు. మరోవైపు వీరిది హత్యగా జరుగుతున్న ప్రచారాన్ని పో లీసులు ఖండించారు. వీరిది ఆత్మహత్యేనని స్వయంగా గూడ్స్ రైలు డ్రైవర్ చెప్పడం ఇందుకు బలమైన సాక్ష్యంగా పోలీసులు నమోదు చేశారు. ఈ కేసులో విజయశాంతి రెడ్డి గత నెల 30వ తేదీన సాయంత్రం నుంచి అర్థరాత్రి వరకు ఎక్కడెక్కడ తిరిగింది...? ఆత్మహత్య చేసుకునే వరకు వున్న సిసి ఫుటేజిలను పోలీసులు స్వాధీనం చేసుకుని వాటిని పరిశీలిస్తున్నారు. ఈ కేసులో చర్లపల్లి రైల్వే స్టేషన్ అధికారులు, ఆర్‌పిఎఫ్ పోలీసుల వైఫల్య ంపైనా పోలీసులు విచారిస్తున్నారు.

## సంక్షిప్తంగా..

### నేపాల్‌లో బస్సులోయలో పడి 13 మంది మృతి

**ఖాట్మండ్, ఫిబ్రవరి 6:** నేపాల్ బైతాడి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. గురువారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో 13 మంది అక్కడికక్కడే మృతి చెందగా.. 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన ఉత్తరాఖండ్ సరిహద్దు సమీపంలో జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఎక్కువ మంది బజాంగ్ జిల్లాకు చెందిన వారని కఠ్మాండు పోలీసులు తెలిపారు. బస్సు కొండపై ప్రయాణిస్తున్న సమయంలో బ్రేక్ పైపు పగిలిపోవడంతో, డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సు లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### స్క్విడ్ గేమ్ చూసాడని మరణదండన



**ప్యాంగ్‌యాంగ్, ఫిబ్రవరి 6:** స్క్విడ్ గేమ్ వంటి దక్షిణ కొరియా టివి షోలను వీక్షించినా, కే-పాప్‌ను ఆలకించినా ఉత్తరకొరియా ప్రభుత్వం తన ప్రజలకు మరణశిక్ష విధిస్తున్నదని మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తాజాగా వెల్లడించింది. దక్షిన కొరియాకు చెందిన మీడియాను వినియోగించినా స్కూలు పిల్లలను సైతం ఉత్తర కొరియా ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తున్నదని ఆమ్నెస్టీ తెలిపింది. విదేశీ కంటెంట్ వాడకంపై యువజనులను హెచ్చరించడానికి బహిరంగ మరణశిక్షలను బలవంతంగా వారికి చూపిస్తున్నదని ఉత్తరకొరియా నుంచి తప్పించుకుని పారిపోయిన పౌరుల వాంగ్మూలాన్ని ఉటంకిస్తూ ఆమ్నెస్టీ వెల్లడించింది. ఆరోగ్యం, సామాజిక హోదాపై శిక్షలు ఆధారపడి ఉంటాయని, పేద ప్రజలు మరణం సహా కఠిన శిక్షలను ఎదుర్కోవలసి ఉంటుందని, పలుకుబడి ఉన్న కుటుంబాల వారు అధికారులకు లంచాలు ఇచ్చి మరణశిక్షలను తప్పించుకుంటారని హక్కుల సంస్థ వివరించింది.

### 'ఘుష్ఖోర్ పండిట్' సినిమా నిలిపేయండి: మాయావతి




**లక్నో, ఫిబ్రవరి 6:** 'ఘుష్ఖోర్ పండిట్ ' సినిమా ఉత్తరప్రదేశ్‌లో తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. ఈ సినిమాపై సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. సినిమా టైటిల్ కుల తత్వానికి సంబంధించినదిగా, అవమానకరమైందిగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే సినిమాపై నిషేధం విధించాలని డిమాండ్ పెరుగుతోంది. ఇక ఈ వ్యవహారంపై బిఎస్పీ అధినేత్రి మాయావతి స్పందించారు. ఘుష్ఖోర్ పండిట్ సినిమాను నెట్‌ఫ్లిక్స్‌లో నిలిపివేయాలని కేంద్రాన్ని మాయావతి కోరారు. సినిమాలో పండిట్ అనే పదాన్ని ప్రతికూలంగా ఉపయోగించడం వల్ల బ్రాహ్మణ సమాజంలో ఆగ్రహావేశాలు ఉన్నాయని తెలిపారు. మాయావతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా చిత్రం ద్వారా బ్రాహ్మణ సమాజాన్ని అగౌరవపరుస్తున్నారని తెలిపారు. సమాజంలోని పెద్ద వర్గం మనో భావాలను దెబ్బతీస్తున్నందున అటువంటి సినిమాను నిలిపివేయాలని కేంద్రాన్ని మాయావతి కోరారు.

### చైనా వెలుతున్న ఓడలో ఒడిశా నేవీ అధికారి మిస్సింగ్




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** మారిషస్ సమీపంలో ఓ నౌకలో విధుల్లో ఉన్న భారత్‌కు చెందిన మర్చంట్ నేవీ అధికారి అదృశ్యమయ్యారు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకోవాలని బాధితుడి కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆ అధికారిని ఒడిశాకు చెందిన సార్థక్ మహాపాత్రోగా గుర్తించారు. బాధితుడి కుటుంబ సభ్యులు పేర్కొన్న వివరాల ప్రకారం గతేడాది జులైలో ఒక ప్రైవేట్ షిప్పింగ్ కంపెనీలో సార్థక్ ఉద్యోగంలో చేరారు. అతడు ప్రయాణిస్తున్న నౌక సింగపూర్ నుంచి చైనాకు తిరిగివస్తోంది. ఫిబ్రవరి 2న తల్లిదండ్రులు, స్నేహితులతో అతడు వీడియో కాల్‌లో మాట్లాడాడు. తర్వాత రోజు అతడిని సంప్రదించేందుకు బాధితుడి తల్లి ప్రయత్నించగా సాధ్యపడలేదు. సార్థక్ కనిపించడంలేదని ఆ తర్వాత షిప్పింగ్ కంపెనీ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చింది. అతడి కోసం గాలింపు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించింది.

# మీకు ఏది కరెక్టయితే అదే చేయండి

## - ప్రధాని మోడీపై రాహుల్‌గాంధీ సెటైర్లు - ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోంది - ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యులను మాట్లాడనివ్వరు. కానీ, విపక్షాలపై ఆరోపణలు గుప్పి స్తారంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని మోడీ ప్రసంగంపై విపక్ష నేత విమర్శలు గుప్పించారు. జో ఉచిత్ సమో... వహీ కరో (మీరు సరైనది అనుకున్నది చేయండి) అంటూ వ్యంగ్యంగా విమర్శించారు. పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం ఉదయం చేపట్టిన నిరసనలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఉదయం పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన కొనసాగించారు. భారత్, అమెరికా డీల్‌ను ట్రాప్ డీల్‌గా వర్ణిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ సమయంలో వారితోపాటు రాహుల్ గాంధీ కూడా పాల్గొని నినాదాలు చేశారు. అప్పుడే మీడియాతో మాట్లాడుతూ, జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ విమర్శించారు. అదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మోడీ ప్రసంగం తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని, ప్రతిపక్షం లేవనెత్తిన కీలక అంశాలకు ప్రధాని సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ప్రధాని ప్రసంగ సమయంలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ వాకౌట్ చేసిన విషయం తెలిసిందే. జాతీయ భద్రత, చైనా అంశాలపై తమ ఆందోళనలకు సరైన సమాధానం రాలేదనే కారణంతో సభను బహిష్కరించామని ఖర్గే తెలిపారు. ప్రధాని ప్రసంగంలో పనికొచ్చే అంశం ఒక్కటీ లేదని విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీలో, కాంగ్రెస్ పార్టీలో సిక్కుమతంపై ద్వేషం ఉందని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే తీవ్రంగా స్పందించారు. ప్రధానమంత్రి వ్యాఖ్యలను ఆయన ఖండించారు.



## క్షయ వ్యాధిని గుర్తించేలా ఎఐ స్టెతస్కోప్‌లు

### రూపొందించిన జర్మనీ వైద్య బృందం

### వైద్య రంగంలో సరికొత్త ఆవిష్కరణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** ప్రపంచవ్యాప్తంగా మరణాలకు అత్యంత ప్రాణాంతకమైన క్షయవ్యాధి (టిబి) కొనసాగుతున్నందున, కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత డిజిటల్ స్టెతస్కోప్‌లు క్లిష్టమైన స్క్రీనింగ్ అంతరాలను పూరించడంలో సహాయపడతాయని ఒక కొత్త అధ్యయనం చూపించింది, ముఖ్యంగా చేరుకోవడానికి కష్టతరమైన మారుమూల ప్రాంతాల్లో టిబి స్క్రీనింగ్‌లో ఉన్న లోపాలను ఈ టెక్నాలజీతో అధిగమించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జర్నల్ మెడ్ (సెల్ ప్రెస్)లో ప్రచురించబడిన కథనం ప్రకారం... డిజిటల్ టెక్నాలజీ, ఎఐతో కలిపి స్టెతస్కోప్‌లు స్క్రీనింగ్ కార్యక్రమాలలో ఎదురయ్యే సవాళ్లైన అండర్‌డిటెక్షన్, అధిక ధర, అసమాన యాక్సెస్ వంటి వాటికి వ్యతిరేకంగా మెరుగైన ఎంపికగా ఉండవచ్చని ప్రపంచ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎఐ ఆధారిత డిజిటల్ స్టెతస్కోప్‌లు ఊపిరితిత్తుల, హృదయ సంబంధ అసాధారణతలను గుర్తించడానికి ఆశాజనకమైన ఖచ్చితత్వం, సాధ్యతను ప్రదర్శించాయి, తొలి అధ్యయనాలలో ఆశాజనకమైన ఫలితాలు వచ్చాయి. ఈ సాధనం సామర్థ్యాన్ని మరింత అన్వేషించడానికి విభిన్నమైన, అధికభారం ఉన్న సెట్టింగ్‌లలో శిక్షణ, ధ్రువీకరణ చాలా అవసరం" అని కెనడాలోని మెక్‌గిల్ విశ్వవిద్యాలయ పరిశోధకుడు మధుకర్ పాయ్ బృందం పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) నివేదిక ప్రకారం, ప్రస్తుత స్క్రీనింగ్ విధానాల ద్వారా ఏటా సుమారు 27 లక్షల టీబీ కేసులను గుర్తించలేకపోతున్నారు. లక్షణాలు లేని వారిని గుర్తించడం, ఎక్స్‌రే వంటి పరీక్షల అధిక ఖర్చు, రేడియేషన్ భయాలు వంటివి ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ సవాళ్లకు ఏఐ ఆధా రిత డిజిటల్ స్టెతస్కోప్‌లు సరైన పరిష్కారం చూపగలవని మెడ్ (సెల్ ప్రెస్) జర్నల్‌లో ప్రచురితమైన కథనంలో అంతర్జా తీయ నిపు ణులు పేర్కొన్నారు కెనడాలోని మెక్‌గిల్ యూని వర్సిటీ పరిశోధకుడు మధుకర్ పాయ్ నేతృత్వం లోని బృందం ఈ అధ్యయనం చేసింది.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# తెలంగాణను విమర్శించిన పవన్‌తో బిజెపికి పొత్తు ఎలా?

### రవాణా శాఖ మంత్రి పొన్నం విమర్శ

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** తెలంగాణ ద్రోహి పవణ్ కల్యాణ్ అని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణపై విమర్శలు చేసిన ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో భారతీయ జనతా పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ఎలా పొత్తు పెట్టుకుందో చెప్పాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాఖ్య విధా నంలో ప్రజాస్వామిక భారతదేశంలో ఎవరు ఎక్కడికైనా వెళ్లి, రాజకీయాల్లో ఉండొచ్చన్నారు. తెలంగాణ పట్ల పూర్తిగా చులకన భావంతో మాట్లాడి, తెలంగాణ ఏర్పాటును వేర్పాటు వాదంగా చూపెట్టినటువంటి వ్యక్తి పవన్‌కల్యాణ్ అన్నారు. కోనసీమలో కొబ్బరిచెట్లు ఎండిపోతే తెలంగాణ వాళ్ల కళ్ల దిష్టితో ఎండి పోయాయన్న వ్యక్తి పవన్‌కల్యాణ్ తెలంగాణలో అభ్యర్థులను పెడుతూ బిజెపితో పొత్తుగా ఎన్నికల ప్రచారం కొనసాగిస్తాడంటే అది పూర్తిగా తెలంగాణ ప్రజలను అవమానపరచడమేనన్నారు. పవన్‌కల్యాణ్ కొండగట్టుకు రావచ్చు, పోవచ్చుని, దానికి ఎవరికి ఏమి అభ్యంతరం లేదన్నారు.

# జిఓ 25ను సవరించాలి

### ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాక రేషనలైజేషన్ చేపట్టాలి

### పాఠశాల విద్య డైరెక్టర్‌కు టిఆర్‌టిఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** జీవో 25ను సవరించిన తరువాతనే ఉపాధ్యాయుల రేషనలైజేషన్‌ను చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టిఆర్‌టిఎఫ్)డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి శుక్రవారం పాఠశాల విద్య డైరెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల రేషనలైజేషన్, పోస్టుల రద్దుపై వివిధ పత్రికల్లో వస్తున్న వార్తల నేపథ్యంలో వారు టీచర్ల రేషనలైజేషన్‌పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. వివిధ పత్రికల్లో వస్తున్న వార్తల ప్రకారం సుమారు 2,325 ఎస్‌జిటి పోస్టులను రద్దు చేసే ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ప్రస్తుత అవసరాలకు విరుద్ధంగా ఉన్న జీవో 25ను సవరించాలని వారు డిమాండ్ చేశారు. విద్యాశాఖ తక్షణమే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, ఆ తర్వాతే రేషనలైజేషన్ ప్రక్రియపై ముందడుగు వేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే ప్రాథమిక స్థాయిలో 1:20 టీచర్, స్టూడెంట్స్ నిష్పత్తిని అమలు చేస్తూ, ప్రతి పాఠశాలకు ఖచ్చితంగా ఒక పీఎస్ హెచ్‌ఎం పోస్టును మంజూరు చేయాలన్నారు. కేవలం విద్యార్థుల సంఖ్యనే ప్రాతిపదికగా తీసుకోకుండా, ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున కనీసం ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. హైస్కూళ్లల్లో అదనపు సెక్షన్లు పెరిగినప్పుడు అన్ని సబ్జెక్టుల ఉపాధ్యా యులను ఒకేసారి కేటాయించాలని, జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలను మూసివేయకుండా అవసరమున్న ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వివిధ పత్రికల్లో వస్తున్న వార్తల ద్వారా తెలుస్తున్న ప్రభుత్వ ప్రతిపాదనలపై విద్యాశాఖ స్పష్టతనిస్తూ, ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని వారు డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

### 'లీవ్ ఇన్ ఏ హెల్త్ స్పేస్' డిజైన్ కాంపిటీషన్-2026లో

# ప్రపంచ ఛాంపియన్‌గా శ్రీచైతన్య స్కూల్

**హైదరాబాద్,ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** ప్రపంచవ్యాప్తంగా 12 నుండి 18 సంవత్సరాల వయస్సు గల విద్యార్థుల కోసం నాసా నేషనల్ స్పేస్ సొసైటీ 'లీవ్ ఇన్ ఏ హెల్ప్ స్పేస్' పోటీని నిర్వహించింది. అంతరిక్ష నివాసాల్లోని ఒక నిర్దిష్ట భాగం అగ్రికల్చరల్ మాడ్యూల్ (వ్యవసాయ విభాగం) రూపకల్పన చేయడం ఈ పోటీ లక్ష్యం.ఈ పోటీ ఫలితాలను ఎన్.ఎస్.ఎస్ ప్రకటించగా ప్రపంచవ్యాప్తంగా ప్రకటించిన మొత్తం 85 ప్రైజులలో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు 7 ప్రపంచ ప్రథమ బహుమతులతో సహా మొత్తం 34(40శాతం) ప్రైజులను కైవసం చేసుకున్నారు. ఇటీవల జరిగిన నాసా ఎన్.ఎస్.ఎస్ 'రోడ్ మ్యాప్ టు స్పేస్ కాం టెస్ట్'లో కూడా ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 10 విన్నింగ్ ప్రాజెక్టులలో 8(80శాతం) శ్రీచైతన్య స్కూల్ దక్కించుకుని ప్రపంచస్థాయిలో క్లీన్ స్వీప్ చేసిందని సీమ పేర్కొన్నారు. ఇండివిడ్యుయల్ కేటగిరీ ప్రైజులలో, మొత్తం ప్రైజుల సంఖ్యలో ప్రపంచంలో, భారతదేశంలో మరే ఇతర పాఠశాల, విద్యా సంస్థ శ్రీచైతన్య సాధించిన ఇటువంటి ఫలితాలను సాధించలేదని ఆమె అన్నారు. గత 14 ఏళ్లుగా ఈ పోటీల్లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలుస్తున్న ఏకైక విద్యా సంస్థ శ్రీచైతన్య అని ఆమె పేర్కొన్నారు. పాతకాలపు బట్టి పట్టే పద్ధతిని పక్కన పెట్టి, శ్రీచైతన్య అనుసరిస్తున్న కాన్సెప్చువల్ టీచింగ్ మెథడాలజీ, యాక్టివిటీ, ప్రాక్టికల్ ఆధారిత బోధనే నాసా ఎన్.ఎస్.ఎన్ "లీవ్ ఇన్ ఏ హెల్త్ స్పేస్" డిజైన్ కాంపిటీషన్‌లో ఈ అద్భుత విజయానికి ప్రధాన కారణమని డైరెక్టర్ సీమ అన్నారు. ఈ సందర్భంగా బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ఆమె అభినందించారు.కేవలం ఐఐటి, జెఈఈ, నీట్ మాత్రమే కాదు, ఏ పోటీ, ఏ పరీక్షలోనైనా నంబర్ 1 స్థానం ఒక్క శ్రీచైతన్యకి దక్కుతుందని మరోసారి నిరూపితమైంది.

# ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

### నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

### బిసి గురుకుల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ మీటింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీసీ సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉపాధ్యాయులకు బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. గత ఏడాది తక్కువ ఫలితాలు సాధించిన పాఠశాలలు ఈసారి మెరుగైన ఫలితాలు సాధించాలని, విద్యార్థుల పరీక్షలు, ఫలి తాలు విషయంలో నిరక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరిం చారు. ఇంటర్‌తోపాటు 10వ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తుండడంతో మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాల పాఠశాలలపై ప్రిన్సిపల్స్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం జూమ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ సెక్రటరీ శ్రీధర్, గురు కులాల సెక్రటరీ సైదులు, గురుకులాల ప్రిన్సిపాల్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 294 బీసీ గురుకుల పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షలు రాయనున్న 19255 మంది విద్యార్థులు.. 261 గురుకుల కళాశాలల నుండి 26812 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక గ్రూప్‌లుగా విభజించి వారికి స్పెషల్ క్లాసులు ఏర్పాటు చేసి స్టడీ అవర్స్ నిర్వహించాలని మంత్రి సూచించారు. వెనుకబడిన విద్యార్థుల ఏకాగ్రత లోపానికి కారణాలు గుర్తించి వారు ఇతర విద్యార్థులతో పోటీ పడేలా చేయాలన్నారు. పరీక్షల సమయంలో ఓవర్ టైమ్ స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు వారి డౌట్స్ క్లారిఫై చేయాలన్నారు. గత విద్యా సంవత్సరంలో బీసీ గురుకుల పాఠశాలల నుండి ఎస్ఎస్‌సి బోర్డు పరీక్షలకు 17431 మంది విద్యార్థులు హాజరు కాగా.. 17046 మంది ఉత్తీర్ణులయ్యారని, 147 పాఠశాలలు 100 శాతం ఫలితాలను సాధించాయని మంత్రి గుర్తు చేశారు. అలాగే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బోర్డు పరీక్షలకు 12612 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 10489 మంది ఉత్తీర్ణులయ్యారని .. 11 జూనియర్ కళాశాలలు 100 శాతం ఫలితాలను సాధించాయని తెలిపారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 12813 మంది విద్యార్థులు హాజరు కాగా, 10014 మంది ఉత్తీర్ణులయ్యారని 3 జూనియర్ కళాశాలలు 100 శాతం ఫలితాలను సాధించాయన్నారు. ఎస్ఎస్‌సి పరీక్షలు మార్చి 14 నుండి ఏప్రిల్ 16, వరకు జరగనున్నాయని, ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఇప్పటికే ప్రారంభమ య్యాయన్నారు. వారికి థియరీ పరీక్షలు ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు జరుగుతాయన్నారు. బీసీ గురుకులాల్లో 10వ తరగతిలో 3142 మంది విద్యార్థులు, ఇంటర్‌లో 2021 మంది విద్యార్థులు నెమ్మదిగా నేర్చుకునే వారిగా గుర్తించబడ్డారని... వారి కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ తీసుకొని వారు ఇతర విద్యార్థులతో పోటీ పడేలా చేయాలన్నారు. గురుకులాల్లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను స్టాఫ్ నర్సు ప్రతిరోజూ పర్యవేక్షించాలని, వైద్య, ఆరోగ్య అధికారుల ద్వారా ప్రతి 15 రోజులకు ఒకసారి చెకప్‌లు నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని తగ్గించడానికి ఉపాధ్యా యులు, ప్రిన్సిపాల్‌లు, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లతో మోటివేషన్ తరగతులు నిర్వహించాలన్నారు. బోర్డు పరీక్షల వరకు పాఠశాలలు, హాస్టళ్లలో ప్రత్యేక నాణ్యమైన ఆహారం అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అధ్యయన సమయాల్లో అదనపు శ్రద్ధ తీసుకొని.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల్లో బీసీ గురుకులాల్లు ప్రథమ స్థానంలో ఉండేలా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

# సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

### కేంద్ర విద్యామంత్రికి ఆలిండియా జాక్టో విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అంశంపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (ఎఐ జాక్టో) డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రికి ఆలిండియా జాక్టో నేతలు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. విద్యాహక్కు చట్టం అమలుకు పూర్వం నియామ కమైన ఉపాధ్యాయులంతా రెండేళ్ళలో ఉపాధ్యా య అర్హత పరీక్ష పాస్ కావాలని లేదంటే ఉద్యోగాల నుండి తొలగించాలని సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వలన దేశవ్యాప్తంగా 30 లక్షల మంది ఉపాధ్యాయులు ప్రభావితం అవుతున్నారని జాక్టో నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం సత్వరమే జోక్యం చేసుకుని, అవసరమైతే చట్ట సవరణ ద్వారా అయినా సీనియర్ ఉపాధ్యాయుల ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. టెట్ సిలబస్, అర్హత మార్కుల విషయంలో సడలింపు ఇవ్వాలని ఎఐ జాక్టో ప్రతినిధులు కేంద్ర విద్యాశాఖ మంత్రిని కోరారు. రాజ్యసభ సభ్యులు వి శివదాసన్ నేతృత్వంలో ఎఐ జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యులు సిఎన్ భార్తి, చావ రవి, కత్తి నరసింహారెడ్డి, బసవరాజ్ గురికార్, కమలాకాంత త్రిపాఠి శుక్రవారం పార్లమెంటులో విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లా డుతూ..సుప్రీంకోర్టు రెండు, మూడు సందర్భాల్లో ఉపాధ్యాయులు అందరూ టెట్ పాస్ కావాలని తీర్పు ఇచ్చిందని దానిని ఎలా అధిగమించాలో న్యాయ నిపుణులతో ఆలోచన చేస్తున్నా మని అన్నారు. ఇప్పటికే ఆరు నెలలు గడిచాయని ఉపాధ్యాయులంతా మాన సికంగా ఆందోళనలో ఉన్నారని, గురువారం దేశం నలుమూలల నుండి వచ్చిన వేలాది మంది ఉపాధ్యాయులు జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారని జాప్యం లేకుండా నిర్ణయం తీసుకుని ఉపాధ్యాయులకు ఊరట కలిగించాలని జాక్టో ప్రతినిదులు కోరగా.. పరిశీలిస్తామని అన్నారే తప్ప, సమస్య పరిష్కారానికి నిర్దిష్టమైన హామీని ఇవ్వలేదని జాక్టో నేతలు తెలిపారు.

సిపిఎస్ రద్దు, ప్రాథమిక ఉపాధ్యాయులకు ఓటు హక్కు, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు, జాతీయ విద్యా విధానంలో ప్రభుత్వ విద్యకు నష్టం కలిగించే అంశాల రద్దు వంటి సమస్యలను ప్రస్తావించగా అవన్నీ ప్రభుత్వ విధానపరమైన అంశా లంటూ దాటవేయడం పట్ల జాక్టో వేదిక నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ ప్రతిపక్ష నాయ కులు మల్లికార్జున ఖర్గేను కలిసి టెట్ సమస్యను వివరించి పరిష్కారానికి కృషి చేయాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారని ఎఐ జాక్టో నాయకులు తెలిపారు.

# పార్లమెంటులో బిసి బిల్లు ప్రవేశపెట్టాలి

### బాలగోని బాలరాజ్‌గౌడ్, రిటైర్డు ఐఎఎస్ చిరంజీవులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** నేడు జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 31 రిజర్వేషన్లు ఇచ్చి చేతులు దులుపుకుంటే చూస్తూ ఉండలా? మెజా రిటీ బీసీలకు 30 శాతం ఇచ్చి 10 శాతం ఉన్న ఓసిలకు 60 శాతం రిజర్వేషన్ అమలు చేస్తారా? ఇది ముమ్మాటికి బీసీలను రాజకీయంగా అడ్డుకోవడమేఅని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డు ఐఎఎస్ చిరంజీవులు ధ్వజమెత్తాయి. శుక్రవారం మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడుతూ బిసిలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు.పార్లమెంట్ సమావేశాలలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఒక్కరోజైనా బిసిల గురించి మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. పార్ల మెంట్‌లో రాజ్యంగా సవరణ ద్వారా 9 షెడ్యూల్ ప్రకారం బీసీ బిల్లు పెట్టాల్సిన అవసరం ఉండగా కనీసం ప్రైవేట్ బిల్లు కూడా పెట్టకుండా పోవడం వారి చిత్త శుద్ధి ఏంటో తెలుస్తుందన్నారు. తక్షణం పార్లమెంట్ సమావేశంలో బీసీ బిల్లు పెట్టాలని లేని పక్షంలో బీసీలు అంత ఆయా పార్టీలకు రాజకీయంగా ఓటుతో తగినబుద్ధి చెప్తామని అన్నారు. దేశంలో ఉన్న 70 కోట్ల బిసిప్రజల సమ స్యలు పార్లమెంట్‌లో ప్రస్తావించకపోవడం, బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ కూడా లేకపోవడం 78 సంవత్స రాల పాలకుల వివక్షకు నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ వైస్ చైర్మన్ దుర్గయ్యగౌడ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్లు యెలికట్టె విజయ్ కుమార్‌గౌడ్, ఆయి లి వెంకన్నగౌడ్, బైరు శేఖర్ గంగపుత్ర, అంబాల నారాయణగౌడ్, సింగం నాగేష్ గౌడ్, నాగభూషణం, లింగేష్ యాదవ్, విద్యార్థి నాయకుడు రమేష్ యాదవ్, చెన్న శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న రిటైర్డు ఐఎఎస్ చిరంజీవులు, చిత్రంలో బాలగోని బాలరాజ్‌గౌడ్

# బోరబండలో మూడున్నర ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన హైడ్రా

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** బోరబండ విజేత థియేటర్ ఎదురుగా సారథి కోఆపరేటివ్ సొసైటీలో ఎన్నో సంవత్స రాలుగా వివాదంలో ఉన్న దాదాపు మూడున్నర ఎకరాల స్థలాన్ని హైడ్రా అధికారులు ఎట్టకేలకు స్వాధీనం చేసుకుని చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. ఇటీవల కొందరు నకిలీ జీవోతో పాటు నకిలీ యూఎల్‌సీ ఉన్నట్లు పత్రాలు సృష్టించి కోర్టును కూడా తప్పుదోవ పట్టించి కబ్జాకు యత్నించారు. ఆ స్థలాన్ని కూడా నేడు పెద్దఎత్తున పోలీస్ బలగాల సాయంతో మొత్తం స్థలాన్ని హైడ్రా ఆదీనంలోకి తీసుకుంది. ప్రభుత్వ స్థలాలను ఎప్పటికప్పుడు కాపాడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా ఇన్స్‌పెక్టర్ నరసింహారావు ఆధ్వర్యంలో ఆక్రమణలకు గురైన స్థలాన్ని స్వాధీన పర్చుకున్నారు. ఖైరతాబాద్ మండలం యూసుఫ్‌గూడ గ్రామం లోని సర్వే నంబర్ 128బై1లోని మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమి దాదాపు వంద కోట్ల వరకు ఉంటుందని దీనిని హైడ్రా కాపాడటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల యూఎల్‌సీ ల్యాండ్ ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చినట్లు తప్పుడు పత్రాలతో 3600 గజాల స్థలాన్ని కొట్టేయాలని ప్రయత్నించిన షరీఫ్‌ఖాన్ మీద బోరబండ పోలీస్ స్టేషన్‌లో హైడ్రా కేసు కూడా పెట్టింది. ఈ భూమితో పాటు 3.20 ఎకరాల భూమిలో ఇసుక వ్యాపారాలు, ఇటుక వ్యాపారాలతో పాటు వెలసిన తాత్కాలిక షెడ్‌లను కూడా తొలగించి హైడ్రా ఫెన్సింగ్ వేయడంతో పాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించండి

### పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వండి

### ప్రభుత్వానికి సర్పంచుల సంఘం జెఎసి వినతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు విడుద లైన నిధుల నుండి మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులను చెల్లించే విధంగా కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వాలని ప్రభు త్వాన్ని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ మేరకు శుక్రవారం ప్రజావాణి కార్య క్రమంలో కమిషనర్ దివ్యవాణికి పెండింగ్ బి ల్లుల చెల్లించాలని కోరుతూ జేఏసీ రాష్ట్ర అధ్య క్షుడు సుర్వి యాదయ్యగౌడ్ వినతి పత్రం అంద జేశారు. మాజీ సర్పంచులు 2019 నుంచి 2024 వరకు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ గ్రామా ల్లో అభివృద్ధి పనులు చేశారని పేర్కొన్నారు. బిల్లులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండడంతో అనేకమంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నా రని, చాలా మంది మాజీ సర్పంచుల ఆర్థిక ఇబ్బం దులతో సతమతమవు తున్నారని వినతిపత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ కాలం పూర్తయి రెండేళ్లు గడిచిపోతున్నా తెచ్చిన వడ్డీకివడ్డీలు పెరిగి పోతున్నాయని విన్నవించారు. ఈ నేపథ్యంలో మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించే విధంగా పంచాయతీ సెక్రటరీలను ఆదేశిస్తూ జీవో విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధు సూదన్‌రెడ్డి, కేశబో యిన మల్లయ్య యాదవ్, సముద్రాల రమేష్, బోట్ల రవి తదితరులు పాల్గొన్నారు.




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కరుణాకర్, కళ్యాణ్, లలిత్‌కుమార్ తదితరులు

# తిరుమల లడ్డూ విషయంలో ప్రతి హిందువు స్పందించాలి

### శివశక్తి, హిందూ జనశక్తి డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త:** తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం కోట్లాది హిందువుల విశ్వాసానికి ప్రతీక అని తిరుపతి లడ్డూ కల్తీ ఘటనపై ప్రతి ఒక్క హిందువు స్పందించాల్సిన అవసరం ఉందని శివశక్తి ప్రెసిడెంట్ కరుణాకర్ సుగ్గున, ప్రధాన కార్యదర్శి కళ్యాణ్‌కుమార్, హిందూ జనశక్తి ప్రెసిడెంట్ లలిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడు తూ పవిత్ర తిరుమల దేవాలయానికి జరిగిన అపవిత్రతపై సమాజం మొత్తం ఒకటిగా స్పందించాల్సిన సమయంలో మౌనం పాటించడం దురదృష్టకరమన్నారు. ఇలాగే చూస్తూ ఊరుకుంటే రేపటి ప్రభుత్వాలు హిందూ దేవాలయా లను దోచుకున్నా, ధ్వంసం చేసినా ఎవరు ఏమి అనరనే ధైర్యం కలుగు తుంది అనే ఆందోళన వ్యక్తం చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వం తితిదే లడ్డూ టెండర్‌లలో సవరణలు చేసి, హవాలా ద్వారా వేంకటేశ్వరస్వామి సొమ్మును దోచుకోవడం, కమిషన్ల కోసం స్వంత కంపెనీలకు టెండర్లు కేటాయించడం, చుక్క పాలు లేకుండా ప్రమాదకరమైన రసాయనాలతో నెయ్యి తయారు చేసి లక్షలాది మంది భక్తులు తినే లడ్డూల్లో కలపడం వంటి చర్యలు చట్టపరంగా ఎంత పెద్ద నేరమో అంతకన్నా మహాపాపం కూడా అని ఇలాంటి నీచమైన పనులు చేసిన వ్యక్తులను, వారికి మద్దతుగా నిలిచే నాయకులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తిరుమల ఆలయ పవిత్రతను కాపాడటం ప్రతి భక్తుడి బాధ్యత అని భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కన్వీనర్లు వెంకటేశం, అమానుల్లాఖాన్ తదితరులు

### డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల కోసం

# 12న 'రాష్ట్రవ్యాప్త బంద్'

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న ఆటో, క్యాబ్, ట్యాక్సీ, లారీ డ్రైవర్లు 'రాష్ట్ర వ్యాప్త బంద్'ను నిర్వ హిస్తు న్నారని ఆ సంఘాల జెఎసి ప్రకటించింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, ట్యాక్సీ, లారీ డ్రైవర్ల సంఘాల జెఎసి కన్వీనర్లు ఈ రాష్ట్ర వ్యాప్త బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జెఎసి కన్వీనర్లు బి.వెంకటేశం, అమానుల్లాఖాన్, వేముల మారయ్య తదితరులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేశాయని, లక్షలాది మంది కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం 4 కోడ్‌లుగా మార్చి తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. 12వ తేదీన ఇందిరాపార్కు వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు వేలాది మంది కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, గ్రేటర్ హైదరాబాద్‌లో అక్రమంగా నడుస్తున్న ఇతర జిల్లాల ఆటోలను వెంటనే నిషేదించాలని, ఓలా, ఉబర్, రాపిడో ద్వారా అక్రమంగా నడుస్తున్న టూ వీలర్లను నిషేధించాలని వారు డిమాండ్ చేశారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 406

**హైదరాబాద్ (బేగంపేట) ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 406 దరఖాస్తులు అందాయి. వాటిలో పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి శాఖకు సంబంధించి 38 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 147 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 1 దరఖాస్తు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 85 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ డా.జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమ స్యలు విని సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమ స్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఎసిపి ఉమేందర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వాట్సాప్ 'మీసేవ'లో 3.25 లక్షల మంది

### పదికిపైగా ప్రభుత్వ శాఖల నుంచి అందుతున్న 581 సేవలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 6:** తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ మీసేవ విధానం ద్వారా ఇప్పటివరకు 3.25 లక్షల మంది డిజిటల్ సేవలు అందుకున్నారు. 4.5 లక్షల మంది వివిధ పౌర సేవలకు వాట్సాప్ మీసేవలో నమోదు చేసుకోగా.. వీరిలో 3.25 లక్షల మంది సేవలను పొందారు.

మీ సేవా కేంద్రాల ఎదుట క్యూ కట్టే పనిలేకుండా ప్రజా ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వాట్సాప్ మీసేవ విధానం తక్కువ కాలంలోనే రాష్ట్ర ప్రజలకు చేరువైంది. రాష్ట్రవ్యాప్తంగా వాట్సాప్ మీసేవా 8096958096 అనే వాట్సాప్ నంబర్ ద్వారా నిర్విరామంగా 24 గంటల పాటు పౌర సేవలు పొందేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది.

వాట్సాప్ మీసేవ నుంచి మొత్తం పదికి పైగా ప్రభుత్వ శాఖలకు చెందిన 581 వివిధ రకాల సేవలు రాష్ట్ర ప్రజలు పొందే అవకాశం కల్పించింది.ప్రధానంగా కాస్ట్, ఇన్కమ్ సర్టిఫికెట్లు పొందటం చాలా సులువైంది. ఎక్కువ మంది ఆదాయ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్, రెసిడెన్సీ సర్టిఫికెట్, పోలీస్ చలాన్, రెన్యువల్ ఆఫ్ రేషన్ షాప్స్, టెంపుల్ సర్వీసెస్, బిల్డింగ్ పర్మిషన్, వెహికిల్ లైఫ్ ట్యాక్స్, లైసెన్స్, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు వాట్సాప్‌లోనే పొందొచ్చు. మీసేవ సర్టిఫికెట్ల స్టేటస్, తాజా అప్ డేట్స్ కూడా వాట్సాప్లోనే తెలుసుకోవటం, ఆమోదం పొందిన సర్టిఫికెట్లు డౌన్లోడ్ చేసుకునే అవకాశం ఉండటంతో పదే పదే మీసేవ కేంద్రాలకు వెళ్లే శ్రమ తగ్గింది.

2025 నవంబర్ 18న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఈ వాట్సాప్ మీసేవ సర్వీసును ప్రారంభించారు. వాట్సాప్ సేవలతో ఆశించిన మేరకు పౌర సేవలు వేగం పుంజుకోవటంతో పాటు దరఖాస్తుదారులకు ప్రభుత్వం మరింత చేరువైంది.

దరఖాస్తుదారులు ప్రశ్నలు అడగడానికి, సేవలకు దరఖాస్తు చేసుకోవడానికి, చెల్లింపులు చేయడానికి లేదా వారి దరఖాస్తుల స్థితిని తనిఖీ చేయడానికి సందేశం పంపి... సంబంధిత సేవను నేరుగా పొందవచ్చు.ఈ సంభాషణ దరఖాస్తుదారుడికి సాంకేతిక ఇబ్బందులను తొలగిస్తుంది. డిజిటల్ టెక్నాలజీపై అవగాహన లేని దరఖాస్తుదారులకు కూడా ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది ఈ విధానం.వాట్సాప్ మీసేవ ద్వారా రాష్ట్రంలో 31 దేవాలయాలకు సంబంధించిన సేవలను అందజేస్తుంది. భక్తులు దర్శనం, వసతి తదితర సేవలు ఇందులోనే బుక్ చేసుకోవచ్చు. రానున్న రోజుల్లో అత్యవసర సేవలకురానున్న రోజుల్లో ఎమర్జెన్సీ సేవలను కూడా వాట్సాప్ మీసేవ ద్వారా అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

108,102, అగ్నిమాపక సేవలకు 101, ఎస్పీజీ గ్యాస్ సిలిండర్ బుకింగ్, ముఖ్యమైన హెల్ప్ లైన్ నెంబర్లన్నీ దీనికి లింక్ చేస్తారు. వాట్సాప్ మీసేవతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకు పైగా మీసేవా కేంద్రాలు ప్రతిరోజూ 80 వేల మంది నుంచి లక్ష మందికి డిజిటల్ పౌర సేవలు అందిస్తున్నాయి.

2023 నవంబర్1 నుంచి 2026 జనవరి 31 వరకు, మీసేవ ద్వారా 5.98 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.3,811 కోట్లు.మీ సేవ కేంద్రాలు, వాట్సాప్ మీసేవా విధానం ద్వారా అనవసరమైన మధ్యవర్తుల పాత్ర తొలిగిపోయి. ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరిగే పని తగ్గింది.సేవల్లో పారదర్శకత మెరుగుపడింది. పౌర సేవల పరిష్కారం వేగవంతమైంది.

# ఇద్దరు నకిలీ వైద్యులు అరెస్టు

## ఎంబిబిఎస్ అవతారమెత్తిన నర్సు, ల్యాబ్ టెక్నీషియన్

### పోలీసులు, వైద్య శాఖ సంయుక్త దాడులతో వెలుగులోకి

**హైదరాబాద్ (అల్వాల్), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** ఒకరు నర్సు, మరొకరు ల్యాబ్ టెక్నీషియన్ కాని ఎంబిబిఎస్ డాక్టర్లుగా అవతారం ఎత్తి సంవత్సరాలుగా వైద్యం చేస్తున్నారు. అలోపతి మందులను ఇష్టా రోగులు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఇరువురు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. ఇద్దరిపై కేసు నమోదు చేయడంతో పాటుగా భారీ మొత్తంలో మందులను, వైద్య పరికరాలు ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. అల్వాల్ లో శుక్రవారం నకిలీ వైద్యులు బాగోతం బయట పడింది. సంఘటనకు సంబంధించి పోలీసులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ కానాజీగూడ పరిధిలోని పద్మావతి కాలనీలో నకిలీ వైద్యులను సంబంధించిన సమాచారం ఓల్డ్ అల్వాల్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ కు అందింది. తక్షణం స్పందించిన ఆయన స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సహకారంతో పద్మావతి కాలనీలోని గాయత్రి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పై దాడి చేయడం జరిగింది. దొంత యాత్రి మహా రుషి(51) అనే వ్యక్తి క్లినిక్ ను నిర్వహిస్తున్నట్లు తేలింది. నిందితుడికి సంబంధించిన సర్టిఫికెట్లను పరిశీలించగా అతను ఒక నర్సుగా గుర్తించారు. ఎంబిబిఎస్ వైద్యుడిగా బోర్డు ఏర్పాటు చేసుకుని అమాయక ప్రజలకు వైద్యం చేస్తున్నాడు. ఎలాంటి అర్హత లేకున్నా డాక్టరుగా చలామణి అవుతున్న నకిలీ డాక్టర్ రుషిని అదుపులోకి తీసుకున్నారు. అదే ప్రాంతంలోని నాని ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పై కూడా దాడి చేయగా నిఖిలేశ్ తెలిసింది. ఎంఎల్టి పూర్తి చేసి ల్యాబ్ టెక్నీషియన్ గా పని చేయాల్సిన రాయిశెట్టి వెంకటేష్(32) ఎంబిబిఎస్ వైద్యుడిగా చలామణి అవుతున్నట్లు గుర్తించారు. నిందితులు ఇద్దరి నుంచి అలోపతి మందులు, స్టెతస్కోప్ లు, బిపి మిషిన్లు, పల్స్ మీటర్లు, థర్మా మీటర్లు, ఇంజక్షన్, ప్రిస్క్రిప్షన్ పుస్తకాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎంబిబిఎస్ అర్హత లేకుండా ప్రజారోగ్యానికి హాని కలిగించే రీతిలో వ్యవహరించిన రుషి, వెంకటేష్ లుపై భారీతాయ శిక్షా న్యాయ సంహిత(బిఎన్ఎస్) సెక్షన్లు 318, 319, నేషనల్ మెడికల్ కమీషన్ యాక్ట్ 2019 మరియు తెలంగాణా మెడికల్ ప్రాక్టీషనర్స్ యాక్ట్ 1968 కింద కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ తరుణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులన్నీ విడుదల చేయాలి

## ఎస్జిటి ఉపాధ్యాయ పోస్టుల రద్దును విరమించుకోవాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి విజ్ఞప్తి చేసిన ఎస్జిటియు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయ సంఘం(ఎస్జిటియు) డిమాండ్ చేసింది. అలాగే ఎస్జిటి ఉపాధ్యాయ పోస్టుల రద్దును విరమించుకోవాలని డిమాండ్ చేసింది. శుక్రవారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావును కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎస్జిటి ఉపాధ్యాయ పోస్టుల రద్దును విరమించు కోవాలన్నారు. జీవో 25ని సవరించిన తరువాతనే ఉపాధ్యాయుల రేషనలైజేషన్ను చేపట్టాలన్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల నిష్పత్తిని తగ్గించిన తరువాతనే రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టాలన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుల బెనిఫిట్స్ ని ఆలస్యం చేయకుండా వెంటనే చెల్లించాలన్నారు. పండిట్, వ్యాయామం ఉపాధ్యాయ పోస్టుల(పిఈటి)ల ఉన్నతీకరణలో జీవోలను సవరిస్తూ మళ్ళీ ఎస్జిటిలకు అవకాశం కల్పించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో పిఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికివిజ్ఞప్తి చేసినట్టు మహిపాల్ రెడ్డి తెలిపారు.

# పక్షవాతం బారిన లక్షలాది మంది

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆందోళన

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** దేశంలో ఏటా లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రిహామిలిటేషన్ కోసం అత్యాధునిక కేంద్రాలు మరిన్ని ఏర్పాటు కావాలన్నారు. రీహాబిలిటేషన్ను పూర్తి స్థాయిలో బీమా పరిధిలోకి తీసుకువచ్చి రోగులకు అండగా నిలవాలని బీమా సంస్థలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు హైదరాబాద్లో శుక్రవారం ఓ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని వైద్య నిపుణులతో ముచ్చటించారు. వైద్యం, వైద్య సేవలు ఒక మిషన్లా సాగాలన్నారు. రీహాబిలిటేషన్ అనే ముఖ్యమైన సామాజిక అవసరమన్నారు. సర్జరీ తర్వాత రోగి తన సొంత కాళ్లపై నిలబడేలా చేసే గోల్డెన్ విండో పీరియడ్లో రీహాబిలిటేషన్ పాత్ర కీలకమన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో పెరగనున్న సీట్లు

## ఈ యేడాది 18,330కి పెంపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో సీట్లు పెరగనున్నాయి. గత ఏడాది కంటే అదనంగా 5,280 సీట్లు అదనంగా పెరగనున్నాయి. రాష్ట్రంలో 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు ఉండగా వాటిలో 2025-26 విద్యా సంవత్సరంలో ఈడబ్ల్యూఎస్ సీట్లతో కలిపి 14,322 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ సీట్లు కాకుండా 13,050 సీట్లు ఉన్నాయి. అయితే రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో గత విద్యాసంవత్సరంతో పోలిస్తే ఈసారి సీట్ల సంఖ్య పెరగనుంది. 2025-26 విద్యాసంవత్సరంలో ఈడబ్ల్యూఎస్ మినహాయించి 13,050 ఉండగా, రాబోయే ఏడాది 2026-27 విద్యాసంవత్సరంలో 18,330 సీట్లకి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అదనంగా 5,280 సీట్లు అందుబాటులోకి రానున్నాయి.

# ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## రియల్ ఎస్టేట్ సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం: డిప్యూటీ సిఎం భట్టి

## సులువుగా రియల్ అనుమతులు : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

### ప్రారంభమైన క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో-2026




శుక్రవారం క్రెడాయ్ ప్రాపర్టీ షోను ప్రారంభించిన తర్వాత మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** అత్యంత విశ్వసనీయమైన కొనుగోలుదారుల కేంద్రీకృత రియల్ ఎస్టేట్ ప్రదర్శన... క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో-2026 ప్రారంభమైంది. నగరంలోని హైటెక్ సిటీ - హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో మూడు రోజులపాటు కొనసాగనుంది. ఈ నెల 8వరకు హైటెక్స్‌లోని 4వ నెం. హాల్‌లో షో కొనసాగనుంది. క్రెడాయ్ సభ్య డెవలపర్‌లను, రియల్ ఎస్టేట్ రంగంలోని కీలక వాటాదారులను ఒకే విశ్వసనీయ వేదికపైకి ఈ షో తీసుకువచ్చింది. ఈ మేరకు రాష్ట్ర డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం క్రెడాయ్ ప్రాపర్టీ షోను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి మహానగరంగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 2 సంవత్సరాల్లోనే హైదరాబాద్ నగరాభివృద్ధికి రూ.20,000 కోట్లు కేటాయించిందని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో రూ.1,950.52 కోట్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి పరిధిలో రూ.12,500 కోట్లు, హెచ్ఎండీఏ పరిధిలో రూ.4,365 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలో ఇంత భారీ స్థాయిలో నగరాభివృద్ధికి నిధులు కేటాయించడం ఇదే మొదటిసారి అని స్పష్టం చేశారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా సమగ్ర ప్రణాళిక, ఒకే విధమైన పౌర సేవలు, ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో సమతుల్య అభివృద్ధి సాధ్యమైందన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 కింద క్యూర్-ప్యూర్-రేర్ వ్యూహంతో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీని కేంద్రంగా ఉంచుకుని అభివృద్ధి సాగుతోందన్నారు. హైదరాబాద్ ఒక ప్రధాన పెట్టుబడి గమ్యస్థానంగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రపంచస్థాయి మౌళిక సదుపాయాలు, బలమైన శాంతిభద్రతలు, వ్యాపార అనుకూల వాతావరణం ద్వారా నగరాన్ని సౌకర్యవంతంగా జీవించడానికి అనువుగా మార్చడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. నిజాం కాలం నాటి సమ్మిళితత్వం, విశ్వనగర సంస్కృతి వారసత్వంపై నిర్మించబడిన హైదరాబాద్ వృద్ధి అంచనాలను అధిగమిస్తూనే ఉందని వెల్లడించారు. నీటిపారుదలశాఖ అనుమతులతో సహా పలు శాఖాపరమైన అనుమతులను సులభతరం చేసేందుకు ప్రభుత్వం సరళీకృత, డిజిటలైజ్డ్ ఆమోద ప్రక్రియలను అమలు చేస్తోందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. భారత దేశంలో రియల్ ఎస్టేట్ వృద్ధికి గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు వచ్చే వలసలు అతిపెద్ద చోదక శక్తిగా కొనసాగుతున్నాయని చెప్పారు. క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్.జైదీప్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌రంగం నిర్మాణాత్మక బలం, దీర్ఘకాలిక స్థిరత్వంతో జాతీయ స్థాయిలో ప్రత్యేకంగా నిలుస్తోందన్నారు.

స్థిరమైన విధాన దిశానిర్దేశం, చురుకైన పాలన, భౌతిక, సామాజిక మౌళిక సదుపాయాల్లో స్థిరమైన పెట్టుబడులతో ప్రయోజనం పొందుతోందన్నారు. ఇవి సమిష్టిగా క్రమబద్ధమైన పట్టణ వృద్ధికి బలమైన పునాదిని సృష్టించాయన్నారు. నేడు హైదరాబాద్ దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడుతూ ఉపాధి అవకాశాలను విస్తారంగా అందించడంతోపాటు జీవన నాణ్యతను మెరుగుపరుస్తోందని చెప్పారు. క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు (ఎలెక్ట్) బీ. జగన్నాథ్‌రావు మాట్లాడుతూ... హైదరాబాద్ నిర్ణయాత్మకంగా వైవిధ్యమైన ప్రపంచ నగరంగా అభివృద్ధి చెందిందన్నారు.

క్రెడాయ్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ క్రాంతి కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ... రియల్ ఎస్టేట్‌రంగంలో కీలకమైన సవాళ్లను, ముఖ్యంగా తప్పుదారి పట్టించే ధరలు, కొనుగోలుదారులను మోసం చేసే చట్టవిరుద్ధమైన ప్రీ లాంచ్, అమ్మకాల సమస్యలను పరిష్కరించడానికి 400 మంది డెవలపర్‌లతో పాటు రెరాతో కలిసి క్రెడాయ్ పనిచేస్తోందని చెప్పారు.

ఏకీకృత భవన నియమావళి కింద ప్రీలాంచ్ తదితర పద్ధతులను అరికట్టడానికి సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాపర్టీ షో కన్వీనర్ సుశీల్ కుమార్‌జైన్, కోకన్వీనర్ ఎన్. వేణుగోపాల్, ఇతర మేనేజింగ్ కమిటీ సభ్యులు.., బ్యాంకింగ్‌రంగ ప్రతినిధులు, పరిశ్రమ వాటాదారులు, సందర్శకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, కాంగ్రెస్ ఫెవికాల్ బంధం జనానికి తెలుసు

## బిజెపిపై దూషణలతో స్థాయిని దిగజార్చుకుంటున్న సిఎం రేవంత్

## పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కౌంటర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి.. బహిరంగసభల్లో ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులపై దూషణ లకు దిగడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ ఫెవికాల్ బంధం గురించి తెలంగాణ ప్రజలకు బాగా తెలుసునన్నారు. దూషణలకు దిగడం ద్వారా సీఎం తన స్థాయిని తానే దిగజార్చుకుంటున్నారని స్పష్టం చేశారు. సీఎం అంటున్న బొంద పెట్టడమనే పదం కాంగ్రెస్ పార్టీకి వర్తిస్తుందని, కాంగ్రెస్ పార్టీని మున్సి పల్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బొంద పెట్టడం ఖాయమన్నారు. రానున్న8 సంవత్సరాలు తానే అధికారంలో ఉంటానని సీఎం కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ కరీంనగర్ మెదక్ ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మట్టి కరిచిన విషయం మర్చిపోయావా? అని ప్రశ్నించారు. లిక్కర్ కేసులో కల్వకుంట్ల కవిత అరెస్టు చేయడానికి జీర్ణించుకోలేని రేవంత్.. బిఆర్ఎస్ లబ్ధి కోసమే కవిత ను అరెస్టు చేశారని మాట్లాడిన విషయం వాస్తవం కాదా..? అని నిలదీశారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా ఎన్నికల బహిరంగసభలో బీజేపీపై సీఎం రేవంత్ చేసిన విమర్శలకు శుక్రవారం ఒక ప్రకటనలో ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. ఆ సీటు కాంగ్రెస్ పార్టీది అన్న విషయమైనా రేవంత్ రెడ్డికి తెలుసా?

భారతీయ జనతా పార్టీని నిజామాబాద్ కరీంనగర్ మెదక్ అదిలాబాద్ ప్రజలు ఆదరించారని, మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆదరిస్తారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో విమానాశ్రయాలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన విషయం మరిచిపోయిన సీఎం మరోసారి మోసం చేసే మాటలను మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రీజినల్ రింగ్ రోడ్ అనుమతులు ఎప్పుడొచ్చాయో తెలియకుండా తానే చేశాను అని చెప్పడం ముఖ్యమంత్రి దివాలా కోరుతనాన్ని సూచిస్తుందన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కల్వకుంట్ల కిషన్‌రావు అని విమర్శించడం సీఎంకు తగదని, కేసీఆర్ కుటుంబంలోకి వెళ్లాలన్న ఉత్సాహం సీఎం రేవంత్‌కు ఉన్నట్టు స్పష్టమవుతోందన్నారు. పచ్చి అబద్ధాలతో మోసాలతో కుట్రలతో మార్ఫింగ్ మాయాజాలంతో మోసం చేసే సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

# రూ.2,273 కోట్లతో వ్యవసాయ ప్రతిపాదనలు

## కేంద్రానికి రాష్ట్ర సర్కార్ నివేదిక

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** కేంద్రం అమలు చేస్తున్న వ్యవసాయ, సంక్షేమ పథకాల ద్వారా తెలంగాణకు రూ.2,273 కోట్ల మేర నిధులు రాబట్టాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. తద్వారా కేంద్రం నుండి వీలైనన్ని ఎక్కువ నిధులు రాబట్టడంపై రాష్ట్ర సర్కార్ ప్రత్యేక దృష్టి కేంద్రీ కరించింది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంపై ప్రత్యేక శ్రద్ధపెట్టిన వ్యవసాయ శాఖ ఇందుకు 2,273 కోట్ల రూపాయలతో రూపొందించిన ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది. కాగా రాష్ట్రాలు తమ స్థానిక అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించటానికి కేంద్ర ప్రభుత్వం సౌలభ్యం కల్పిస్తోంది. రాష్ట్రాలు తయారు చేసిన సంబంధిత ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేసి 60:40 నిష్పత్తిలో నిధులు మంజూరు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు అతంత మాత్రంగా ఉండటంతో తెలంగాణలో ఈ పథకం అమలు నిలిచిపోయింది. 2015-16 నుండి ఈ పథకం యొక్క నిధుల సరళిని కేంద్రం, రాష్ట్రాల మధ్య 60:40 నిష్పత్తిలో మార్చారు. ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ రాష్ట్రాలకు 90:10 నిష్పత్తిలో నిధులు కేటాయిస్తారు.

# మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీ ప్రకటన

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 6:** మరో మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకుంటానని చెప్పారు. తనకు సెంటిమెంట్ ఎక్కువన్న ఆమె.. మంచి మూహూర్తం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. కొంత కాలం గడిచిన తర్వాత తన బలం ఏంటో అందరికీ అర్థమవుతుందని కవిత వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆమె తెలంగాణ జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజలే తనను నాయకురాలిగా తీర్చిదిద్దాలని, వారి మద్దతే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో తనకు ఒరిగిందేమీ లేదని స్పష్టం చేసిన కవిత.. భవిష్యత్తులో తన రాజకీయ ప్రయాణం పూర్తిగా ప్రజల మద్దతుపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఎందుకు ప్రచారం చేయడం లేదని కవిత ప్రశ్నించారు. జాగృతి సంస్థ పోటీ చేస్తున్న ప్రాంతాల్లో హరీశ్ రావు ఎందుకు తిరుగుతున్నారని నిలదీశారు. అలాగే కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గానికే ఎందుకు పరిమితమయ్యారని ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. తనపై విమర్శలు చేస్తున్న వారిపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'గుంటనక్క, గూఢచారి' వంటి పేర్లు వారికి నప్పుతాయి కాబట్టే అలా పిలుస్తున్నానన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, కానీ వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తాను కూడా మౌనంగా ఉండబోనని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసిన మాధవ్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ ఎందుకు ఇచ్చిందో ప్రజలకు వివరణ ఇవ్వాలి. బీసీల నోటికాడ ముద్ద లాక్కునే ప్రయత్నం చేసిన వ్యక్తికి బీఆర్ఎస్ రాజముద్ర వేసినట్లుగా పార్టీ టికెట్ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గాంధీని నిజామాబాద్ ఎన్నికలకు ఇంఛార్జ్‌గా పంపారు. పార్టీ పరంగా లెటర్ ఇచ్చి మరి ఆయనను కాంగ్రెస్ ఇంఛార్జ్‌గా వేసింది. నిజానికి బీఆర్ఎస్ తరపున గెలిచిన ఆయనకు ప్రతిపక్షాలకు ఇచ్చే పీఏసీ ఛైర్మన్ పదవి కూడా ఉంది. విచారణ నిర్వహించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్... పార్టీ మారలేదంటూ ప్రకాశ్ గౌడ్, తెల్లం వెంకట్రావులను బీఆర్ఎస్ ఎమెల్యేలు గా ప్రకటించినప్పటికీ వారికి కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జ్ లుగా నియమించారు అంటే ప్రజల తీర్పును కాంగ్రెస్ పార్టీ ఘోరంగా హేళన చేస్తోందని వ్యాఖ్యానించారు. ప్రజలు ఎవరినీ నమ్మాలో, ఎవరినీ నమ్మొద్దో తెలియని పరిస్థితి నెలకొంది. అందుకే మాలాంటి సంస్థలు ప్రజల తరఫున మేము మాట్లాడుతున్నాం. ఇక బీసీలకు ఏటా రూ.20 వేల కోట్లు బడ్జెట్ పెడతామని కాంగ్రెస్ చెప్పింది. కానీ గత రెండు బడ్జెట్‌లు కలిపి రూ.ఏడువేల కోట్లు కూడా నిధులు కేటాయించలేదు. త్వరలోనే బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. ఇప్పుడు బీసీ సబ్ ప్లాన్‌పై కసరత్తు చేయాలి. ఆ తర్వాత ఒక్క బడ్జెట్ మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత వచ్చే బడ్జెట్ ఎన్నికల బడ్జెట్ ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఉద్యమకారులను మోసం చేసిందన్న కారణంతో వారంతా కూడా కాంగ్రెస్‌కు ఓటు వేశారు. కానీ కాంగ్రెస్ కూడా వారికి న్యాయం చేయటం లేదు. ఉద్యమకారులకు ఇస్తామన్న భూమి కోసం మేము కరీంనగర్‌లో భూపోరాటం చేశాం. ఈ నెల 12 న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ పెడుతున్నాం. ఆర్టీసీ కళ్యాణ మండపంలో జరిగే ఈ సభకు పెద్ద ఎత్తున ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ వాదులు హాజరుకావాలని కోరుతున్నట్లు తెలిపారు.

# ప్రాణం తీసిన సిగరెట్..

## మాజీ సైనికుడి దుర్మరణం



చెన్నకేశవులు (ఫైల్)

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** బోరబండ హబీబ్ ఫాతిమా నగర్‌లో చోటుచేసుకున్న విషాద ఘటన స్థానికులను కలచివేసింది. మద్యం సేవించిన అనంతరం సిగరెట్ తాగుతూ నిద్రపోయిన ఓ మాజీ సైనిక ఉద్యోగి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురై మృతి చెందిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హబీబ్ ఫాతిమా నగర్‌లో నివాసం ఉంటున్న చెన్న కేశవులు (75) రెండో అంతస్తులోని పెంట్ హౌస్‌లో ఒంటరిగా నివసి స్తున్నారు. శుక్రవారం సాయంత్రం మద్యం సేవించిన అనంతరం సిగరెట్ తాగుతూ నిద్రలోకి జారుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో చేతిలోని సిగరెట్ మంటలు మంచంపై పడటంతో మంటలు చెలరేగాయి. తీవ్రమైన మంటల వల్ల చెన్నకేశవులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పొగలు వస్తున్నాయని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న బోరబండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు చెన్నకేశవులు మాజీ సైనిక ఉద్యోగిగా పనిచేసి పదవీ విరమణ పొందినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై బోరబండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తప్పు కాలేజీలది.. శిక్ష విద్యార్థులకు!

## విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించని ప్రైవేటు కాలేజీలు

## అడ్మిషన్లను కూడా బోర్డుకు పంపని యాజమాన్యాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** ఈ నెల 25 నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఈ నెల 2 నుంచి సైన్స్ విద్యార్థులతోపాటు, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటర్‌బోర్డు చుట్టూ కొందరు విద్యార్థులు తమకు వార్షిక పరీక్ష ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పించాలని కోరుతూ తిరుగుతున్నారు. వందలాది మంది విద్యార్థులు గత కొన్ని రోజులుగా ఇంటర్‌బోర్డు చుట్టూ తిరుగుతున్నారు. ఇంటర్ బోర్డు చుట్టూ తిరుగుతున్న విద్యార్థులు వాస్తవంగా వారు చేసిన తప్పు మూలంగా బోర్డు రాలేదు. వారు చదువుతున్న కాలేజీలు చేసిన తప్పుల మూలంగా వారు ఇపుడు ఇంటర్ బోర్డు దగ్గరి తమ ఫీజు చెల్లించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు. ఇంటర్ బోర్డుకి వస్తున్న విద్యార్థులు ప్రస్తుతం సెకండియర్ చదువుతున్న విద్యార్థులే ఎక్కువ మంది ఉన్నారు. వారు గత ఏడాది మొదటి సంవత్సరం ఒక కాలేజీలో చదివారు. వారు చదివిన కాలేజీలో విద్య నచ్చక కొందరు, వారు చదివిన రెసిడెన్షియల్ కాలేజీలో హాస్టల్ నచ్చక కొందరు వేరే కాలేజీలో చేరారు. ఇలా చేరిన సమయంలో మొదటి సంవత్సరం చదివిన కాలేజీ వారు విద్యార్థులకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టిసి) జారీ చేశారు. దీంతోపాటు వారు అడ్మిషన్‌ను ఆయా కాలేజీ నుంచి తొలగించారు.

కొత్తగా విద్యార్థి చేరిన కాలేజీ యాజమాన్యం తమ దగ్గర విద్యార్థి చేరినట్టు అడ్మిషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా చేరిన విద్యార్థులు కొత్త కాలేజీలో ఫీజులు చెల్లించారు, రోజూవారీగా క్లాసులకు హాజరయ్యారు. అయితే కాలేజీ యాజమాన్యం వారి అడ్మిషన్లను ఇంటర్ బోర్డుకి పంపించడం మరచిపోయారు. దీంతో విద్యార్థులు ఇపుడు జరుగుతున్న ప్రాక్టికల్ పరీక్షలకు హాల్ టికెట్లు రాకపోవడంతో ఏమీ జరిగిందని ఆరా తీయగా.. విషయం బయటపడింది. దీంతో ఆయా కాలేజీ యాజమాన్యాలు ఇంటర్ బోర్డుకి వెళ్లకుండా విద్యార్థులు, తల్లిదండ్రులను బోర్డుకి పంపించి రిక్వెస్ట్ చేయమని చెబుతున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇంటర్‌బోర్డుకి వచ్చి ఫీజు చెల్లించడానికి అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు.

శుక్రవారం ఇంటర్ బోర్డుకి వచ్చిన తల్లిదండ్రులు మాట్లాడుతూ కాలేజీ వారు చేసిన తప్పుకి తమ కుమారుడు పరీక్ష రాయలేకుండా పోతాడని.. తమ కొడుక్కి ఈ విషయం తెలిస్తే ఎటువంటి నిర్ణయం తీసుకుంటాడో అనే భయంతో తామే ఇంటర్ బోర్డు చుట్టూ తిరుగుతున్నామని చెబుతున్నారు.

# యుపిఎస్‌సికి డిజిపి ఎంపిక జాబితాను పంపేందుకు సర్కారు కసరత్తు

## డిజి కేడర్‌లో ఉన్న ఆరుగురి పేర్లను పంపేందుకు నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 6:** రాష్ట్ర పోలీసు శాఖకు పూర్తిస్థాయి డిజిపి ఎంపిక నాలుగు వారాల్లో పూర్తి చేయాలని సుప్రీం కోర్టు ప్రభుతా ్వనికి ఆదేశించడంతో దీనికి సంబంధించిన కసరత్తులను సర్కారు ఆగమేఘాల మీద ప్రారంభించింది. ఈ విషయంలో యుపిఎస్‌సి వైఖరిని కూడా సుప్రీం కోర్టు తప్పుపట్టడం తెలిసిందే. డిజిపి ఎంపికలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి రాష్ట్ర సర్కారు వైఖరి భిన్నంగానే వుండడం గమ నార్హం. రాష్ట్ర తొలి డిజిపి అనురాగ్ శర్మ, మలి డిజిపి మహేందర్ రెడ్డిల విషయంలో మొదట తాత్కాలికంగా నియమించి ఆ తరువాత జాబితాను యుపిఎస్‌సిపి రాష్ట్రం పంపింది. దీని తరువాత అంజనీ కుమార్‌ను కూడా ఇదే తరహాలో నియమించింది. ఆయన నియామకంపై కోర్టులో ఎలాం టి వాజ్యాలు రాకపోవడంతో సర్కారు కానీ యుపిఎస్‌సి కానీ స్పందించాల్సిన అవసరం లేకుండా పోయింది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల ఫలితా ల వేళ కాంగ్రెస్ పార్టీ గెలుపొందగానే నాటి పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి మరీ అంజనీ కుమార్ అభినందించడాన్ని ఎన్నికల సంఘం తప్పుపట్టి ఆయనను సస్పెండ్ చేసింది. దీంతో డిజిపి పదవీలో వుండగా సస్పెండ్ అయిన అధికారిగా ఆయన నిలిచారు. ఆయన స్థానంలో ఎన్నిక ల సంఘం ఆదేశాల మేరకు సీనియర్‌గా వున్న రవి గుప్తాను నియమించారు. అయితే ఆయన ఏడాది కాలం సర్వీసు పూర్తి చేసిన తరువాత హఠా త్తుగా 2024 జూలై నెల పదవ తేదీన బదిలీ చేసి హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా వున్న జితేందర్‌ను సర్కారు నియమించింది. జితేందర్ నియామ కం రెండు రోజుల వ్యవధిలోనే జరిగిపోవడం గమనార్హం. జితేందర్ పదవీ స్వీకారం తరువాత కూడా పూర్తిస్థాయి డిజిపి ఎంపికకు సంబంధించిన క సరత్తును సర్కారు చేబట్టలేదు. సీనియర్లతో కూడిన జాబితాను యుపిఎస్‌సికి పంపలేదు. దీనిపై యుపిఎస్‌సి కూడా సర్కారును ఏమీ అనక పోవడ ం గమనార్హం. జితేందర్ గత ఏడాది సెప్టెంబరు నెలాఖరున పదవీ విరమణ చేయగా ఆయన స్థానంలో మరోసారి ఇంఛార్జి డిజిపిగా శివధర్ రెడ్డిని సర్కారు నియమించింది. శివధర్ రెడ్డి అక్టోబరు ఒకటవ తేదీన పదవీ బాధ్యతలు చేబట్టారు. ఇక శివధర్ రెడ్డి బాధ్యతలు చేబట్టిన తరువాత కూడా రాష్ట్ర సర్కారు డిజిపి ఎంపికకు సంబంధించిన ప్రక్రియను చేబట్టలేదు. దీనిపై యుపిఎస్‌సికి జాబితాను పంపలేదు.

అయితే ఈ మొత్తం వ్యవహారం పై ఎం.గోపాల్ అనే వ్యక్తి మొదట హైకోర్టులో అనంతరం సుప్రీం కోర్టులో సవాల్ చేయడం, దీనిపై సుప్రీం ధర్మాసనం అటు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇ టు యుపిఎస్‌సిని తీవ్రంగా ఆక్షేపించడంతో పాటు వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని, లేకుంటే తీవ్రమైన చర్యలు తీసుకోవాల్సి వుంటుంద ని హెచ్చరించింది. తెలంగాణ నుంచి తమకు డిజిపిల ఎంపికకు సంబంధించి ఎలాంటి జాబితా రాలేదని యుపిఎస్‌సి సుప్రీం కోర్టుకు చెప్పడం సం చలనం రేపింది. డిజిపిల ఎంపికలో ఒక్క తెలంగాణయే కాకుండా అనేక రాష్ట్రాలు ఇష్టానుసారం వ్యవహరిస్తుండడంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్త ం చేసి, ఈ విషయంలో యుపిఎస్‌సి కోర్టు దిక్కరణ చర్యలు తీసుకోవాలని కోరింది. డిజిపి ఎంపికలో సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసిన దరిమి లా రాష్ట్ర సర్కారు జాబితాను ఖరారు చేసేందుకు ఉపక్రమించింది. సర్కారు రూపొందించనున్న జాబితాలో డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు హోదాలో వున్న వారిలో ముందు వరుసలో హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి 1991 బ్యాచ్ అధికారి సి.వి ఆనంద్ అందరి కంటే సీనియర్‌గా వున్నారు. ఆయనకు 2028 జూన్ వరకు సర్వీసు వుంది. ఆయన తరువాత సీనియర్‌గా 1994 బ్యాచ్ అధికారి కేంద్ర సర్వీసులో వున్న వినాయక్ ప్రభాకర్ ఆప్టే వున్నారు.


ఆయనకు 2029 అక్టోబర్ వరకు సర్వీసు వుంది. ఆయన కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్ర సర్వీసులోకి వచ్చేందుకు ఇష్టపడితే సీని యారిటీలో రెండవ స్థానంలో వుంటారు. ఆప్టే కేంద్ర సర్వీసుల నుంచి వచ్చేందుకు ఇష్టపడకుంటే ఆయన పేరును పరిగణలోకి తీసుకోరు. ఆప్టే త రువాత ఇదే బ్యాచ్‌కు చెందిన అభిలాష్ బిస్త్ సీనియర్‌గా వున్నారు. ఆమెను ఎపికి కేటాయించగా క్యాట్‌లో పోరాడి తెలంగాణ కేడర్‌లోకి వచ్చారు. ఆమె ప్రస్తుతం తెలంగాణ పోలీసు అకాడమి డైరక్టర్‌గా వున్నారు. ఆమెకు ఈ ఏడాది జూన్ నెల వరకు సర్వీసు వుంది. అభిలాష్ బిస్త్ తరువాత ఇ దే బ్యాచ్‌కు చెందిన ప్రస్తుత డిజిపి శివధర్ రెడ్డి సీనియర్‌గా వున్నారు. ఆయనకు ఈ ఏడాది ఏప్రిల్ వరకు సర్వీసు వుంది. శివధర్ రెడ్డి తరువాత ఇదే బ్యాచ్‌కు చెందిన జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా సీనియర్. ఆమెకు 2027 డిసెంబరు వరకు సర్వీసు వుంది. ఆమె తరువాత ఇదే బ్యాచ్‌కు చెం దిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ శిఖా గోయల్ సీనియర్. ఆమెకు 2029 మార్చి వరకు సర్వీసు వుంది. మొత్తం మీద రాష్ట్ర పో లీసు శాఖలో డిజి హోదాలో ఆరుగురు వుండగా ఇందులో ఒకరు కేంద్ర సర్వీసులో మిగతా ఐదుగురు రాష్ట్ర సర్వీసులో వున్నారు. నిబంధనల మేర కు రాష్ట్రం సీనియర్లుగా వున్న ఐదుగురి పేర్లను యుపిఎస్‌సికి పంపాల్సి వుంది. ఇందులో రెండేళ్ల సర్వీసు వున్న వారు కూడా వుండాల్సి వుంది. ఈ నిబంధనల ప్రకారం రెండేళ్ల సర్వీసు ఆనంద్, ఆప్టే, శిఖా గోయల్‌లకు మాత్రమే వుంది. ఒకవేళ వీరిని కాదని తక్కువ సర్వీసు వున్న వారి పేర్ల ను కూడా రాష్ట్రం తన జాబితాలో పంపే వీలుంది. ఇందులో నుంచి ముగ్గురి పేర్లను యుపిఎస్‌సి సీనియారిటీ ప్రకారం రాష్ట్రానికి తిరిగి పంపుతుం ది. వీరిలో నుంచి ఒకరిని డిజిపిగా ఎంపిక చేయాల్సి వుంటుంది. ఒకవేళ తక్కువ సర్వీసు వున్న అధికారి డిజిపిగా సర్కారు నియమించదలచుకుం టే సదరు అధికారి రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగే వీలుంటుంది.

గతంలో ఎపిలో జెవి రాముడు ఇలాగే కొనసాగగా ప్రస్తుత డిజిపి హరీష్ గుప్తా ఇదే రీతిన కొనసాగుతున్నారు. మరోవైపు యుపిఎస్‌సికి డిజిపి ఎంపికకు సంబంధించిన జాబితాను గత ఏడాది పంపినట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు ప్రభాతవార్తకు తెలిపారు. ఈ విషయంలో యుపిఎస్‌సి సుప్రీం కోర్టుకు ఎందుకు దీనికి భిన్నంగా చెప్పిందో తమకు తెలియదని ఆ యన తెలిపారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తాం

## మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి

విజయనగరం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. గ్రంథాలయాలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్‌గా దొంకాడ రామకృష్ణ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలోని గురజాడ కళాభారతిలో ఘనంగా జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులు శ్రీనివాస్, సంధ్యారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రంథాలయాలు విజ్ఞాన గనులని, వాటి అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పుస్తకాలను చదవడం ద్వారా ఉన్నత స్థాయికి ఎదగడంతోపాటు, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవచ్చునని సూచించారు. పార్టీలో కష్టపడేవారికి పదవులు దక్కుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రతీఒక్కరూ దీనిని దృష్టిలో ఉంచుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, అన్ని ధనాల్లో కంటే విద్యాధనం శాశ్వతమని పేర్కొన్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో కూడా ఒక కేంద్ర గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి మంత్రిగా తమవంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఎన్నో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని వినియోగించుకొని పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గా బాధ్యతలను స్వీకరించిన రామకృష్ణ మాట్లాడుతూ, జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. గ్రంథాలయాలను దేవాలయాలుగా తీర్చిదిద్దుతానని చెప్పారు. మంచి పుస్తకాలను అందుబాటులోకి ఉంచేందుకు, మండల స్థాయిలో కూడా



గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. శాసన సభ్యులు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, బేబీ నాయన, తోయక జగదీశ్వరి మాట్లాడుతూ, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రామకృష్ణను అభినందించారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి తమవంతుగా సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్లు రొంగలి పోతన్న, దత్తి లక్ష్మణరావు, బొడ్డుల నర్సింగరావుతోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

---

### కులాలు, ప్రాంతాలుగా విడిపోయినా..

# హిందూ ధర్మం ఒక్కటే భక్తులు మౌనం వీడాలి



- సామాజిక మాధ్యమాల వేదికలపై డిసిఎం పవన్ కల్యాణ్ పిలుపు
- ధర్మ రక్షణ అంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని వ్యాఖ్య

విజయవాడ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: హిందూ ధర్మ పరిరక్షణ కోసం భక్తులు మౌనం వీడాలని పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమాల వేదికలపై పిలుపునిచ్చారు. తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రం కావడం మొదలుకొని హిందూ దేవాలయాల పవిత్రతపై జరుగుతున్న దాడులను ఉదహరిస్తూ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భక్తులు స్పందించాలన్నారు. ప్రతి భక్తుడికీ ఒక ధార్మిక బాధ్యత ఉంటుందని, దేవుడిపై కేవలం భక్తి ఉంటే సరిపోదని, ఆ భక్తికి రక్షణ కవచంగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. మన ఆరాధ్య దైవాలను లేదా ధర్మాన్ని ఎవరైనా అవహేళన చేసినప్పుడు బాధపడుతూ మౌనంగా ఉండిపోవడం ఇకపై సరికాదని..తమ ఆగ్రహాన్ని గళమెత్తి చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు సోషల్ మీడియా "ఎక్స్"లో ఇంగ్లిష్‌లో, హిందీలో పోస్టులు పెట్టారు. దేవుడిపై కేవలం భక్తి ఉంటే సరిపోదని, ఆ భక్తికి రక్షణ కవచంగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మనం కులాలు, భాషలు, ప్రాంతాలు లేదా వివిధ పద్ధతులతో విడిపోయి ఉండవచ్చు, కానీ మన ధర్మం, మన ఆరాధ్య దైవాలు ఒక్కటేనని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా హిందూ ధర్మాన్ని, భక్తుల విశ్వాసాలను అవమానించినప్పుడు భక్తులు తమ ఆగ్రహాన్ని బహిరంగంగా నిరసించడం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. మౌనంగా ఉండటం వల్ల హిందూ ధర్మం గొంతు బలహీనపడుతుందని, అందుకే ప్రతి భక్తుడు కేవలం ఆరాధకుడిగానే కాకుండా తన విశ్వాసానికి రక్షకుడు కావాలని ఆయన ఆకాంక్షించారు. ధర్మ రక్షణ అంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని పవన్ కల్యాణ్ చాలా స్పష్టంగా వివరించారు. ఎవరినీ అవమానించడం లేదా ఎవరిపైనో ద్వేషం పెంచుకోవడం హిందూ ధర్మం ఉద్దేశం కాదని, కేవలం మన ధర్మం గౌరవాన్ని, మర్యాదను కాపాడుకోవడం మాత్రమేనని ఆయన నొక్కి చెబుతున్నారు. సనాతన ధర్మం వసుధైవ కుటుంబం అని బోధిస్తుందని, అయితే ఆ ధర్మాన్ని అగౌరవపరిచే వారి పట్ల మౌనంగా ఉండటం చేతకానితనం అవుతుందని హెచ్చరించారు.

---

# నేటి నుంచి గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్టు ఇన్ ఇంజినీరింగ్ పరీక్షలు

## రాష్ట్రంలో 19 గేట్ పరీక్షా కేంద్రాలు

విజయవాడ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: దేశవ్యాప్తంగా గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్టు ఇన్ ఇంజినీరింగ్ (గేట్)2026 ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఐఐటీ గువాహటి ఆధ్వర్యంలో ఈ నెల 7, 8, 14, 15 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నాయి. మొత్తం 30 సబ్జెక్టుల్లో ఈ పరీక్షలు నిర్వహించనుండగా, గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి అభ్యర్థుల సంఖ్య 10 లక్షలు దాటినట్లు సమాచారం. గత ఏడాది ఈ సంఖ్య 9.36 లక్షలుగా ఉంది. బీటెక్‌తో పాటు బీఎస్సీ, బీకాం విద్యార్థులు ఈ పరీక్ష రాస్తారు. తెలుగు రాష్ట్రాల నుంచి లక్ష మందికి పైగా దరఖాస్తు చేసినట్లు అంచనా. పరీక్షలో సాధించిన స్కోర్‌కు 3 ఏళ్ల పాటు విలువ ఉంటుంది. గేట్ స్కోర్‌తో ఎంటెక్‌లో చేరితే ఏఐసీటీఈ నుంచి కోర్సు పూర్తయ్యే 2 ఏళ్ల పాటు ప్రతినెలా రూ.12,400 చొప్పున స్టైపెండ్ అందుతుంది. అదే స్కోర్‌తో ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, బీహెచ్‌ఈఎల్, ఈసీఐఎల్, ఇండియన్ ఆయిల్, గెయిల్ ఇండియా, డీఆర్‌డీఓ, సెంట్రల్ సిల్క్ బోర్డు తదితర పలు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయి. ఈ గేట్ స్కోర్ ఆధారంగా ఇంటర్వ్యూకు ఆహ్వానించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తాయి. కొన్ని సంస్థలు పీహెచ్‌డీలోనూ చేరేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. ఐటీ రంగంలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాల వైపు చూస్తుండటంతో 'గేట్'కు పోటీ పెరుగుతోందని భావిస్తున్నారు. గేట్‌లో కొద్ది సంవత్సరాలుగా మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. కొత్త పేపర్లను ప్రవేశ పెట్టడం, సిలబస్‌లో మార్పులు, బీఎస్సీ, ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు కూడా పరీక్షను రాసే అవకాశం కల్పించడం వంటివి చూశాం. ఈసారి ఇంజినీరింగ్ సైన్సెస్ (ఎక్స్‌ఈ) పేపర్‌లో ఎనర్జీ సైన్స్ (ఎక్స్‌ఈ1) కొత్త సెక్షనల్ పేపర్‌ను ప్రవేశపెడుతున్నారు. గేట్2026ను అభ్యర్థులు 2 పేపర్లలో రాసే అవకాశం ఉంటుంది. అభ్యర్థులు వారి ఇష్ట ప్రకారం ఒకటి లేదా రెండు పేపర్లు ఎంచుకోవచ్చు. 2వ పేపర్ ఎంపిక, మొదటి పేపర్ ఎంపికపై ఆధారపడి ఉంటుంది. గేట్ స్కోరు పీజీ ప్రవేశానికి 3 సంవత్సరాలు, పీఎస్‌యూల్లో నియామకానికి ఒకటి లేదా 2 ఏళ్లు చెల్లుతుంది.

రాష్ట్రంలో చీరాల, బాపట్ల, చిత్తూరు, గుంటూరు, కడప, నంద్యాల, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, భీమవరం, ఏలూరు, కాకినాడ సూరంపాలెం, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, విజయవాడ, విశాఖ పట్టణం, విజయనగరం, అనంతపురం, కర్నూలు తదితర 19 నగరాలలో గేట్ పరీక్షా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.

---

# సినీ ఫక్కీలో క్రిమినల్‌ను ఛేజ్ చేసిన పోలీసులు

- సిఐ, కానిస్టేబుల్ పై కత్తితో దాడి
- సిఐ కాల్పులు.. క్రిమినల్ పట్టివేత
- శ్రీ సత్యసాయి జిల్లాలో కలకలం

హిందూపురం, ఫిబ్రవరి 6 ప్రభాత వార్త: రాష్ట్రవ్యాప్తంగా సంచలము కలిగించిన అత్తా కోడళ్ళ గ్యాంగ్ రేప్ కేసులో ప్రధాన నిందితుడు, ఆంధ్ర, కర్ణాటకలో 70 పోలీస్ కేసుల్లో పేరు మోసిన మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ ఎరుకల కావడి నాగేంద్రను ఎంతో సాహసోపేతంగా హిందూపురం పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. ఎదురు తిరిగిన క్రిమినల్ పోలీసులపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురం పట్టణానికి చెందిన వాంటెడ్ క్రిమినల్ కొంతకాలంగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్న నాగేంద్ర కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. అప్ గ్రేడ్ సిఐ ఆంజనేయులు, రూరల్ సీఐ జనార్ధన్, చిలమత్తూరు ఎస్సై, పోలీసులు వేరువేరుగా రంగంలో దిగారు. చిలమత్తూరు మండలం కనుమ అటవీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున 6 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంలో నేరస్తుడు వెళ్తుండగా కానిస్టేబుల్ రవి శివ ద్విచక్ర వాహనంలో వెంబడించి పట్టుకునే ప్రయత్నం చేశారు. తిరగబడిన క్రిమినల్ నాగేంద్ర కత్తితో రవిపై దాడి చేయగా ఎడమ చేయకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల నుంచి తప్పించుకుని అటవీ ప్రాంతంలో ద్విచక్ర వాహనం వదిలేసి పారిపోయాడు. ఇవి జరిగిన కొద్దిసేపటికి సిఐ ఆంజనేయులు అతని కదలికలు గుర్తించి వెంటాడగా దట్టంగా అడవి ఉన్న ప్రదేశంలో పొదలమాటున దాక్కున్న నాగేంద్ర ఉన్నట్టుండి సిఐ ఆంజనేయులుపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. మెడ కోసేందుకు ప్రయత్నించగా చాకచక్యంగా సీఐ చేయి అడ్డం పెట్టడంతో ఎడమవైపు ఎదపై, చేతికి తీవ్ర గాయాలయి ఆంజనేయులు కింద పడిపోయాడు. మరోసారి సీఐపై కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించగా వెంటనే అప్రమత్తమైన సీఐ నిందితుడి మోకాలికి కాల్పులు జరిపాడు. ఆ వెంటనే పోలీసులు నేరస్తున్న అదుపులోకి తీసుకొన్నారు.



క్రిమినల్ నాగేంద్రను ఆసుపత్రికి తెస్తున్న పోలీసులు



గాయపడిన సిఐ ఆంజనేయులు

తీవ్రంగా గాయపడిన సిఐ కానిస్టేబుల్‌తో పాటు క్రిమినల్‌ను కూడా హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డి.ఎస్.పి మహేష్ ఘటనస్థలికి చేరుకొని సమీక్షించారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఎస్పీ సతీష్ కుమార్ హుటాహుటిన చిలమత్తూరు మండలం వచ్చి ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. తదుపరి హిందూపురం చేరుకొని గాయపడిన పోలీసులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చట్ట ప్రకారం క్రిమినల్ కావడి నాగేంద్రకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. టేకులోడు లో అత్తా కోడళ్ళ గ్యాంగ్ రేప్ సంఘటనతో పాటు అనేక క్రిమినల్ కేసుల్లో ఇతను మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ గా ఉన్నాడని ఎస్పీ వివరించారు.

కాగా ఎమ్మెల్యే బాలకృష్ణ గాయపడిన పోలీసులను ఫోన్లో పరామర్శించారు. అదేవిధంగా పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి తరలివచ్చారు.

---

### మద్యం కుంభకోణం కేసులో

# బాలాజీ యాదవ్ ఆస్తుల అటాచ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ

విజయవాడ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: వైసీపీ పాలనలో జరిగిన మద్యం కుంభకోణంలో నిందితుడు బాలాజీ యాదవ్ ఆస్తుల అటాచ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో చట్ట ప్రకారం.. తదుపరి చర్యలు చేపట్టి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని డీజీపీని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్‌లు. ఈ ఆస్తులపై తదుపరి లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఆయన తండ్రి కుల్లాయప్ప పేరిట ఉన్న ఆస్తులనూ అటాచ్ చేయాలని సర్కార్ ఆదేశించింది. ఏపీఎస్‌బీసీఎల్‌లో 2019-24 మధ్య కాలంలో జరిగిన అక్రమాలకు సంబంధించి ఈ ఆస్తులను అటాచ్ చేయాలని నిర్ణయించింది. తిరుపతి సమీపంలోని రేణిగుంట, మంగళం, సెట్టిపల్లి గ్రామాల పరిధిలో విలువైన భూములను కుల్లాయప్ప పేరిట నిందితులు రిజిస్టర్ చేయించారు. వసుప్రాధ ఎన్‌క్లేవ్ లేఅవుట్‌లో ఉన్న ప్లాట్లనూ కొనుగోలు చేసినట్టు గుర్తించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి వైకుంఠపురంలోని ఓ నివాస భవనాన్ని కుల్లాయప్ప పేరిట రిజిస్టర్ చేయించారు నిందితులు. బాలాజీ యాదవ్‌కు గిఫ్ట్ డీడ్‌ల పేరిట రిజిస్టరైన ఆస్తులకూ అక్రమ మద్యం ఆదాయం నుంచే సొమ్ములు చెల్లించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా.. తిమ్మాయగుంట, వెంకటాపురం గ్రామాల్లోని ఓపెన్ ప్లాట్‌ను మద్యం అక్రమ నగదుతో కొనుగోలు చేశారని సమాచారం. అలాగే గాంధీపురం పంచాయతీ పరిధిలో గల ఓ ఇంటినీ 2021లో అక్రమార్జనతోనే కొనుగోలు చేసినట్టు అధికారులు గుర్తించారు. తదనుగుణంగా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్‌లు. ఈ ఆస్తులపై తదుపరి లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు జరగకుండా చర్యలను తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసారు.

---



# 13, 14, 15 తేదీల్లో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

- అన్ని ఏర్పాట్లు చేపట్టాలి
- జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

అనంతపురం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త బ్యూరో: శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల కోసం ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలపై సంబంధిత శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 13, 14, 15వ తేదీలలో గుత్తి మండలం సేవాగఢ్‌లో నిర్వహించే శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను సజావుగా నిర్వహించాలన్నారు. వేడుకల కోసం పోలీస్ వారు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు, ట్రాఫిక్, బ్యారికేడ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్టీసీ నుంచి బస్సులు ఏర్పాటు చేయాలని, గుత్తి గుంతకల్లు మధ్యలో సేవాగఢ్ వద్ద స్టాపింగ్ ఏర్పాటు చేయాలని, అవసరమైతే అదనపు బస్సులను కేటాయించాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సేవాలాల్‌కు వెళ్లే రోడ్‌లో జంగిల్ క్లియరెన్స్ చేయాలని, గుంతలు పూడ్చాలని, పార్కింగ్ ప్రాంతాలను శుభ్రం చేయాలని, అవసరమైనచోట బ్యారికేడింగ్ చేయాలని, శానిటేషన్ జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఎస్పిడిసిఎల్ ఆధ్వర్యంలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని, ఆర్డబ్ల్యుఎస్ శాఖ నుంచి తాగునీటిని అందుబాటులో ఉంచాలని, టాయ్ లెట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫైర్ సేఫ్టీ పాటిస్తూ స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి మూడు రోజులపాటు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, 104, 108 వాహనాలను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని శాఖల అధికారులతో డిటిడబ్ల్యుఓ సమన్వయం చేసుకోవాలని, జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గుంతకల్లు ఆర్డీఓ ఏబీవీఎస్పి శ్రీనివాస్, గుంతకల్లు డిఎస్పీ శ్రీనివాస్, డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, శ్రీ సేవాలాల్ మహారాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు కేశవనాయక్, ట్రస్ట్ నుంచి అశ్వత్థనాయక్, బాలానాయక్, డీఎల్డిఓ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ శ్రీనివాసులు, ఆర్.అండ్.బి డిఈఈ సత్యనారాయణ, గుత్తి, గుంతకల్లు తహసీల్దార్లు పుణ్యవతి, రమాదేవి, జిల్లా టూరిజం అధికారి జయకుమార్ బాబు, ఆర్‌అండ్బి ఎస్ఈ మురళీకృష్ణ, ఏపీఎస్‌ఆర్టీసీ డిఎం ఖాజావలి, గుత్తి పిఎస్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామారావు, ఎంపీడీవో ప్రభాకర్, పీఆర్ ఏఈఈ మల్లేష్ నాయక్, ఎస్పిడిసిఎల్ డిఈ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

---



# రూఫ్ టాప్ సోలార్ పై విస్తృత అవగాహన

## ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్

తిరుపతి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన (పిఎంఎస్ జియంబివై) పథకంలో భాగంగా యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ (యుఎల్ఎ) మోడల్ ద్వారా సోలార్ రూఫ్ టాప్ అమలు అంశంపై వినియోగదారులకు విస్తృత అవగాహక కల్పిస్తున్నామని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతిలోని ఓ హోటల్లో నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ ,ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ (ఎడిబి), నాబార్డ్, నెడ్క్యాప్,ఎస్పిడిసిఎల్ సంయుక్త ఆధ్వర్యంలో పిఎంసూర్య ఘర్ పథకంపై విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులు, గుత్తేదారుల్లో అవగాహన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ మాట్లాడుతూ పిఎంసూర్యఘర్ పథకం ద్వారా గృహాల్లో స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా 2024లో కేంద్ర ప్రభుత్వం, ఎంఎన్ఆర్ఇ ద్వారా ప్రారంభించిన జాతీయ రూఫ్ టాప్ సోలార్ పథకం ప్రపంచంలో అతిపెద్ద గృహ రూఫ్ టాప్ సోలార్ పథకంగా ఏర్పాటైందని తెలిపారు. ప్రతినెలా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ద్వారా కోటి గృహాలకు సోలార్ విద్యుత్తును అందించడమే లక్ష్యంగా ఈ పథకం తీర్చిదిద్దుతోందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును పొందేందుకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ మోడల్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతోందని, సంస్థ పరిధిలో 7.48 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల్లో 2.07 లక్షల వినియోగదారులకు ఈ పథకం కింద రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో 415.66 మెగావాట్ల సోలార్ సిస్టమ్స్ సామర్థ్యానికిగానూ నెడ్క్యాప్ టెండర్ ప్రక్రియను పూర్తి చేసి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు 17 ఇంజనీరింగ్, ప్రొక్యూర్మెంట్ ,కన్స్ట్రక్షన్(ఇపిసి) గుత్తేదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ పథకం కింద 25 యేళ్ళపాటు ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు అందుబాటు ధరతో విద్యుత్తును సరఫరా చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి సబ్సిడీ భారాన్ని తగ్గించడమే లక్ష్యమన్నారు. ప్రతి లబ్దిదారునికి 2 కిలోవాట్ల సామర్థంతో రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. సోలార్ సిస్టమ్స్ నిర్వహణపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

---

### జగన్ గుంటూరు పర్యటనలో

# నిబంధనల ఉల్లంఘనపై 5 కేసులు నమోదు

విజయవాడ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: జగన్ గుంటూరు పర్యటనలో నిబంధనల ఉల్లంఘనపై 5 కేసులు నమోదయ్యాయి. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్సీపీ నేత దొంతిరెడ్డి వేమారెడ్డిపై, పెదకాకాని పీఎస్ లో నూనె ఉమామహేశ్వరరెడ్డిపై కేసులు పెట్టారు. నగరపాలెం స్టేషన్‌లో నూరి ఫాతిమాపై, నల్లపాడు స్టేషన్‌లో బలసాని కిరణ్‌కుమార్‌పై, పట్టాభిపురం స్టేషన్‌లో అంబటి మురళీకృష్ణపై పోలీసులు కేసులు కట్టారు. పోలీస్ యాక్ట్30 అమల్లో ఉండగా రాజకీయ ర్యాలీలకు అనుమతి లేదని ముందుగానే స్పష్టంచేశామని పోలీసులు తెలిపారు. అయినా పట్టించుకోకుండా వైఎస్సార్సీపీ నాయకులు నిబంధనలు ఉల్లంఘించి ప్రదర్శన చేశారన్నారు. దీనివల్ల జాతీయ రహదారితో పాటు గుంటూరు నగరంలోని పలు కూడళ్లలో ట్రాఫిక్ స్తంభించింది. జనం తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఈ అంశాలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకుని అయిదు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

---

# అమరావతి పనుల్లో వేగం పెంచాం

- మార్చి నాటికి ప్రభుత్వ భవనాలు పూర్తి
- పురపాలక శాఖ మంత్రి నారాయణ



సచివాలయం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: రాజధాని అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, నిర్ధేశించిన గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం పకడ్బందీగా ముందుకు వెళ్తుందని పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. శుక్రవారం రాజధాని ప్రాంతంలో పర్యటించిన ఆయన మంత్రుల బంగ్లాలు, జీఏడి టవర్ డయాగ్రిడ్ ఫ్యాబ్రికేషన్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజధానిలో ప్రభుత్వ అధికారుల కోసం నిర్మస్తున్న నివాస సముదాయాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని మంత్రి తెలిపారు. మొత్తం 4,026 ఇళ్ళల్లో, 3500 ఇళ్ళను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి అందుబాటులోనికి తీసుకొస్తామని స్పష్టం చేశారు. రాజధానిలో కేవలం రోడ్లే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు మంత్రి వివరించారు. 350కిమీ మేర ట్రంక్‌రోడ్లు, 1500కిమీ లేఅవుట్ రోడ్ల పనులు కొనసాగుతున్నాయి. రోడ్లతో పాటే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్, సీవరేజ్, విద్యుత్ లైన్ల పనులు ఒకేసారి జరుగుతున్నాయి. దీని వల్ల భవిష్యత్తులో రోడ్లను తవ్వాల్సిన అవసరం ఉండదని ఆయన తెలిపారు.

### స్పోర్ట్స్ సిటీ అండ్ ఎయిర్ పోర్టు నిర్మాణం

అమరావతిలో నిర్మించబోయే స్పోర్ట్స్ సిటి ఎయిర్ పోర్టు ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. ఇందుకోసం ఖతార్ లండన్ నగరాల్లో పర్యటించి, అక్కడి అత్యాధునిక సాంకేతికత, నమూనాలను అధ్యాయనం చేశామన్నారు. ల్యాండ్ పూలింగ్ విషయంలో రైతులకు ఉన్న ఇబ్బందులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి నారాయణ చెప్పారు. గ్రామాల వారీగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ పనులను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. అమరావతి రైల్వే స్టేషన్ నిర్మాణానికి ఎంత భూమి అవసరమనే విషయంపై రైల్వే శాఖ నుండి ఇంకా స్పష్టత రావాల్సి ఉందని ఆయన వివరించారు. మంత్రుల బంగ్లాలు, జిఏడి టవర్ పనులు పరిశీలన, మార్చి నాటికి పూర్తిస్థాయిలో ప్రభుత్వ అధికారుల భవనాలు పూర్తి కానున్నాయి. 1850కిమీ మేర రోడ్ల నిర్మాణంతో పాటు ఖతార్, లండన్ తరహాలో స్పోర్ట్స్ సిటీ, ఎయిర్ పోర్టు ప్లానింగ్ చేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు.

---



మిల్క్ ప్రాడక్ట్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న సిఎం సతీమణి నారా భువనేశ్వరి

# మహిళలు ధైర్యంతో ముందడుగు వేయాలి

## - సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి

శాంతిపురం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: మహిళలు ధైర్యంతో ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ముందడుగు వేయాలని సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజి ంగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని గుండిశెట్టిపల్లిలో రెస్కో డైరెక్టర్ అనసూయ ఏర్పాటుచేసిన ఛరిష్మా మిల్క్ ప్రాడక్ట్స్ యూనిట్‌ను నారా భువనమ్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మహిళలను ఉద్దేశించి ప్రస ంగించారు. సిఎం చంద్రబాబునాయుడు మహిళల అభ్యున్నతికై ఎన్నో కార్యక్రమాలకు కుప్పంలో శ్రీకారం చుట్టారన్నారు. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనసూయ యాభై లక్షల రుణం తీసుకుని మిల్క్ ప్రాడక్ట్ యూనిట్ ప్రారంభించారని ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మహిళలు బ్యాంకుల ద్వారా పొందే రుణాలు సద్వినియోగం చేసుకుని వాటిని తిరిగి స క్రమంగా చెల్లిస్తే మరింత రుణాలు అందిస్తారన్నారు. తాను గతంలో సాధారణ గృహిణిగా ఉండేదానినని అనంతరం సిఎం చంద్రబాబు చొరవతో హెరిటేజ్ బాధ్యతలు తీసుకుని తాను ముందడుగు వేసినట్లు పేర్కొన్నారు.

మార్చి నెలలో తాను కుప్పంలో పర్యటిస్తానన్నారు. కార్యక్రమాల్లో ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నేతలు జనార్ధనరెడ్డి, మణి, రాజేంద్ర, చంద్ర, బాల మురుగన్, శ్రీనివాసులు, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాఫ్తాన్ స్టైల్‌గా..



ఫ్యాషన్ ఫ్యాషన్

చలి ఒక్కసారిగా తగ్గిపోయి.... ఎండ ప్రభావం మొదలైంది కదూ! ఎండంటే చెమటలు, ఉక్కబోత, ఇలాంటప్పుడు మన మనసు ఆహ్లాదకరంగా వైపే మళ్లుతుందంటే కాదంటామా? అలా ఇప్పుడు ఎక్కువమందిని ఆకర్షిస్తున్నమేటో తెలుసా... కాఫ్తాన్లు. ఫ్యాషన్ ప్రపంచాన్ని కుదిపేసిన స్టైల్ ఇది. కానీ వీటి ఉనికి మాత్రం వందల ఏళ్ల క్రితం నుంచే ఉంది. మధ్యప్రాచ్యం, ఆసియాల్లో ఎక్కువగా కనిపించే ఫ్యాషన్ ఇది. పైనుంచి కిందివరకూ ఉండేది. రానురానూ దానిలో మార్పులొచ్చాయి. తారల వల్ల కాఫ్తాన్ చాలామందికి పరిచయ మైంది. మెటర్నిటీ సమయంలో, బీచ్ వెకేషన్లలో వాటిల్లో మెరిసి పాపులారిటీ తెచ్చారు. దీంతో అమ్మాయిలూ మనసుపడ్డారు. ఇలా ప్రత్యేక సందర్భాలలో సరే! కానీ రోజువారీ కష్టమంటారు చాలామంది. కాఫ్తాన్... సౌకర్యవంతం. చూడటానికీ స్టైల్‌గా ఉంటుంది. ఎలాంటి శరీరాకృతికైనా నప్పుతుంది. సమస్యల్లా పొడవుగా ఉండటమే. కాస్త డిజైన్లు మారినా.. తుది రూపం మాత్రం అదే! పైగా ఇప్పుడు షార్ట్ ఫ్యాషన్ ట్రెండ్ అందుకే ప్యాడ్ స్టైల్ కో ఆర్డ్ సెట్ల హవా నడుస్తోంది. అలాంటప్పుడు ఈ పొడుగు ప్యాషన్‌ని మెచ్చేదెవరు? అలాగని దృష్ట్యా పక్కన పెట్టాలి అనిపిం చదు. ఈ మీమాంసని గుర్తించారేమో లక్షణాలు. కోర్డ్ సెట్లకి కాఫ్తాన్ని జోడించారు: ట్రెడీ డిజైన్లలో కూడా తీసుకొచ్చారు. బాగా ఉన్నాయి కదూ! రోజు వారీకే కాదు... వేడుకలకి తగ్గట్టుగా తీర్చి దిద్దారు. అంటే స్టైల్‌కి జోడి అన్నమాట. ఇవి వేసు కుంటే పెద్దగా యాక్సెసరీల అవసరమూ ఉండదు. అయినా మెరిసిపోవొచ్చు.



# నిస్సహాయ మహిళలకు చేయూతనిస్తూ..



బిడ్డ పుట్టిన 14 రోజులకే ఆమె జీవన పోరాటం మొదలైంది. శారీరక, మానసిక సంఘర్షణలతో కుమిలిపోలేదామె. పరిస్థితులతో పోరాడటం నేర్చుకుంది. తన కాళ్లమీద తను నిలబడటమే కాకుండా... తనలాంటి నిస్సహాయ మహిళలకు చేయూతనిస్తోంది కారుణ్య గుణవతి. ఆమె గురించి తెలియాలంటే....

సమస్యల నుంచే చాలాసార్లు పాఠాలు నేర్చుకుంటాం. అవే భవిష్యత్తులో మన తీరు తెన్నులు ఎలా ఉండాలో నిర్దేశిస్తాయి. నా విషయంలోనూ అదే జరిగింది. మాది తెన్కాశీ పేరు చూశపెట్టి గ్రామం. నాన్న కరుణాకర్ పౌవ్రాజ్.. ఓ వర్క్‌షాప్‌లో పనిచేసేవారు. అమ్మ దేవా అన్బు భాగ్య సెల్వి మేము ఇద్దరం పిల్లలు. నాన్న జీతంతోనే ఇల్లు గడిచేది. దాంతో చదువుకోవడానికి కష్టమైంది. పదో తరగతి పూర్తవుతూనే నేను పార్టమ్ ఉద్యోగాల కోసం వెతకడం మొదలు పెట్టా. కానీ మేము ఉండే ప్రాంతంలో ఉద్యోగావకాశాలు చాలా తక్కువ. అరపిల్లల్ని చేర్చుకోవడమూ అరుడే అందుకే ట్యూషన్లు చదువుకునేదాన్ని, అలా చెబుతూ ఎలక్ట్రానిక్స్ పూర్తిచేశా. ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రెజెంటేషన్ ఉద్యోగం సంపాదించా. కెరియర్లో వృద్ధి కోసం దూరవిద్యలో ఎంబీఏ కూడా పూర్తిచేశా. పని, చదువు ఇవే లోకంగా గడిపా. అంతలోనే పెళ్లి అన్నారు. బాధ్యత కదా అని పెళ్లికి ఒప్పుకొన్నా. అది మొదలు అన్నీ సమస్యలే. ఆర్థికంగా ఎన్నో కష్టాల్ని ఎదుర్కొన్నా. ప్రసవమైన 14 రోజులకే ఉద్యోగ వేటలో పడ్డాను. అన్నీ విఫలయత్నాలే. అయినా పట్టుదలగా 2021లో 'రఫెల్ క్రియేటివ్స్'అంకురాన్ని స్థాపించింది... సంస్థలు, ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్, ప్రొడక్ట్ రీచ్ వంటి వాటిలో సేవలందించడం మొదలుపెట్టా. రెండు సెకండ్ హ్యాండ్ ల్యాప్టాప్లతో, ఇద్దరు వినియోగదార్లతో నా ప్రయాణం మొదలైంది. ఏడాది గడవకముందే విదేశీ క్లయింట్లను సంపాదించుకునే స్థాయికి చేరుకున్నా. ఇప్పుడు నెలకు రూ.45 లక్షలు సంపాదిస్తున్నా. ప్రస్తుతం రఫెల్ క్రియేటివ్స్‌కి 500మంది స్థిర వినియోగదార్లు ఉన్నారు. 15మందికి ఉపాది కల్పిస్తున్నా.

**ఊహించని మలుపు...** 2023 నుంచి స్థానిక మహిళలకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ప్రారంభించాం. 'కొట్రవై' అనే సంస్థను స్థాపించి దాని ఆధ్వర్యంలోనే కార్యకలాపాలు చేయడం మొదలు పెట్టాం. ఇది నాకు అదనపు భారం అవుతుందని తెలుసు! కానీ మహిళలు, అమ్మాయిలు ఆర్థిక సాధికారత సాధించాలనే లక్ష్యంతో పనిచేయడం మొదలు పెట్టా. ప్రస్తుతం ఈ సంస్థ ఆధ్వర్యంలో టెంకాయ చిప్పలతో గృహాలంకరణ వస్తువులు, టెర్రాకోట నగలు, హెల్త్ మిక్స్ లాంటి ఆహార ఉత్పత్తులు, అద్దాల ఫ్రేమ్‌లు, వాటర్ బాటిళ్లు తయారుచేస్తున్నారు. వీటిని నిర్వహిస్తున్న మా వెబ్‌సైట్ ద్వారా అమ్ముతున్నాం. విదేశాలకీ ఎగుమతులు చేస్తున్నాం. ఈ సేవల్ని ఇంకా విస్తరించే లక్ష్యంతో అడుగులు వేస్తున్నా.

# గరుత్మంతుడు



**దయ తోటి మనుషులకే పరిమితం కాదు** పశు పక్ష్యాదులపట్ల కూడా అదే భావన కలిగుండాలి. దయాగుణానికి మరో రూపం జీమూతవాహనుడు. ప్రమాదకరమైన పాముల కోసం తనను తాను ఆత్మార్పణ చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. ఇతడోరోజు పర్వతప్రాంతంలో విహరిస్తుండగా ఎముకల గుట్ట కనిపించింది. అక్కడో వృద్ధురాలు ఏడుస్తోంది. అవి పాముల ఎముకలనీ, గరుత్మం తుడు నిత్యం పాములను వేటాడుతుంటే భయంతో బతకలేక రోజుకొకటి ఆహారంగా వెళ్లేలా గరుత్మంతునితో ఒప్పందం కుదుర్చు కున్నాయని, ఆ రోజు తన పుత్రుడు శంఖచూడుడి వంతనీ చెప్పిందామె. ఆ తల్లి దుఃఖాన్ని చూడలేక గరుత్మంతునికి ఆహారంగా వెళ్లాడుజీమూతవాహనుడు. సాటి ప్రాణుల పట్ల అంతటి కరుణ చూపిన అతణ్ణి చూసి పశ్చాత్తాపం చెందాడు గరుత్మంతుడు. పైగా స్వర్గం నుంచి అమృతాన్ని తెచ్చి ఎము కలగుట్టగా ఉన్న నాగుల్ని బతికించాడు. జీమూతవాహనుని దయ ఆత్మార్పణ రూపంలో వ్యక్తమై, గరుత్మంతుని లోని ప్రతీకారాన్ని దయగా మలిచింది.సృష్టిలోని సకల జీవులూ సామాన్యంగానే జీవిస్తాయి. మనిషి మాత్రం కోరికల పుట్ట. తన అవసరాల కోసం అన్ని ప్రాణుల్ని ఉపయోగించుకుం టాడు. నిజానికి బుద్ధిజీవులమైన మనం చుట్టూ ఉన్న ప్రాణుల అవసరాలను తీర్చేం దుకు ప్రయత్నించాలి. దీన్నే సంప్రదాయం భూతయజ్ఞంగా పేర్కొంది. ఇది పంచ మహా యజ్ఞాల్లో ఒకటి. మనం భోజనం చేసేటప్పుడు కొంత ఆహారాన్ని పక్కకు తీసి మంత్రపూర్వకంగా భోజనం చేయాలి. తిన్న వెంటనే పక్కనుంచిన ఆహారాన్ని తీసుకెళ్లి ఇంటి బయట శుభ్రమైన స్థలంలో అమంత్రకంగా ఇతర ప్రాణుల కోసం ఉంచాలి. ఈ భూత దయను పెంపొందించుకోవాలి.దయాగుణం ఎంత మహోన్నత మైనప్పటికీ దుర్మార్గుల పట్ల సముచితంకాదు.

# కుట్టు ధాన్యం



చిరు ధాన్యాల్లో కుట్టు కొంచెం భిన్నమైంది. వీటిని బక్వీట్ మిల్లెట్స్ అంటారు. ఇవి జమ్మూ, కశ్మీర్, కార్గిల్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి ప్రాంతాలకు ప్రసిద్ధి. మనకూ్కడా అందుబాటులో ఉన్నాయి. వీటిలో విటమిన్ బి6, కాల్షియం, మాంగనీస్, మెగ్నీషియం, పొటాషియం, భాస్వరం, సెలీనియం, ఐరన్, కాపర్, జింక్, రిబోఫ్లేవిన్, ఫోలేట్.. ఇలా శరీరానికి మేలు చేసేవెన్నో ఉన్నాయి. శక్తినిచ్చే ఉపవాస సమయాల్లో వెంటనే కొందరు ఈ ధాన్యాన్ని ఎంచుకుంటారు. అనేక ప్రయోజనాలున్నాయి..✦ గుండె జబ్బుల నుంచి దూరంగా ఉంచుతాయి. ✦ రక్తపోటు అదుపులో ఉంటుంది. హైపర్టెన్షన్ రాదు.✦ రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తుంది. ✦ జీర్ణ ప్రక్రియ సాఫీగా ఉంటుంది. ✦ గ్లూటెన్ సెన్సివిటీ సమస్యతో బాధ పడుతున్న వారికి కుట్టు ధాన్యం మంచి ప్రత్యామ్నాయం. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లను నివారిస్తాయి. ✦ ఊబకాయం రాదు.✦ చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ మిల్లెట్ పిండితో రొట్టె, ఇడ్లీ, పరోటా, పాయసం, పాస్తా, ప్యాన్‌కేక్, కారప్పూస లాంటి వంటకాలు చేయొచ్చు. కుట్టు రవ్వతో సులువుగా ఉప్మా చేసుకోవచ్చు.

# ఆరోగ్య భాగ్యం: తీపి రుచి-2



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

**లాభాలు:** ఇది చర్మం, వెంట్రుకలపై ప్రభావం చూపుతుంది. ఇది గాయాల్ని నయం చేస్తుంది. ఇది ఇమ్యూనిటీని పెంపొందిస్తుంది. మీరు బరువు పెరుగుతారు. ఇది పిల్లలకి, పెద్దలకి మంచిది. దీనివల్ల వారి నోటియందు లాలాజలం విడుదలై నోరు తడిగా మారుతుంది. ఇంద్రియాలకి తృప్తినిస్తుంది. ఇది శరీరానికి న్యూట్రియెంట్ ఫ్లూయిడ్స్ ని పెంపొందిస్తుంది. శరీరంలోని టాక్సిన్స్‌ని తగ్గిస్తుంది. శరీరానికి గట్టిదనాన్ని, శరీరంలో కణాల్ని పెంపొందిస్తుంది. వీరిలో రక్తం, మాంసం, ఎముకలు, శుక్రం నివృద్ధి చెందిస్తుంది. శరీరానికి బలాన్నిస్తుంది. దప్పికను తీరుస్తుంది. ఇది వెంట్రుకలకి, కంఠంకు, ముక్కు, నోరు. పెదవులు, నాలుకకు మంచిది. తీపి వస్తువులు ఎక్కువగా తీసుకోవడం వల్ల కలిగే దుష్ఫలితాలు: స్థూలకాయం, సోమరితనం అధిక నిద్ర, ఆహారం తీసుకోవాలనిపించదు. దగ్గు, జలుబు, అజీర్ణం, కడుపుబ్బరం వాంతి, బోధకాలు, నేత్ర, ముక్కు కఫ వ్యాధులు రావడం, శరీరం బరువుగా ఉండడం, ఆయాసం, మలబద్ధకం,కఫం ఎక్కువవడం వంటి లక్షణాలతో పాటు మెడలో గ్రంథులు వాయడం. సృహ తపనపడం, కడుపులో జఠరాగ్ని పెరగడం తీపిపై అధిక ఇష్టం ఏర్పడడం, మూడ్ ఛేంజ్ ఉండడం వంటి సైడ్ ఎఫెక్ట్స్ ఏర్పడతాయి.

**జాగ్రత్తలు :** వీరు ఆహారంలో ఫైబర్ ఎక్కువగా తీసుకోవాలి. • ఎక్సర్‌సైజ్ రెగ్యులర్‌గా చేయాలి. • నీళ్ళు ఎక్కువగా తీసుకోవాలి. • సరైన నిద్ర అవసరం. • స్ట్రెస్, టెన్షన్ లేకుండా చూసుకోవాలి. • చక్కెర లేని చూయింగ్‌గమ్స్‌ని నమలాలి. బి.పి. షుగర్, థైరాయిడ్, గుండె జబ్బులు, ఫ్యాటీ లివర్, స్ట్రోక్, బరువు పెరగకుండా, ఇన్‌ఫ్లమేషన్ రాకుండా చూసుకోవాలి. • నోటి పరిశుభ్రత చాలా ముఖ్యం. తీపికి బదులుగా కొన్ని సింథటిక్ చర్వన సమ్మేళనాలు సాచరిన్, సైక్లేమేట్స ఉపక్రలోజ్, నియోటామ్‌ల్ని ఆహార సంకలనాలుగా ఉపయోగిస్తారు. తీపి రుచికి గుర్తుగా జిలేబిని నేషనల్ స్వీట్ ఆఫ్ ఇండియాగా గురించారు. పండ్లలో కింగ్‌గామామిడి, ద్రాక్ష, గుర్తించారు. నేషనల్ చాక్లెట్ కేక్‌డేగా జనవరి 27ని పరిగణించారంటే అధికంగా ఆహారాన్ని తినేటప్పుడు గుర్తించబడే ప్రాథమిక రుచిగా తీపికి ఉన్న ప్రాముఖ్యతే కారణం. దీన్ని ఎక్కువగా లావు, ఆయాసం, ఆమ్లం, కఫం ఉన్నవారు మానివేయాలి. రుచి మొగ్గలు శరీరంలోని చక్కెరకు మెదడులోని నిర్దిష్ట ప్రాంతాలకు సమచారాన్ని అందించడంలో ఇన్సులిన్, డోపమైన్, గ్రేలిన్, లెప్టిన్ వంటి కోరకలకు దోహదపడే హార్మోన్లని ప్రేరేపిస్తాయి. కాబట్టి భోంచేసేటప్పుడు మొదట స్వీట్ తినాలి. తీపి పదార్థాలు ఎక్కువగా తింటే డైజేషన్ పవర్ తగ్గడం లైపోమా, శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా, రైనైటిస్:, జ్వరం, కడుపుబ్బరం, వాంతులు, స్వరంలో తేడా, కడుపులో క్రిములు ఏర్పడడం, వంటి వ్యాధులు, ట్యూమర్స్ ఏర్పడడం వంటి లక్షణాలు ఏర్పడతాయి. బేరివయయం క్లోరైడ్, లెడ్ అసిటేట్‌తో సహా అకర్బన సమ్మేళనం తీపిగా ఉంటాయి.కొన్ని రకాల ఆకులు (జిజిఫిన్, చైనీస్ జుజుబే ఆకుల వల్ల) కూడా తియ్యగా ఉంటాయి. నీరులోని కాల్షియం, ఐరన్ ఆయాన్ల వల్ల నీటినకి తయ్య రుచి వస్తుంది. తీపి ఎక్కువగా తినేవారు తీపికి విరుగుళ్ళగా లవంగాల్ని వాడాల్సి ఉంటుంది.

# 'పిఠాపురంలో' డా.రాజేంద్రప్రసాద్



పద్మశ్రీ పురస్కారం తర్వాత విడుదలయ్యే డా. రాజేంద్రప్రసాద్ మొదటి చిత్రం 'పిఠాపురంలో' ప్రేయసి రావే, అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్" వంటి చిత్రాలతో దర్శకునిగా మంచి గుర్తింపు సంపాదించారు మహేష్ చంద్ర . తాజాగా ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రం"పిఠాపురంల్లో. దీనికి ఉపశీర్షిక ' అలా మొదలైంది' .ఈ చిత్రంలో నటకిరీటిడా. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ ప్రధాన పాత్రల్లో నటించారు. అలాగే దాసరి పద్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా, ర్పి. పవన్ కళ్యాణ్, J.D.V ప్రసాద్, K.A. పాల్ రాము, జబర్దస్త్ శేషు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మహేష్ చంద్ర సినిమా టీమ్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళీ (గోదారి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తయిన ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం" అని తెలిపారు.

# 'మన శంకరవర ప్రసాద్ గారు' ప్రపంచవ్యాప్త వసూళ్లు రూ.375 కోట్లు



25 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా 375 కోట్లకు పైగా వసూలు చేసి ఆల్‌టైమ్ ఇండస్ట్రీ రీజినల్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన మెగాస్టార్ చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్ గారు' సంక్రాంతి పండుగ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన మెగాస్టార్ చిరంజీవి ' మన శంకర వర ప్రసాద్ గారు' బాక్సాఫీస్ సంచలనంగా మారింది. ఈ చిత్రం థియేటర్లలో విజయవంతంగా 25 రోజులు పూర్తి చేసుకుని, అన్ని ప్రాంతాలలోనూ అద్భుతంగా కొనసాగుతోంది. ఈ చిత్రం ఇప్పటికే ఎన్నో రికార్డులను బద్దలు కొట్టింది.ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు, ఈ చిత్రంలోని వినోదం, భావోద్వేగం, చిరంజీవి మాగ్నటిక్ పెర్ఫార్మెన్స్ కోసం థియేటర్లకు పోటెత్తుతున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో "MSG" నాల్గవ వారంలో కూడా తన విజయ పరంపరను కొనసాగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 375 కోట్ల మార్కును దాటిన ఈ చిత్రం ఇప్పుడు ఆల్‌టైమ్ రీజినల్ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచి, అద్భుతమైన వసూళ్లను నమోదు చేస్తూనే ఉంది. ఇది చిరంజీవి, అనిల్ రావిపూడి ఇద్దరికీ అత్యధిక వసూళ్ల సాధించిన చిత్రంగా నిలిచింది. ముఖ్యంగా, ఇది బుక్‌మైషోలో అత్యధిక టిక్కెట్ల అమ్మకాలతో కొత్త రీజినల్ రికార్డును కూడా నెలకొల్పింది. విదేశాలలో 3.5 మిలియన్ డాలర్ల మైలురాయికి చేరువలో ఉంది. విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో నటించిన "MSG" చిత్రం మరో మైలురాయిని చేరుకోవడానికి సిద్ధమోతోంది. 400 కోట్ల మార్కును చేరుకునే దిశగా దూసుకుపోతోంది.

తెర

# 'వెంకట్రామయ్య గారి తాలూకా' టైటిల్ పోస్టర్



సీనియర్ నటుడు మురళీధర్ గౌడ్, సీనియర్ నటి సుధ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ' వెంకట్రామయ్యగారి తాలూకా' జయమ్మ పంచాయతీ' మూవీ ఫేమ్ దినేష్ కుమార్ హీరోగా, ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా నటించారు. తండ్రి, పిల్లల మధ్య భావోద్వేగాల నేపథ్యంలో వారి వారి బాధ్యతలను తెలియజేసేలా రూపొందిన ఈ సినిమాను డైరెక్టర్ సతీష్ ఆవాల తెరకెక్కిస్తున్నారు. ఈ సందర్భంగా సీనియర్ నటుడు మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ..ఈ చిత్రంలో వెంకట్రామయ్య గారు పాత్రను నేను పోషించా. అని చెప్పారు.సీనియర్ నటుడు కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా మంచి కుటుంబ కథా చిత్రంగా వస్తోంది. సెంటిమెంట్ పరంగా, అన్నిరకాలుగా మూవీ బాగుంది. హీరో దినేష్ కుమార్ మాట్లాడుతూ."ఈ సినిమా అన్ని వర్గాల వారు చూడదగ్గ చిత్రం. కుటుంబ సమేతంగా అందరూ చూడాలని కోరుతున్నా. అన్నారు.నిర్మాత కోమలి మాట్లాడుతూ."సింగర్ అయిన నేను ఈ సినిమాతో నిర్మాతగా మారాను. ఈ సినిమాలో నటించిన అందరూ నాకు బాగా సపోర్ట్ చేశారు.

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీవిష్ణు ఎప్పటికప్పుడు వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను మెప్పిస్తూ వారి హృదయాల్లో తనదైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన తాజా చిత్రం "మృత్యుంజయ్". ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. రమ్య గున్నం సమర్పణలో లైట్‌బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్‌పై సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బ్లాక్ బస్టర్ మూవీ"సామజవరగమన" మూవీ తర్వాత శ్రీవిష్ణు, రేబా జాన్ జంటగా నటిస్తున్నారు."మృత్యుంజయ్"

# ' మృత్యుంజయ్'27న వరల్డ్ వైడ్ రిలీజ్




సినిమాను ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 27న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. పోస్టర్‌ను గమనిస్తే..పేపర్లతో నిండిన రోడ్డుపై నిలబడిన శ్రీవిష్ణుని గమనించవచ్చు. ఈ విజువల్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. పక్కా ప్రమోషన్స్, ఉత్కంఠతభరితమైన కథాంశంతో "మృత్యుంజయ్" మూవీ ప్రేక్షకులను మెప్పించేలా రూపొందుతోంది. హీరో శ్రీవిష్ణు స్టైల్లో ఆసక్తికరమైన థ్రిల్లర్ మూవీగా మృత్యుంజయ్ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్న ఈ చిత్రానికి విద్యాసాగర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా కాల భైరవ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. మనీషా ఎ.దత్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు.

# ' మీర్జాపురం రాణి కృష్ణవేణి' భగీరథ ప్రయత్నం



' మీర్జాపురం రాణి కృష్ణవేణి' అరుదైన భగీరథ ప్రయత్నం శకపురుషుడు, తారకరామం, నాగలాదేవి, మీర్జాపురం రాణి కృష్ణవేణి లాంటి పరిశోధనాత్మక గ్రంథాలను రచించిన భగీరథ డాక్టరేటుకు అర్హుడు , నేను యూనివర్సిటీ లో ఉంటే డాక్టరేట్ ఇప్పించేవాడిని అని తెలుగు సినిమా రచయితల సంఘం అధ్యక్షుడు పరుచూరి గోపాలకృష్ణ చెప్పారు. సీనియర్ జర్నలిస్ట్ రచించిన "మీర్జాపురం రాణి కృష్ణవేణి" పుస్తక పరిచయ కార్యక్రమం గురువారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా వచ్చిన గోపాల కృష్ణ మాటా ్డుతూ.. ఎన్. టి. రామారావు గారిని తెలుగు సినిమా రంగానికి పరిచయం చేసిన కృష్ణవేణమ్మ అంటే నాకు ఎంతో గౌరవం, అలాంటి కృష్ణవేణమ్మ జీవిత చరిత్రను వెలువ రించిన భగీరథను, నిర్మాత అనురాధాదేవిని నేను మనసారా అభినందిస్తున్నా అని చెప్పారు గోపాల కృష్ణ .దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్ మాట్లాడుతూ.. భగీరథ గారు చేయి తిరిగిన రచయిత, రామారావు గారి శత జయంతి సందర్భగా వెలువరించిన శకపురుషుడు, తారకరామం పుస్తకాలు ఆయన ప్రతిభకు నిదర్శనం. దర్శకుడు బి. గోపాల్ మాట్లాడుతూ.. భగీరథ నాకు ఇష్టమైన జర్నలిస్టు, రచయిత, ఆయన రాసిన పుస్తకాలన్నీ నేను చదివాను, రోజారమణి మాట్లాడుతూ.. కృష్ణవేణమ్మ అంటే నాకు ఎంతో అభిమానం, ఆమె మాలాంటి నటీమణులకు ఆదర్శం, ఆమె జీవిత కథను రచించిన భగీరథ గారిని, అనురాధాదేవి గారిని అభినందిస్తున్నా అని చెప్పారు. పుస్తక రచయిత భగీరథ మాట్లాడుతూ.. మీర్జాపురం రాణి కృష్ణవేణి పుస్తకాన్ని రాయడానికి ప్రధాన కారకురాలు శ్రీమతి అనురాధ దేవి, ఆమె సహకారం లేకపోతే ఈ గ్రంథం వెలువడేదే కాదు, కృష్ణవేణమ్మది విలక్షణమైన జీవితం, సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్యురాలుగా ఎదిగి ఒదిగిన మహానటి, జర్నలిస్ట్ మిత్రులంతా ఆత్మీయంగా సత్కరించారు.

# రికార్డులను బద్దలు కొట్టిన తేజ సజ్జా'మిరాయ్ '



సూపర్ హీరో తేజసజ్జా 'మిరాయ్' జైత్రయాత్ర కొనసాగిస్తోంది. థియేటర్లలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం, ఓటీటీ, ఇప్పుడు టెలివిజన్‌లోనూ సంచలన రికార్డులు సృష్టిస్తూ అరుదైన ఘనతను సాధించింది.కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో, People Media Factory బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన మిరాయ్ ఫాంటసీ, ఎమోషన్, యాక్షన్ తో థియేటర్లలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అనంతరం Hotstar ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోనూ యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల నుంచి భారీ వ్యూయర్‌షిప్‌ను దక్కించుకుంది. మిరాయ్ హిందీ వెర్షన్ కూడా 2025లో Star Gold లో ప్రసారమైన టాప్ రేటెడ్ చిత్రంగా నిలిచింది. దేశవ్యాప్తంగా సినిమాకు వచ్చిన ఈ స్పందన, సీక్వెల్‌పై ఆసక్తి, డిమాండ్‌ను మరింత పెంచింది. థియేటర్లు, ఓటీటీ, శాటిలైట్.. మూడు మాధ్యమాల్లోనూ ఘన విజయాలు సాధించిన మిరాయ్, తేజ సజ్జాను భారతీయ సినిమా పరిశ్రమలో మోస్ట్ ప్రామెసింగ్ యంగ్ స్టార్‌గా నిలబెట్టింది.



# బాక్సమ్ ఎలైట్‌లో దూసుకుపోయిన నీతు, ప్రీతి


**న్యూఢిల్లీ:** భారత బృందం బాక్సమ్ ఎలైట్ ఇంటర్నేషనల్ 2026లో తన అద్భుతమైన ప్రదర్శనను కొనసాగించి మొత్తం 19 పతకాలను నిర్ధారించింది. శుక్రవారం జరిగిన టోర్నమెంట్ 3వ రోజునీతు (51 కిలోలు), ప్రీతి (54 కిలోలు) వారి వారి వెయిట్ కేటగిరీలలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. పురుషుల పోటీలో జదుమణి సింగ్ (55 కిలోలు) మరోసారి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. పధాన కోచ్ శాంటియాగో నీవా నేతృత్వంలోని భారత మహిళల బృందం 12 పతకాలను ఖాయం చేయగా, పురుషుల జట్టు 7 పోడియం ఫినిషింగ్‌లను సెమీఫైనల్ దశకు చేరుకుందని నిర్ధారించింది. నీతు అద్భుతమైన ఫామ్‌లో కెనడాకు చెందిన మెకెంజీ రైట్‌ను 5:0 తేడాతో ఓడించింది. ప్రీతి స్పెయిన్‌కు చెందిన మరియా గొంజాలెజ్‌తో జరిగిన మ్యాచ్‌లో క్లినికల్ ప్రదర్శనతో, నిరంతర ఒత్తిడితో పోటీని నిర్దేశించిన తర్వాత రౌండ్ 3లో నిష్క్రమించవలసి వచ్చింది. పూనమ్ (54 కిలోలు) థాయిలాండ్‌కు చెందిన నట్నిచా చోంగ్‌ప్రోంగ్‌క్లాంగ్‌పై 5:0 తేడాతో మరో అద్భుతమైన విజయాన్ని నమోదు చేయగా, ప్రియా (60 కిలోలు) మరియు ప్రాంజల్ (65 కిలోలు) వరుసగా స్పెయిన్‌కు చెందిన లారా గలా మరియు చెక్ బాక్సర్ విక్టోరీ జిల్కోవాపై ఏకగ్రీవ విజయాలు నమోదు చేశారు. హోరాహోరీగా జరిగిన పోరులో కాజల్ (65 కిలోలు) కజకిస్తాన్‌కు చెందిన అక్బర్ ఇఖ్‌షనోవాను 4:1 తేడాతో ఓడించింది. పురుషుల పోటీలో, జదుమణి సింగ్ 55 కిలోల విభాగంలో చైనీస్ తైపీకి చెందిన పెంగ్ చియాఫెంగ్‌ను 5:0 తేడాతో ఓడించాడు. మహమ్మద్ హుస్సామ్ ఉద్దీన్ (60 కిలోలు) ఉక్రెయిన్‌కు చెందిన అలీ దాలీపై ఆధిపత్యం సంపాదించాడు.

# టీ20ల్లో మోస్ట్ డేంజర్ బౌలర్స్, బ్యాటర్లను తారెత్తించే వికెట్ టేకర్లు




**న్యూఢిల్లీ:** ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్‌లో అత్యధిక వికెట్లు తీయడం అనేది ఏ బౌలర్ కైనా గొప్ప విషయం. ఈ క్రికెట్‌లో ఒక్క వికెట్ అయినా మ్యాచ్ ఫలితాన్ని మార్చేయగలదు. అందుకే ఈ వికెట్ టేకర్లు ప్రపంచ కప్‌లలో అంత ప్రాముఖ్యతను కలిగి ఉంటారు. బ్యాటర్లు మొదటి బంతి నుంచే దాడికి దిగే ఈ పొట్టి ఫార్మాట్‌లో, వరుసగా ప్రపంచ కప్‌లలో క్రమంగా వికెట్లు తీయడం అనేది క్రికెట్‌లో అత్యంత కష్టం. కానీ ఈ మోస్ట్ డేంజరస్ బౌలర్ల ఎలైట్ జాబితాలో టాప్ 5లో ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా బంగ్లాదేకు చెందిన షకీబ్ అల్ హాసన్ అగ్రస్థానంలో నిలిచాడు. వేగం లేదా స్పిన్ కంటే తన నియంత్రణ, సమతుల్యత, తెలివైన ఆలోచనలతో ఆయన ఈ విజయాన్ని అందుకున్నాడు. అయితే, 2026 ప్రపంచ కప్ నుంచి బంగ్లాదేశ్ తప్పుకోవడంతో, ఆయన ఈ మెగా ఈవెంట్‌లో కనిపించడు. దాదాపు 20 ఏళ్ల కెరీర్‌లో ఆయన సగటు 20కి పైగా ఉండగా, ఎకానమీ రేటు 7 కంటే తక్కువగా ఉంది. ఈ జాబితాలో పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది రెండో స్థానంలో ఉన్నాడు. అఫ్రిది ఎప్పుడూ బ్యాటర్లపై దాడి చేయడానికి భయపడలేదు. గాలిలోకి బంతిని విసిరి, భారీ షాట్లు ఆడేలా బ్యాటర్లను ప్రేరేపించి వికెట్లు పడగొట్టేవాడు. ప్రత్యర్థి జట్టు పటిష్టంగా ఉన్న సమయంలో కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపు తిప్పడంలో ఆయన దిట్ట. అలాగే ఒత్తిడిలో బౌలింగ్ చేయడంలో శ్రీలంకు చెందిన లసిత్ మలింగ సిద్ధహస్తుడు. 38 వికెట్లతో ఆయన ఇప్పటికీ టీ20 ప్రపంచ కప్ చరిత్రలో అత్యంత భయంకరమైన బౌలర్లలో ఒకరిగా కొనసాగుతున్నాడు. ఆయన విలక్షణమైన బౌలింగ్ యాక్షన్, ప్రాణాంతకమైన యార్కర్లు ఎంతటి మేటి ఫినిషర్లనైనా ఇబ్బంది పెట్టేవి. ప్రపంచ కప్‌లో ఆయన ఒకే మ్యాచ్‌లో 5 వికెట్లు తీయడం అత్యంత మరపురాని ప్రదర్శనలలో ఒకటిగా నిలిచింది. ఈ జాబితాలో అత్యంత వేగంగా పైకి ఎదుగుతున్న శ్రీలంకు చెందిన బౌలర్ వానిందు హసరంగా.

కేవలం 19 మ్యాచ్‌లలోనే 37 వికెట్లు తీయడం ఆయన దూకుడుకు నిదర్శనం. 2026 ప్రపంచ కప్ పాక్షి కంగా శ్రీలంకలో జరగనుండటంతో, ఆయన ఈ జాబితాలో అగ్రస్థానానికి చేరుకునే అవకాశం ఉంది. రషీద్ ఖాన్ మాదిరిగానే, ఈయన కూడా అగ్రస్థానానికి చేరుకోవడానికి ఇంకా 14 వికెట్ల దూరంలో ఉన్నారు. చివరిగా అంతర్జాతీయ వేదికపై ఆఫ్ఘనిస్తాన్ తరఫున రషీద్ ఖాన్ ఒక గేమ్‌ఛేంజర్‌గా నిలిచారు. హసరంగాతో సమానంగా 37 వికెట్లతో ఆయన టాప్ 5లో కొనసాగుతున్నాడు. ఒత్తిడి సమయాల్లో బ్యాటర్లు ఆయన్ని ఎదుర్కోవడానికి చాలా ఇబ్బంది పడతారు.




ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో..

# ఆదర్శ రామ్‌కు కాంస్యం
# ప్రవీణ్, మణికంఠ విఫలం

**న్యూఢిల్లీ:** 2026 ఆసియా ఇండోర్ ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెటిక్స్ బృందం నిరాశపరిచింది. అయితే భారతదేశపు మొట్టమొదటి పురుషుల హైజంప్‌లో కాంస్య పతకాన్ని జె ఆదర్శ్ రామ్ గెలుచుకున్నాడు. శుక్రవారం చైనాలోని టియాంజిన్‌లో జరిగిన పోటీలో 28 ఏళ్ల ఆదర్శ్ ఫైనల్లో 2.19 మీటర్లు దూకి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకంతో చైనాలో భారత్ పతకాల ఖాతాను తెరిచాడు. అతడు 2.23 మీటర్ల మార్కును దాటడానికి ప్రయత్నించినా మూడు ప్రయత్నాలలోనూ విఫలమై కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. ఇక ప్రవీణ్ చిత్రవేల్ నాల్గవ స్థానంలో నిలవగా, మణికంఠ హోబ్లిధర్‌పై అనర్హత వేటు పడింది. ఈ సీజన్‌లో ప్రవీణ్‌కి మంచి ఆరంభం లభించలేదు. అతను పురుషుల ట్రిపుల్ జంప్ పోడియంను 16.22 మీటర్లు జంప్ చేసి, ముగ్గురు చైనా అథ్లెట్ల కంటే 4వ స్థానంలో నిలిచాడు. తొలుత ప్రవీణ్ 15.66 మీటర్ల జంప్‌తో ప్రారంభించి తరువాతి జంప్‌లలో అతను దానిని స్వల్పంగా పెంచాడు. చివరి ప్రయత్నంలో 16.22 మీటర్లు దూకాడు. మరోవైపు భారతదేశపు అగ్రశ్రేణి స్ప్రింటర్ మణికంఠ హోబ్లిధర్ పురుషుల 60మీటర్ల ప్రాథమికరౌండ్‌లో తప్పుడు ప్రారంభం కారణంగా అనర్హతను ఎదుర్కొన్నాడు. అధికారులు హీట్3లో పునఃప్రారంభించాలని పిలుపునిచ్చిన తర్వాత అతను నేరుగా రెడ్ కార్డ్ అందుకున్నాడు. దీనితో చైనాలో అతని ప్రచారం ఒక్క రేసు కూడా నడపకుండానే ముగిసింది.


# బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్.. భారత్ మహిళల, పురుషుల జట్లు ఓటమి




**న్యూఢిల్లీ:** 2026 బ్యాడ్మింటన్ ఆసియా టీమ్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ మహిళల, పురుషుల జట్లు క్వార్టర్ ఫైనల్‌లో నిష్క్రమించాయి. కింగ్‌డావోలో శుక్రవారం జరిగిన టైలో ఆతిథ్య చైనా చేతిలో భారత్ మహిళల జట్టు ఓటమిపాలైంది. మొదటి మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన తర్వాత డిఫెండింగ్ ఛాంపియన్లు 0–3 తేడాతో పరాజయాన్ని ఎదుర్కొన్నారు. ప్రపంచ 10వ ర్యాంకర్ గావో ఫాంగ్ జీతో సహా అగ్రశ్రేణి ఆటగాళ్లు లైనప్‌లో ఉండటంతో, చైనా భారతదేశానికి గట్టి ప్రత్యర్థిగా నిలిచింది. 17 ఏళ్ల తన్వి శర్మపై 21–9, 21–9 తేడాతో ఘన విజయం సాధించి చైనా తరఫున గావో మ్యాచ్‌ను ప్రారంభించింది. తద్వారా ఆతిథ్య జట్టుకు ఈ టైకు బలమైన ఆరంభం లభించింది. ఆ తర్వాత, ప్రపంచ నంబర్ 4 జోడీ జియా యి ఫ్యాన్–జాంగ్ షు జియాన్ 24–22, 21–17తో అగ్రస్థానంలో ఉన్న భారత ద్వయం ట్రీసా జాలీ–గాయత్రి గోపీచంద్‌లను ఓడించారు. తొలి గేమ్‌లో అదనపు పాయింట్లు సాధించడానికి 7 పాయింట్ల లోటు నుండి తిరిగి రావడానికి, ఉన్నత ర్యాంక్‌లో ఉన్న జంటపై యువ భారత జంట ధైర్యంగా పోరాడినా 22–24 తేడాతో దగ్గరగా ఓడి మ్యాచ్‌ను ముగించారు. మూడవ మ్యాచ్‌లో, రక్షిత శ్రీ సానుకూలంగా ప్రారంభించి, వెన్ జింగ్ జుతో జరిగిన తొలి గేమ్‌ను గెలుచుకుంది.

కానీ తరువాతి రెండు గేమ్‌లను 21–14, 15–21, 17–21 తేడాతో ఓడిపోయింది. అలాగే పురుషుల విభాగంలో కిదాంబి తన మ్యాచ్ గెలిచాడు. కానీ డబుల్స్ మరియు సింగిల్స్ లో ఆయుష్ శెట్టి తమ తమ మ్యాచ్ లలో ఓడిపోవడంతో భారత జట్టు 13 తేడాతో ఓటమిని ఎదుర్కొంది.

# జాగ్రెబ్ ఓపెన్..నీలం సిరోహికి రజతం



**న్యూఢిల్లీ:** జాగ్రెబ్ ఓపెన్ ర్యాంకింగ్ సిరీస్–2026, మహిళల 50 కిలోల విభాగంలో భారత్ అథ్లెట్ నీలం సిరోహి రజత పతకం గెలుచుకుంది. క్రొయేషియాలో జరుగుతున్న జాగ్రెబ్ ఓపెన్ ర్యాంకింగ్ సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన ఫ్రీస్టైల్ రెజ్లింగ్‌లో భారత రెజ్లర్లు 4 పతకాలు గెలుచుకుని పతకాల పరుగును కొనసాగించారు. మహిళల 50 కిలోల విభాగంలో భారత్ డబుల్ పోడియంను కైవసం చేసుకుంది, అనుభ వజ్ఞురాలైన నీలం సిరోహి రజత పతకాన్ని గెలుచుకోగా, ముస్కా న్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. కాంస్య పతక పోరు లో ముస్కాన్ పోలాండ్‌కు చెందిన అగాటా వాలెర్జాక్‌పై టెక్నికల్ సుపీరియారిటీ విజయాన్ని నమోదు చేయగా, నీలం ఫైనల్‌లో జపాన్‌కు చెందిన అండర్ 23 ప్రపంచ ఛాంపియన్ హరునా మోరికావా చేతిలో 2–5 తేడాతో ఓడిపోయింది. నీలం అంతకుముందు ఆల్‌ఇండియన్ సెమీఫైనల్‌లో ముస్కాన్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది.

# ఆర్‌బిఐ నిర్ణయాలతో మార్కెట్లలో జోష్..

## లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

## సెన్సెక్స్ 266, నిఫ్టీ 50 పాయింట్ల లాభం




**ముంబై, ఫిబ్రవరి 6:** రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య పరపతి విధాన సమావేశం నుంచి సానుకూల సంకేతాలు అందడంతో, భారత ఈక్విటీ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. 2027 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థానికి వృద్ధి అంచనాలను ఆర్‌బిఐ పెంచడం మార్కెట్‌కు కలిసొచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 266 పాయింట్లు లాభపడి 83,580 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 50 పాయింట్లు పెరిగి 25,693 వద్ద ముగిసింది.
వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచాలన్న ఆర్‌బిఐ నిర్ణయంతో పాటు, స్థిరత్వానికి ప్రాధాన్యం ఇస్తామన్న సంకేతాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. అయితే, బెంచ్‌మార్క్ సూచీలకు భిన్నంగా బ్రాడర్ మార్కెట్లు మిశ్రమంగా స్పందించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.02శాతం, స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 0.27శాతం మేర నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే ఎఫ్ఎంసిజి సూచీ 2.27 శాతం మేర భారీగా లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ప్రైవేట్ బ్యాంకులు, రియల్టీ రంగాలు కూడా లాభపడ్డాయి. మరోవైపు, నిఫ్టీ ఐటీ 1.47 శాతం, ఫార్మా 0.72 శాతం మేర నష్టపోయాయి. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లకు (ఆర్ఇఐటి) రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులకు అనుమతిస్తామని ఆర్‌బిఐ సూచించడం మార్కెట్‌కు మరింత మద్దతునిచ్చింది.

# తగ్గిన బంగారం, వెండి ధరలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు శుక్రవారం భారీగా కుప్పకూలాయి. రెండు రోజులుగా కొనసాగుతున్న లాభాలకు బ్రేక్ పడింది. ఇండియా బులియన్స్ వెబ్‌సైట్ ప్రకారం కిలో వెండి ధర రూ.2.47 లక్షలకు పడిపోగా, 10 గ్రాముల బంగారం ధర స్వల్పంగా తగ్గి రూ.1.52 లక్షల వద్దకు చేరింది. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, డాలర్ బలపడటం వంటి కారణాలతో ఈ పతనం చోటు చేసుకుంది. గత రెండు రోజులుగా లాభాల్లో పయనించిన వెండి, గురు వారం నాటి మార్కెట్ క్రాష్ తర్వాత కోలుకోలేకపోయింది. స్పాట్ మార్కెట్లో వెండి ధర ఏకంగా 20శాతం పతనమై ఔన్సుకు 71 డాలర్ల దిగువకు చేరింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో మార్చి నెల వెండి ఫ్యూచర్స్ ఏకంగా రూ.26,850 (10శాతం) తగ్గి కిలో రూ.2,42,000 వద్ద ట్రేడ్ అయింది. అంతకుముందు సెషన్‌లో దీని ధర రూ. 2,68,850గా ఉంది. బంగారం ఫ్యూచర్స్‌లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఏప్రిల్ కాంట్రాక్ట్ రూ.2,310 (1.51శాతం)తగ్గి 10గ్రాములు రూ.1,50,736 వద్ద ముగి సింది. గత నెలలో స్పెక్యులేటివ్ ట్రేడింగ్, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి కారణాలతో బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. అయితే, ఈ పెరుగుదల ఎక్కువ కాలం నిల వదని, ధరలు చాలా వేగంగా పెరిగాయని విశ్లేష కులుహెచ్చరించారు. వారి అంచనాలకు అను గుణంగానే గతవారం నుంచిమార్కెట్లలో భారీ దిద్దుబాటు మొదలైంది.

**ప్రధాన నగరాల్లో ధరలు:** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగా రంధర రూ.1,52,180గా ఉండగా, ఢిల్లీలో రూ.1,51,910గాఉంది. దక్షిణ భారతనగరాల్లో ధరలు అత్యధికంగా ఉన్నా యి. చెన్నైలో తులం బంగారం ధర రూ.1,52,620 కాగా, హైదరాబాద్‌లో రూ.1,52,420, బెంగళూరులో రూ.1,52,300గా నమోదైంది. వెండి విషయానికొస్తే, చెన్నైలో కిలో వెండి ధర అత్యధికంగా రూ.2,47,590గా ఉంది. హైదరాబాద్‌లోరూ.2,47,260, బెంగళూరులో రూ.2,47,060 వద్ద ట్రేడ్‌అయ్యింది. ముంబైలో కిలోవెండి ధర రూ.2,46,870గా, ఢిల్లీలో రూ.2,46,440గాఉంది. కోల్‌కతాలో రూ. 2,46,540 వద్ద కొనసాగింది.

# ఎఐ పెనుముప్పు: అమెరికా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం

## భారత్ టెట్ కంపెనీలపై ప్రభావం చూపే అవకాశం: యుఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ హెచ్చరిక



**వాషింగ్టన్, ఫిబ్రవరి 6:** అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఒకముప్పుగా పరిణమించిందని, ఈ టెక్నాలజీ వినియోగంపై రెగ్యు లేటర్లు నిఘాను కఠినతరం చేస్తున్నారని యుఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ వెల్లడించారు. సెనేట్ బ్యాంకింగ్ కమిటీ ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఓవర్‌సైట్ కౌన్సిల్ (ఎఫ్ ఎస్ఓసి) 2025 వార్షిక నివేదికలో ఏఐని నాలుగు ప్రధాన దృష్టి సారించాల్సి న అం శాల్లో ఒకటిగా చేర్చినట్లు బెస్సెంట్ తెలిపారు. "ఆర్థిక స్థిర త్వాన్ని బలో పేతం చేసేందుకు ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించడానికి కౌన్సిల్ ప్రాధాన్యత ఇస్తోంది. ఏఐ అనేది ఒక గొప్ప సాధనం, కానీ అదే సమ యంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర శక్తుల ద్వారా ప్రమాదకరంగా కూడా మా రగలదు" అని ఆయన హెచ్చరించారు. ఫ్రాడ్ గుర్తింపు, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి వాటిలో ఏఐ వినియోగం పెరుగుతోందని చెప్పారు. పెరుగుతున్న ముప్పులను పర్యవేక్షించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వాములతో పాటు అంతర్జాతీయ సంస్థలతో కలిసి ఎఫ్ఎస్ఓసి పని చేస్తోందని బెస్సెంట్ వివ రించారు. ఏఐతో పాటు సైబర్ సెక్యూరిటీ కూడా ఆర్థిక సంస్థలకు, కీలక మౌలిక సదు పాయాలకు పెను సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. ఈ విచారణలో రిపబ్లికన్లు ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని స్వాగతించగా, డెమొక్రాట్లు మాత్రం తగిన రక్షణ చర్యలు లేకుం డా ఆర్థిక ఆవిష్కరణలు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు రుణాల జారీ, కస్టమర్ సర్వీస్ కోసం ఏఐని వేగంగా వినియో గిస్తున్న తరుణంలో అమెరికా రెగ్యులేటరీ సంకేతాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈపరిణామాలు సరిహద్దు కార్యకలా పా లున్న భారత టెక్ కంపెనీలు, ఆర్థిక సంస్థలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# గరిష్ట స్థాయికి విదేశీ మారక నిల్వలు

## 723.77 బిలియన్ డాలర్లకు చేరిక




**ముంబై, ఫిబ్రవరి 6:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా గణాంకాల ప్రకారం, జనవరి 23తో ముగిసిన వారంలో భారతదేశ విదేశీ మారక నిల్వలు కొత్త చారిత్రాత్మక గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. బంగారు నిల్వలు, విదేశీ కరెన్సీ ఆస్తులు రెండింటిలోనూ పెరుగుదల కారణంగా, ఈ వారంలో విదేశీ మారక నిల్వలు 8.053 బిలియన్ డాలర్లు పెరిగి 709.433 బిలియన్ డాలర్లకు చేరాయి. గత కొన్ని వారాలుగా, విదేశీ మారక నిల్వలు ఎక్కువగా పెరుగుదల ధోరణిలోనే ఉన్నాయి. దీనికి ముందు సెప్టెంబర్ 2024లో 704.89 బిలియన్ డాలర్ల గరిష్ట స్థాయిని తాకింది. జనవరి 23తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వలలో అతిపెద్ద భాగమైన భారతదేశ విదేశీ కరెన్సీ ఆస్తులు (ఎఫ్‌సిఎ) 2.367 బిలియన్ డాలర్లు పెరిగి 562.885 బిలియన్ డాలర్లకు చేరాయి. ఆర్‌బిఐ డేటా ప్రకారం, బంగారు నిల్వలు ప్రస్తుతం 123.088 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి, ఇది గత వారం కంటే 5.635 బిలియన్ డాలర్లు ఎక్కువ. డిసెంబర్ ప్రారంభంలో జరిగిన తాజా ద్రవ్య విధాన సమీక్ష సమావేశం తర్వాత, దేశ విదేశీ మారక నిల్వలు 11 నెలలకు పైగా వాణిజ్య దిగుమతులకు సరిపోతాయని ఆర్‌బిఐ పేర్కొంది. మొత్తంమీద, భారతదేశ బాహ్య రంగం పటిష్టంగా ఉంది. బాహ్య ఆర్థిక అవసరాలను సులభంగా తీర్చగలమని ఆర్‌బిఐ విశ్వాసంతో ఉంది. గణాంకాల ప్రకారం, 2025లో విదేశీ మారక నిల్వలు సుమారు 56 బిలియన్ డాలర్లు పెరిగాయి. 2024లో, నిల్వలు 20 బిలియన్ డాలర్లకు పైగా పెరిగాయి. 2023లో, భారతదేశం తన విదేశీ మారక నిల్వలకు సుమారు 50 బిలియన్ డాలర్లను జోడించింది, అయితే 2022లో మొత్తం 71 బిలియన్ డాలర్ల క్షీణత నమోదైంది. విదేశీ మారక నిల్వలు అనేవి ఒక దేశపు కేంద్ర బ్యాంకు లేదా ద్రవ్య అథారిటీ వద్ద ఉండే ఆస్తులు. వీటిని ప్రధానంగా అమెరికన్ డాలర్ వంటి రిజర్వ్ కరెన్సీలలో, మరియు తక్కువ మొత్తంలో యూరో, జపనీస్ యెన్, మరియు పౌండ్ స్టెర్లింగ్‌లలో ఉంచుతారు. రూపాయి విలువ తీవ్రంగా పడిపోకుండా నిరోధించడానికి ఆర్‌బిఐ తరచుగా ద్రవ్య లభ్యతను నిర్వహించడం ద్వారా, డాలర్లను అమ్మడం వంటి చర్యలతో జోక్యం చేసుకుంటుంది. రూపాయి బలంగా ఉన్నప్పుడు ఆర్‌బిఐ వ్యూహాత్మకంగా డాలర్లను కొనుగోలు చేస్తుంది మరియు బలహీనపడినప్పుడు విక్రయిస్తుంది.

# ఫెడ్ భయం.. బిట్‌కాయిన్ డభేల్

## క్రిప్టో ప్రపంచంలో మహా పతనం

## కనిష్ఠానికి పడిపోయిన బిట్‌కాయిన్

## ఒక్కరోజులోనే ఇన్వెస్టర్ల సంపద 100కోట్ల డాలర్ల ఆవిరి

## టెక్ షేర్ల అమ్మకాలతో క్రిప్టో విలవిల



**ముంబై, ఫిబ్రవరి 6:** డిజిటల్ బంగారంలా వెలిగిపోతుందనుకున్న క్రిప్టో మార్కెట్ ఒక్కసారిగా కుప్పకూలింది. ట్రేడింగ్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ విలువ 13 శాతం మేర క్షీణించి, సుమారు 63,295 డాలర్ల వద్ద 15 నెలల కనిష్ఠ స్థాయిని తాకింది. 2024 నవంబర్‌లో అమెరికాఅధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలిచినప్పటి నుంచి కొనసాగుతున్న జోష్‌ను ఈతాజా పతనం పూర్తిగా తుడిచిపెట్టేసింది. గత అక్టోబర్‌లో 1.26 లక్షల డాలర్ల రికార్డు స్థాయిని తాకిన బిట్‌కాయిన్, ఇప్పుడు ఆ గరిష్ఠాల నుంచి సగానికి పైగా విలు వను కోల్పోవడం గమనార్హం. కేవలం 24 గం టల వ్యవధిలోనే క్రిప్టో మార్కెట్లో సుమారు బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,300 కోట్లు) విలువైన పొజిషన్లు లిక్విడేట్ అయ్యాయి. అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు ప్రపంచ క్రిప్టో మార్కెట్ ఏకంగా 2 ట్రిలియన్ డాలర్ల సంపదను కోల్పోయింది. రెండో అతిపెద్ద కరెన్సీ అయిన 'ఇథీరియం' కూడా 13 శాతానికి పైగా నష్టపోయి 1,854 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బిట్‌కాయిన్ మైనింగ్ చేసే కంపెనీలు సైతం తమ వద్ద ఉన్న నిల్వలను అమ్మకానికి పెట్టవచ్చనే వార్తలు ఇన్వెస్టర్లలో మరింత గుబులు రేపుతున్నాయి.
క్రిప్టో పతనానికి కేవలం ఒక్క కారణం మాత్రమే కాదు, అంతర్జాతీయంగా చోటుచేసుకున్న పరిణామాలు తోడయ్యాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తదుపరి చైర్మన్‌గా కెవిన్ వార్ష్‌ను ట్రంప్ నామినేట్ చేయడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ఆయన కఠినమైన ద్రవ్య విధానాలను అనుసరిస్తారనే భయం ఇన్వెస్టర్లలో మొద లైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంపై అంచనాలు తగ్గడంతో నాస్‌డాక్ వంటి అంతర్జాతీయ టెక్ ఇండెక్స్‌లు కుప్పకూలాయి. బిట్‌కాయిన్ కదలికలు టెక్ షేర్లతో ముడిపడి ఉండటంతో ఈ సెగ క్రిప్టోకు తగిలింది. బంగారం, వెండి ధరల్లో కనిపిస్తున్న విపరీతమైన అస్థిరత కూడా ఇన్వెస్టర్లను రిస్క్ అసెట్స్ నుంచి వెనక్కి తగ్గేలా చేసింది. ప్రస్తుత పతనం స్వల్పకాలిక సర్దుబాటు కాదని, మార్కెట్ పూర్తిగా గడ్డు కాలంలోకి ప్రవేశించిందని మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. సంస్థాగత పెట్టుబడిదారులు క్రిప్టో ఇటిఎఫ్‌ల నుంచి బిలియన్ల కొద్దీ నిధులను వెనక్కి తీసుకుంటుండటం మార్కెట్ బలహీనతను స్పష్టం చేస్తోంది. బిట్‌కాయిన్ 60 వేల డాలర్ల స్థాయిని నిలబెట్టుకోకపోతే, అది మరింత దిగువకు జారుకునే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.